# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

జూన్ 2023

వెల: రూ. 25/-









# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 16 సంచిక: 6


సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
**తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**


ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా।। పులిగడ్డ విజయలక్ష్మి**

ఫొటోగ్రాఫర్:
**పత్తి సుబ్రమణ్యం,** శ్రీనివాస మంగాపురం

డి.టి.పి: **సాయినాథ్**

డిజైన్: **రమేష్**

**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| భక్తి.. ముక్తి.. దాయకం | |
| శయనైకాదశీ వ్రత మాహాత్మ్యం | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ... | 10 |
| మీ ప్రశ్న – మా సమాధానం | 17 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 19 |
| రామాయణ రత్నాకరం | 25 |
| ఓర్పు కలిగియున్న ఒనగూడు విజయాలు | 30 |
| వటసావిత్రీ వ్రతం | 32 |
| తల్లిదండ్రుల సేవ మాధవ సేవ | |
| అను పుండరీకుని చరితము | 36 |
| భక్త కనకదాసు | 40 |
| శయనైకాదశి | 43 |
| తిరుమల సర్వస్వం | 44 |
| శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము | 48 |
| అమ్మ చెప్పింది | 51 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 53 |
| తొలి ఏకాదశి | 57 |
| ముకుందమాల | 60 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |




# భగవంతుడే మనవాడు

మనిషి జన్మించిన తోడనే తల్లితండ్రుల, తోబుట్టువుల సహకారం లభిస్తుంది. బాల్యంలో మిత్రుల సహవాసం, యవ్వనంలో భార్య సహవాసం ఆ తరువాత పుత్రులది లభిస్తుంది. మనిషి జీవించినంతకాలం ఎవరో ఒకరిని తనవాడుగా అనుకుంటూ జీవిస్తుంటాడు. మనిషి యొక్క జీవన కాలంలో తనవారు అనుకునే ఎందరో మారుతూ ఉంటారు. ఒకప్పుడు తనవారుగా ప్రాణాలను సహితం ఇచ్చుటకు సిద్ధంగా ఉన్నవారు మరో సందర్భంలో శత్రువులుగా మారుతారు. శత్రువులు మిత్రులవుతున్నారు. మిత్రులు శత్రువులవుతున్నారు. ఏమిటీ వింత ప్రపంచం? నిజానికి మనకు ఎవరు మిత్రులు, ఎవరు శత్రువులు? ఎవరి కోసం మన ఆరాటం? ఏమి సాధించుటకు మన తపన, పెనుగులాట? నిన్న నాది అనుకున్నది ఈరోజు మరొకరు అనుభవించుచున్నారు. నేడు నా సొంతం అయింది నిన్న వేరొకరిది. ఇంతకు ఏది మనది? ఎవరు మనవారు? తర్కించి చూస్తే అంతా శూన్యమే. ఏ ఒక్కరూ మనవారు కాదు. ఏ ఒక్క ఆస్తీ మనది కాదు. అంతా ఒక భ్రమలాగా కనపడుతుంది. కాని భ్రమ కాదు. అది నిజం. మనవారు అనుకున్న వ్యక్తులు కాని, మనదనుకున్న ఆస్తి కాని ఆ సమయంలో నిజంగా మనదే. అందులో సందేహం లేదు. మనవారిని గిల్లితే చలనముంది. మనదనుకున్న ఆస్తిని అమ్ముకుంటే ధనమొస్తుంది. కాబట్టి వీటిని భ్రమ అని ఏవిధంగా అనగలం? అవి అక్షరాలా నిజమే. అయితే అవి కొన్ని ఘడియలు మాత్రమే మనవద్ద ఉన్నవి. అంతే ఆ తరువాత అవి మనవి కావు. వాటిపై మన పెత్తనం సాగదు. ప్రతి మనిషి జీవితం ఇదేవిధంగా ఉంది. దీనిని గమనించిన చాలామంది దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలంటారు. కాని అసలు రహస్యాన్ని గ్రహించక జీవితాన్ని అధోగతి చేసుకుంటున్నారు. ప్రతి మానవుడు గతంలో ఎన్నో జన్మలు ఎత్తి ప్రస్తుతము ఈ మానవ జన్మను అనుభవించుచున్నాడు. గతంలో ఎత్తిన ప్రతి జన్మలో కూడా ఇలా మనవారనుకున్న ఎంతోమందిని వదిలి వచ్చాము. ఎంతోమందితో శత్రుత్వం వహించాము. మనవనుకున్న ఎన్నో ఆస్తులను రుచి చూచి వదిలిపెట్టాము. చివరికి ఏ ఒక్కరు మనవారు కాదు. ఏ ఒక్కటీ మనతో రాదు అనేది ధృవీకరించబడ్డ నిజం. ఇలాంటి నిజం తెలిసినప్పటికీ వాటిపైన వ్యామోహమును వదిలించుకోలేక మన జీవితాలను పాడు చేసుకొనుట హాస్యాస్పదం. తెలిసి తప్పు చేయుచున్నాం. కాని ఏ మానవుడైతే ఈ నిజాన్ని గ్రహించి ప్రవర్తిస్తాడో వాడు ధన్యజీవి. భగవంతుడైన శ్రీమన్నారాయణుడు ఈ సృష్టిలో ఎన్నో జీవరాశులతో పాటు మానవుణ్ణి సృష్టించి కాలానుగుణంగా మార్పులు కలుగజేస్తున్నాడు. ఈ మార్పుల ప్రభావంతో కాలచక్రంలో పయనిస్తున్నాము. ప్రతిక్షణము మన స్థితిలో మార్పు జరుగుచున్నది. ఈ రోజు మనదనుకున్నది రేపు వేరొకరిది అవుతోంది. మనకు శాశ్వతుడు కేవలం శ్రీమన్నారాయణుడే. ఆయన కూడా ఈ కాలచక్రంలో ప్రస్తుతము తిరుమల కొండపైన మనకోసం శ్రీవేంకటేశ్వరునిగా వెలసి ఉన్నాడు. కాబట్టి ప్రతి వ్యక్తి, మనకు శాశ్వతుడు, మనవాడు శ్రీవేంకటేశ్వరుడే అని బలంగా నమ్మి అర్చించువాడు ధన్యుడు. భగవంతునికి మనలాగా కోటానుకోట్ల మంది భక్తులు ఉన్నప్పటికీ మన స్థానం మనదే. మనవాడనుకునే ప్రతివారినీ ఆదుకునేవాడు తిరుమల శ్రీవేంకటేశ్వరుడే.

|| ఓం నమో వేంకటేశాయ ||

నమో వేంకటేశాయ

వినా వేంకటేశం న నాథో న నాథః |
సదా వేంకటేశం స్మరామి స్మరామి||

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. Editor: Pullagurla Saireddy: Cell : **93482 12354,** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

# చందా వివరాలు
(రూ.లలో)


| | |
|---|---|
| ☐ 1 సం॥ | 250-00 |
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 3,000-00 |
| ☐ పోషకులు | 5,116-00 |
| ☐ రాజపోషకులు | 10,116-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు ఏదేని పీఎస్బీ కాని, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:____________________
____________________
చిరునామా:____________________
____________________
____________________
____________________
____________________
పిన్‌కోడ్:____________________
చందా వివరాలు:____________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

**శ్లో ॥ ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద! ఉత్తిష్ఠ గరుడధ్వజ!**
**ఉత్తిష్ఠ కమలాకాంత! త్రైలోక్యం మంగళం కురు!**


తాత్పర్యం : గోవిందుడా! గరుడధ్వజుడా! లక్ష్మీదేవికి భర్తయైనవాడా! త్వరగా నిద్రలెమ్ము. మూడు లోకములకు శుభములను కల్గించుము.

విశేషములు : గోవింద శబ్దము పాతాళము నుండి భూమిని ఉద్ధరించిన శ్వేత వరాహ విష్ణుమూర్తికి (గాం విదతి ఇతి గోవిందః – భూమిని పొందినవాడు గోవిందుడు) వర్షోపద్రవము నుండి గోవులను కాపాడిన శ్రీకృష్ణునికి, పుట్టలో నివసించియున్న తనకు పాల దానము చేయుచున్న గోవును కాపాడిన శ్రీనివాసునికి (వేంకటేశునికి) చెల్లుచున్నది. కారణము ముగ్గురూ విష్ణుదేవుని అవతారపురుషులే గదా! వారికి అభేదము అని తాత్పర్యము. గరుడధ్వజుడు, కమలాకాంతుడు, విష్ణుదేవుని అవతార పురుషుడు శ్రీనివాసుడే (వేంకటేశుడే) యని తెలియుచున్నది. ఈ సుప్రభాతమున త్రేతాయుగమందలి విష్ణుదేవుని విభవావతారమగు శ్రీరాముని, పిమ్మట ద్వాపర యుగమందలి విష్ణుదేవుని అవతారమగు శ్రీకృష్ణుని నిద్రలేపుట వర్ణించబడింది. పిమ్మట కలియుగ దైవమగు వేంకటేశునికి సుప్రభాతము చెప్పబడుచున్నది (అయిదవ శ్లోకము నుండి). స్వర్గ మర్త్య పాతాళములు ముల్లోకములు. ఈ మూడు లోకములందలి ప్రజలకు శుభమును కల్గించవలసిన బాధ్యత భగవంతునిపై – అవతార పురుషులపై – గలదని తాత్పర్యము.


వ్యాఖ్యానం:
డా॥ సముద్రాల లక్ష్మణయ్య



# ముక్తిమార్గము



### ఆహిరి

కలకాల మిట్లాయఁ – గాఁపురమెల్లా
అల దైవ మెందున్నాఁడో – ఆలకించఁడుగా ||పల్లవి||

1. తనకే సంతసమైతే – తన భాగ్యము వొగడు
తనకుఁ జింత పుట్టితే – దైవము దూరు,
మనుజుని గుణమెల్లా – మాపుదాఁకా నిట్లానె
ఘనదైవ మెందున్నాఁడో – కరుణఁ జూడఁడుగా ||కల||

2. విరివిఁ బాపాలు సేసే – వేళ నాదాయము లెంచు
నరకమంది పుణ్యము – నాఁడు వెదకు,
తిరమైన జీవుని – తెలివెల్లా నీలాగె
ధర దైవ మెందున్నాఁడో – దయఁ జూడఁడుగా ||కల||

3. వేళతో నిద్దిరింపుచు – విరక్తునిలె నుండు
మేలుకొన్నవేళ నన్నీ – మెడఁబూనును,
ఈ లీల దేహిగుణము – యెంచి శ్రీవేంకటేశుఁడు
యేలే దైవమెందున్నాఁడో – యిట్టే మన్నించఁడుగా
||కల||



భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య

భావము : బ్రతికినంత కాలము చేసిన కాపురమంతయు వివేకము లేకపోవుటచే ఇట్లే వ్యర్థమైనది. సర్వమునకు సాక్షీభూతుడైన ఆ దేవుడెచట నున్నాడో! ఎంతగా మొఱపెట్టుకున్నను ఆత డాలకించి జీవుని మంచి త్రోవలో పెట్టడు గదా!

తనకేదైన సంతోషకరమైన పని జరిగినచో మానవుడు తన అదృష్టమును పొగడుకొనును. తనకు విషాదకరమైన సంఘటన జరిగినచో దైవమును నిందించును. మానవుని స్వభావమంతయు పుట్టినదాది మరణించువరకు ఇట్లే ప్రవర్తిల్లుచున్నది. ఘనుడైన ఆ దేవుడెచట నున్నాడో గాని మనుజులను దయ చూచి వీరికి బుద్ధి చెప్పడు గదా!

ఎక్కువగా పాపపు పనులు చేయునపుడు వాటిచే గలుగు లాభములమీదనే మనుజుడు దృష్టి నుంచును. కాని భవిష్యత్తులో కలుగనున్న గొప్ప విపత్తును ఊహింపడు. తుదకు పాపఫలమైన నరకమును పొంది ఆనాడు 'అయ్యో! పుణ్యము చేయనైతినే' అని విచారించును. జీవుని తెలివి యంతయు ఇట్లే ముందుచూపు లేక మోసపోవుచున్నది. ఇంతకు ఆ దయామయుడైన దేవుడెక్కడ దాగియున్నాడో, వీనిని కరుణింపడు గదా!

జీవుడు రాత్రి సమయ మైనంతనే నిద్రించుచు ఏమియు లోకసంబంధము లేని విరక్తునివలె నుండును. కాని ఉదయము మేల్కాంచినంతనే లౌకిక కార్యములన్నింటిని మెడకు దగిలించుకొని కష్టపడుచున్నాడు. దేహధారియైనవాని స్వభావమంతయు ఇట్లే యున్నది. సమస్త లోకపాలకుడైన శ్రీవేంకటేశ్వరుడెందున్నాడో! ఈ దుఃస్థితిని పరిశీలించి ఆయన జీవునికి వివేకము కలిగించి కాపాడుట లేదు గదా!



# భక్తి... ముక్తి... దాయకం
## శయనైకాదశీ వ్రత మాహాత్మ్యం

చింతపాటి శివశంకర శాస్త్రి

శ్లో ॥ "పంకజా సన శక్ర శంకర పూజితాంఘ్రి సరోరుహమ్
దేవదానవ సిద్ధ సాధ్యనరాది భావిత వైభవమ్
సంకటోత్తరణోజ్జ్వల ద్రుచితోషితాఖిల సేవకమ్
వేంకటేశ్వర పాదపంకజ మాశ్రయే నిఖిలాశ్రయమ్"

పద్మనేత్రుడు, పద్మనాభుడు, పద్మమాలాధరుడు, పద్మచరణుడు, దేవదేవుడు, అనంత శక్తిస్వరూపుడు, అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, ఆపద్బాంధవుడు అయిన మహావిష్ణువు భక్తుల కష్టాలను గట్టెక్కించి, వారి కోరికలు తీర్చే ఆ దేవదేవుని స్మరణం కైవల్య దాయకం, భక్తిముక్తి దాయకం.

తిథులలో పదునొకండవ తిథిని ఏకాదశి అని అంటారు. మనకు సంవత్సరంలో ఇరవై నాలుగు ఏకాదశులు వస్తాయి. అధిక మాసం వచ్చిన మాసంలో మరో రెండింటిని కలుపుకొని ఈ ఏకాదశులు ఇరవై ఆరు వస్తాయి. ఏకాదశి తిథి శ్రీమన్నారాయణునకు అత్యంత ప్రీతికరం. విష్ణుమూర్తి అనుగ్రహప్రాప్తి కొరకు ఏకాదశి తిథిని నియమ నిష్ఠలతో ఆచరించెదరు.

శ్లో ॥ "గంగా గీతా తథా భిక్షుః కపిలాశ్వాత్థ సేవనమ్
వాసరం పద్మనాభస్య పావనం కిం కలౌయుగే"

కలియుగమున గంగానది, గీత, సాధుపుంగవులు, కపిలగోవు, రావిచెట్టు – వీటి సేవనం, విష్ణుభగవానుని పర్వదినమైన ఏకాదశీవ్రతాచరణం – వీటిని మించిన పావనకరమైనవి ఏవికలవు? ఏకాదశి విష్ణువుకు ప్రీతిపాత్రమైనందున ''విష్ణువాసరం'' అని కూడా పిలుస్తారు.

సంసార సాగరంలో చిక్కుకొని అనేకానేక కష్టనష్టాలు అనుభవించే మానవజాతిని ఉద్ధరించేందుకు సాక్షాత్ ఆ మహావిష్ణువే ఏకాదశి తిథిని ఏర్పాటు చేశాడని, ఈ ఏకాదశిని నియమ నిష్ఠలతో ఆచరించేవారు సర్వవ్యాధుల నుండి విముక్తిని పొందుతారని, వారికి మరణానంతరము వైకుంఠప్రాప్తి కలిగి తీరుతుందని పద్మపురాణం పేర్కొంటుంది.

ఏకాదశి నాడు విగ్రహారాధన, ఉపవాసముండుట మున్నగునవి ముఖ్యమైనవి. ఏకాదశి రోజున ఉపవాస వ్రతాన్ని పాటించడం వల్ల సూర్య చంద్ర గ్రహణ సమయాలలో చేసేదానం, అశ్వమేధయాగం చేసిన ఫలితాల కంటే అధిక ఫలం లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఇరవై ఏడు నక్షత్రాలలో స్వాతి నుండి శ్రవణం వరకు గల ఎనిమిదింటిని విష్ణు నక్షత్రాలంటారు. చంద్రుడు విష్ణు నక్షత్రాలతో సంచరించే తిథులను బట్టి ఏకాదశులకు ప్రత్యేకమైన పేర్లు వచ్చాయి. తొలి ఏకాదశి, భీష్మైకాదశి, లలిత, కామికచ అజ ఏకాదశి, నిర్జల వైకుంఠ ఏకాదశి – ఇలా వివిధ నామాలతో ఏర్పడిన ఏకాదశుల్లో తొలి ఏకాదశికి అత్యంత ప్రాధాన్యముంది. ఆషాఢమాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశిగా వర్ణించింది పద్మపురాణం. శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో శేషతల్పం పైన శయనించే శుభదినం కనుక దీనిని ''శయనైకాదశి'' అని కూడా పిలుస్తారు. ఈరోజు నుండి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు శ్రీమహావిష్ణువు పాలకడలిపై శయనిస్తాడు. అందుకే దీనిని శయనైకాదశి అంటారు. ఈ ఏకాదశి తర్వాత రోజు ద్వాదశినే క్షీరాబ్ధి ద్వాదశి అని అంటారు. శ్రీహరి యోగనిద్రలో ఉండే ఈ నెలల కాలాన్ని పవిత్రంగా భావించి, పరిగణించి చాతుర్మాస్య దీక్ష చేస్తారు. ఇది దక్షిణాయన ప్రారంభకాలం. ఉత్తరాయణం కంటే దక్షిణాయనంలో పండుగలు అధికం. అనేక పండుగలను వెంటబెట్టుకుని వచ్చే తొలి పండుగ తొలి ఏకాదశి. ఏకాదశి ఆవిర్భావం గురించిన కథ భవిష్యోత్తర పురాణంలో ఉన్నది.

శ్రీమహావిష్ణువు తాలజంఘుడు అనే రాక్షసునికుమారుడైన మురాసురునితో యుద్ధం చేస్తూ, అలసిపోయి విశ్రమించగా అతని శరీరం నుండి ఒక కన్యక ఉద్భవించి, మురాసురుణ్ణి ఎదుర్కొని సంహరించింది. అందుకు సంతోషించిన విష్ణువు ఆ కన్యను ఏదైనా వరం కోరుకొమ్మన్నాడు. అందుకు ఆ కన్య ఏకాదశి తిథిగా వినుతికెక్కాలని భావించి ఆ భాగ్యమును తనకు ప్రసాదించమని, విష్ణుప్రియగా వరమిమ్మని కోరుకుంది. ఆ రోజు నుండి తొలి ఏకాదశి ఏర్పడిందని పురాణ కథనం.

శ్రీహరి వరం వల్ల భక్తకోటి ఆరాధనలు, అర్చనలు అందుకుంటున్నది. ఆ సాత్వికశక్తి, ఆవిర్భవించిన ఆషాఢ శుద్ధ ఏకాదశిగా ఆది ఏకాదశి, తొలి ఏకాదశిగా పిలుస్తున్నాము.

ఏకాదశి తిథికే మరొక విశేషార్థము కూడా వాడుకలో నున్నది. అయిదు కర్మేంద్రియాలు, అయిదు జ్ఞానేంద్రియాలను కలిపి ''ఇంద్రియ దశకం'' అంటారు. ఒక్కొక్క తిథి ప్రభావం ఒక్కొక్క ఇంద్రియంపై ఉంటుంది. ఇంద్రియాలన్నింటికి రాజు మనస్సు. దానిని పదకొండవ ఇంద్రియముగా భావించారు మన పూర్వీకులు. తిథులలో పదకొండవ తిథి ఏకాదశి. దానిని తిథులలో నిర్ణయాత్మక శక్తిగా నిర్ణయించారు మన పూర్వులు. ఏకాదశి నాడు మనసు ప్రభావితమవుతుందని పెద్దల మాట. ఏకాదశి తిథి సాత్విక విశేషం కావున ఆనాడు పరమ సత్వరూపుడైన శ్రీమహావిష్ణువును ఉపాసించడం, సాత్విక నియమాలతో గడపటం ఏకాదశి వ్రతంలో నిర్దిష్టాలయ్యాయి.

ఆషాఢమాస శుక్లపక్ష ఏకాదశి నుండి కార్తీక మాస శుక్లపక్ష ఏకాదశి వరకు ఉండే నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్య కాలం అంటారు. దీనినే 'హరికాలం' అనే మరొక నామంతో ఋషులు పిలుస్తుంటారు. ఈ కాలం ఉపాసనాపరులకు, మంత్రసాధనాపరులకు, మహర్షులకు, సాధువులకు పరమ పవిత్రమైన కాలం. ఆషాఢమాసంలో శుక్లపక్షపు ఏకాదశి నాడు శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో నిద్రకు ఉపక్రమిస్తాడు. నాలుగు నెలల పాటు శేషశయనుడై, కార్తీకశుక్ల ఏకాదశినాడు నిద్రనుండి లేస్తాడు. ఆయన నిద్రకు ఉపక్రమించే తిథిని శయనైకాదశి అని, నిద్రనుండి లేచే తిథిని ఉత్థాన ఏకాదశి అని వ్యవహరిస్తారు. ఖగోళపరంగా చూస్తే ఈరోజు దాకా ఉత్తర దిశగా వాలి కనిపించే సూర్యుడు, తొలి ఏకాదశి నుంచి దక్షిణ దిశగా వాలినట్లు కనిపిస్తాడు. దక్షిణాయనంలో వచ్చే మొదటి ఏకాదశి కనుక దీనిని తొలి ఏకాదశి అని వ్యవహరించారు.

శ్రీమహావిష్ణువు నిరంతర నిర్నిద్రుడు. అనగా నిద్ర ఎరుగనివాడు. శ్రీమహావిష్ణువు నిజంగా నిద్రిస్తే లోకాలన్నీ జలప్రళయం అయిపోతాయి. ఇది మానవుల నిద్ర వంటిది కాదు. విషయవాసనోపశమనం. మానవునిలో విపరీతమైన కోరికలు విజృంభించి వారిని రోగులుగా చేసేకాలం చాతుర్మాస్యకాలం. స్వామి నిద్రిస్తున్నట్లుగా కళ్ళు మూసుకోగానే, ఆయన భక్తులందరకు విషయ వాసనలు ఉపశమిస్తాయి. లోక శ్రేయస్సు కోసం, జగన్నాటక సూత్రధారి నిద్రకు ఉపక్రమించినట్లు నిద్ర నటిస్తున్నాడు.

నిద్రా నాటకంలో ఉన్న స్వామి మన హృదయాలలో ప్రవే శించి, ఆయన అనుగ్రహానికి పాత్రులై తరించడానికి భక్తులకు చాతుర్మాస్య నియమం ఏర్పాటు చేసినవాడు సాక్షాత్తు బ్రహ్మదేవుడే అని బ్రహ్మాండ పురాణం చెబుతోంది. చాతుర్మాస్యంలో భాగవత గాథలు వింటే సామాన్యుడు కూడా మహోన్నత స్థానం పొందగలుగుతాడు.

పరమ పవిత్రమైన ఏకాదశినాడు విష్ణువును పూజించడం ఆచారంగా వస్తోంది. చాలా ప్రాంతాల్లో గోపద్మవ్రతం ఆచరిస్తారు. ఈ నాలుగు నెలలు వర్షాకాలం కనుక పశువుల కొట్టాలను శుభ్రం చేసుకుంటారు. పశువులకు ఎలాంటి అనారోగ్యం కలగకుండా కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా చేసే వ్రతమే గోపద్మవ్రతం. వర్ష శరదృతువులు కుండలినీ శక్తిని ప్రచోదనం చేసి, అమృతవర్ష ధారలలో సాధకుడిని అమ్మవారిగా మార్చే దివ్య ఋతువులని కాళికోప పురాణం చాటుతున్నది. నాలుగు నెలలూ అత్యంత పవిత్ర దినాలే. అయినా చాతుర్మాస్యకాలంలో వచ్చే ఏకాదశులు మరింత పవిత్రమైనవని నారద పురాణం ద్వారా తెలుస్తోంది.

ఏకాదశినాడు ఉపవాసముండుట, విగ్రహారాధన ముఖ్యమైనవి. ఉపవాస ఫలమును పొందగోరువారు రెండు పూటలా భుజించరాదు. ముందు రోజు అనగా దశమి నాటి రాత్రి నియమంగా ఉండాలి.

**"ఏకాదశ్యాం నిరాహారః స్థిత్వాఽహ మపరేఽ హని**
**భోక్ష్యామి పుండరీకాక్ష శరణం మే భవాఽచ్యుత"**

''నేను ఈ ఏకాదశి నాడు ఆహారాన్ని స్వీకరించకుండా ఉండి తరువాతి రోజున (ద్వాదశి) భోజనం చేస్తాను. ఓ పుండరీకాక్ష! అచ్యుత! నిన్నే శరణు జొచ్చి ఈ వ్రతాన్ని ఆచరించేలా చేయమని ప్రార్థిస్తున్నాను'' అని ప్రార్థించాలి. ఉపవాసం చేసే రోజు మాటి మాటికీ నీరు త్రాగినా, తాంబూలం నమిలినా, పగలు నిద్రించినా, మైథునం జరిపినా ఉపవాస ఫలం నశిస్తుంది.

**"ఉపవాసా(ఽ)సమర్థ శ్చేరేకం విప్రంతు భోజయేత్**
**ద్రవ్యదాలోపవాసస్య ఫలం ప్రాప్నోత్యచ సంశయం"**

ఉపవాసం చేయడానికి అశక్తుడైతే బ్రాహ్మణునికి భోజనం పెట్టాలి (లేదా) భోజన మాత్రదానం ఇవ్వాలి. బ్రాహ్మణునికి భోజనం పెట్టకుండా తిన్నట్లయితే రెండింతలు అధికంగా దానం ఇవ్వాలి. ద్రవ్యాన్ని దానం చేసినవాడు ఉపవాస ఫలితాన్ని తప్పకుండా పొందుతాడు. అనారోగ్యం వలన ఉపవాసం చెయ్యలేకపోతే వెయ్యిసార్లు గాయత్రిని జపించాలి. లేదా పన్నెండుమార్లు ప్రాణాయామం చెయ్యాలి. కొందరు ఉపవాసం పేరుతో పాలు, పండ్లు అధికంగా తీసుకుంటూ ఉంటారు. నిజానికి ఉపవాసమనగా శాస్త్రాలు ఈవిధంగా పేర్కొన్నాయి.

''ఉపవాసం – ఉప...వాసం''. 'ఉప' అనే శబ్దానికి సమీపంలో అని అర్థము. ''వాసము'' అనగా నివసించడం. ఉపవాస మనగా సమీపంలో నివసించడం అని అర్థం చెప్పుకోవచ్చు. దేనికి సమీపంలో అనగా భగవంతునికి సమీపంలో అని అర్థము. ఉచ్ఛ్వాస, నిశ్వాసములలో దైవచింతన ఇమిడి ఉండాలి. మనస్సు నిర్మలంగా ఉండి సదా భగవద్భజనలో, భాగవద్ధ్యానంలో విహరించాలి. హరినామ స్మరణం నిరంతరం చేయాలి. బుద్ధిని భగవంతునిపై కేంద్రీకరించాలి. భగవద్గీతను, విష్ణుసహస్ర నామములను చదవాలి. హరికథలను వినాలి. కామ క్రోధ లోభ మోహ మదాలను త్యజించాలి. పరనింద చేయరాదు. వినరాదు. పగటినిద్ర పనికిరాదు. దేవదేవుని ముందు నృత్యములు, గీతములు వాద్య పురాణాదులతో కాలక్షేపము చేయాలి. ఏకాదశి నాటి రాత్రంతా జాగరణ చేయాలి. ద్వాదశి తిథి నాడు ప్రాతః కాలముననే లేచి కాలకృత్యములు తీర్చుకుని స్నానానంతరం విష్ణువును పూజించవలెను. పంచామృతముతో స్నానము, క్షీరముతో అభిషేకము చేయవలెను. అభిషేకానంతరం శక్త్యానుసారం బ్రాహ్మణులకు భోజనం పెట్టి దక్షిణను సమర్పించాలి. పంచమహా యజ్ఞములను ఆచరించి బంధు మిత్ర సకుటుంబ సమేతంగా కలిసి భోజనం చేయాలి. భోజనం చేయు సమయంలో మౌనమును పాటించవలెను. ఈ విధంగా ఏకాదశి వ్రతమును ఆచరించినవారు పునరావృత్తి రహితమైన వైకుంఠ ధామమునకు చేరెదరు. ఈ వ్రతమును త్రికరణశుద్ధిగా, చిత్తశుద్ధితో ఆచరించినవారు అశ్వమేధ యజ్ఞ ఫలమును, భూరి దానములొనర్చిన పుణ్యమును, అరువది వేల సంవత్సరముల తపఃఫలము పొందుతారని పురాణోక్తి.

ఏకాదశీ వ్రతాన్ని భక్తి ప్రపత్తులతో ఆచరించిన వారిలో రుక్మాంగదుడి కథ కూడా ప్రసిద్ధమైంది. పూర్వం రుక్మాంగదుడు అను రాజు ఉండేవాడు. అతడు విష్ణుభక్తుడు. విష్ణువుకు ప్రీతిపాత్రమైన ఏకాదశి వ్రతమును తాను భక్తి శ్రద్ధలతో ఆచరించడమే కాక తన రాజ్యములోని ప్రజలందరి చేత ఏకాదశీ వ్రతమును ఆచరించేటట్లు శాసనము చేశాడు. వ్రతమును చేయుటకు ఆర్థికముగా శక్తి లేనివారికి సహాయ సహకారములందేటట్లు చేశాడు. తత్ఫలితంగా పాపములు చేసి యమలోకము పోవువారి సంఖ్య నానాటికీ గణనీయంగా తగ్గిపోయింది. యమధర్మరాజు రంభను పిలిచి మోహినీ

వేషమున వెళ్ళి రుక్మాంగదుడి వ్రతమును భంగము చేయుమని ఆజ్ఞాపించాడు. రంభ మోహిని వేషమున వెళ్ళి రుక్మాంగదుడిని ఆకర్షించి వశపరచుకున్నది. రుక్మాంగదుడు మోహిని అందచందములకు ఆకర్షితుడై తనను వివాహమాడమని అభ్యర్థించాడు. మోహిని కూడా అందులకు అంగీకరించింది. కానీ ఒక నియమమును పెట్టింది. సర్వదా రుక్మాంగదుడు ఆమెకు వశమై ఉండాలి. ఆమె మాట ప్రకారం నడుచుకోవాలి అనునది ఆ నియమము. ఆ నియమమునకు అంగీకరించి రుక్మాంగదుడు మోహిని (రంభను) పరిణయమాడాడు. రోజులు ఆనందంగా గడుస్తున్నాయి. తాను ఇంతకాలం నియమ నిష్ఠలతో, భక్తి శ్రద్ధలతో ఆచరించుచున్న ఏకాదశి వ్రతము ఆచరించు సమయం వచ్చింది. రుక్మాంగదుడు ఏకాదశి వ్రతమును ఆచరించుటకు సన్నద్ధమవసాగాడు. రుక్మాంగదుడి వ్రతమును భంగము కావించుటకు ఇదే తగిన సమయమని భావించిన రంభ రుక్మాంగదుడిని తనతో సుఖించమని కోరింది. అందుకు రుక్మాంగదుడు నిరాకరిస్తూ ఏకాదశి రోజున మైథునము నిషిద్ధము. దానికి బదులుగా వేరేదేదైనా అడుగు చేస్తాను అని పలికాడు. తనయుడిని సంహరించి తనకు కానుకగా ఇమ్మని రంభ కోరింది. తనయుడి కంటే ఏకాదశీ వ్రతమే శ్రేష్ఠమని భావించి తనయుడిని సంహరించడానికి కత్తిని ఎత్తాడు. అదే సమయంలో విష్ణువు ప్రత్యక్షమై ఆతని భక్తిని ప్రశంసించి మోహిని నిజరూపమును తెలియబరచి నీ వ్రతమును భంగపరచుటకే ఆ వేషమున వచ్చినదని వివరించాడు. తుదకు మోక్షమును ప్రసాదించాడు.

**"హరి గొల్చుచుండు వారికి**
**బరమేష్ఠి పదంబు మొదలు పరభోగంబుల్**
**నరక సమములను తలపున**
**ధరణి రాజ్యంబు తోడి తగులము మానెన్"**

విష్ణువును గొల్చు భక్తులకు బ్రహ్మ పదవి మొదలైన భోగాలన్నీ నరకంతో సమానమన్న భావంతో భూమండలాధిపత్యము, రాజ్యము పట్ల ఆసక్తిని వదిలి హరిలో లీనమయ్యాడు.

శ్రీహరి తనూద్భవ యైన ఏకాదశి వ్రతమును త్రికరణ శుద్ధిగా ఆచరిస్తూ విష్ణుభగవానుని అనుగ్రహమునకు పాత్రులమవుదాం.

**"విష్ణుం జిష్ణుం మహావిష్ణుం ప్రభవిష్ణుం మహేశ్వరః**
**అనేక రూప దైత్యాన్తం నమామి పురుషోత్తమమ్"**

# మీ ప్రశ్న మా సమాధానం

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు. – ఎడిటర్, శ్రీవేంకటేశం**

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. విజయానికి రహస్యం ఏమిటి? కేవలం మానవ యత్నంతో విజయం లభించదా? – ముదుంబై నిర్మల, అల్వాల్**

జవాబు : విజయం సాధించాలని ప్రతి వారికీ ఉన్నా కొందరే తమ ప్రయత్నంలో సఫలీకృతులవుతారు. ఎందుకు?

1. మొదటగా "నేను నా ప్రయత్నంతో తప్పక విజయం సాధిస్తాను" అని కేవలం దృఢంగా అనుకోవడమే కాక తదనుగుణంగా ఒక ప్రణాళిక వేసుకుని తగిన సాధనాలతో, తగినంత కృషితో, తగని పనులు మాని, నిరంతరం శ్రమించాలి. అప్పుడే విజయం మనల్ని వరిస్తుంది.

2. విజయాన్ని విశ్వసించడం అనేది చాలా చాలా ముఖ్యం.

3. ఇంతకుముందు విజేతలైనవారి గురించి తెలుసుకుని వారు అనుసరించిన విధానాలను అవగతం చేసుకోవాలి.

4. చేసే శ్రమలో నిజాయితీ, ఉత్సాహం, ఉత్తేజం, సానుకూల దృక్పథం ఉండాలి.

5. గెలవాలి అంటే ఇంతకుముందు తను చేసిన ప్రయత్నాలు ఎందుకు ఫలించలేదో విశ్లేషించుకుని అవసరమైన మార్పులు, చేర్పులూ చేసుకుంటూ, అనుభవజ్ఞుల సూచనలు పాటిస్తూ ముందుకు వెళ్ళాలి. అయితే ఫలితం ఏదైనా సరే, అది దైవనిర్ణయంగా భావించాలి. భగవద్గీతలో కృష్ణుడు చెప్పింది ఇదే. పని చేయడం నీ వంతు. ఫలితం దైవానికి వదిలెయ్యి. మానవ యత్నంలో లోపం ఉండరాదు. (Accept result as God's gift) అంతే.

**2. చరమ శ్లోకం అని పిలువబడే భగవద్గీతలోని "సర్వధర్మాన్ పరిత్యజ్య" ను కొంచెం సరళంగా వివరిస్తారా? -రఘుబాబు, దీప్తిశ్రీ నగర్**

జవాబు : మంచి ప్రశ్న. అష్టాక్షరీ మంత్ర వివరణ ద్వయమంత్రం అయితే ద్వయి మంత్ర వివరణయే ఈ చరమ శ్లోకం. అష్టాక్షరి, ద్వయి మంత్రాల్ని అలా ప్రక్కన పెట్టి చరమ శ్లోకం గురించి మనం ఆలోచిస్తే –

1. చరమశ్లోకం అంటే చిట్టచివరి ఉపాయం అని అర్థం. ఇదే శరణాగతి ఉపాయం.

2. శ్రీవేంకటేశ్వరుడు తనను శరణు వేడమని ఒక చేత్తో తనని చూపిస్తూ ఉంటాడు.


3. శ్లోకం లోని పూర్వార్థం ద్వారా తనని శరణాగతి చేయమని, ఉత్తరార్థంలో అలా చేసినవానిని అన్ని పాపముల నుండి రక్షించి, మోక్షం ఇస్తాను అని అంటాడు శ్రీకృష్ణభగవానుడు.

అహంకార, మమకారాలు వదలడం, స్వామియే రక్షకుడని విశ్వాసంతో ఇహలోక, స్వర్గలోక సుఖాలనిచ్చే ధర్మాలను వదిలి, నిష్కామ బుద్ధితో, ఫలమును ఆశించక కర్మ, జ్ఞాన, భక్తి ఉపాయాలకు బదులు శరణాగతి చేయాలి. పిల్లి పిల్లల వలె మనం నిశ్చింతగా ఉండాలే గాని, కోతి పిల్లల వలె కాదు.



# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ..

**3వ భాగము**



### తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామక్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీవేంకటేశ్వరుని లీలల ధారావాహికం

**పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవింద దాసు)**

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన భక్తుల ఉద్ధరణ కోసమని సిద్ధిపేటకు 7 కిలోమీటర్ల దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామం లోని మా తోటబావి వద్ద తన ''హరినామ క్షేత్రమును'' ఏర్పాటు చేసుకోదలచారు. స్వామివారు స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని, ఇక్కడి ప్రజలను తిరుమలతో సమానంగా అనుగ్రహించదలచుకున్నారు. తిరుమల ఆలయాన్ని కనీసం రెండు ప్రాకారాల వరకైనా నిర్మించి, వివిధ భక్తబృందాలచే అఖండ హరినామ సంకీర్తనలను ఏర్పాటు చేయుట నా కర్తవ్యంగా దిశా నిర్దేశం చేశారు. ఈ సంకల్ప సిద్ధి కోసం స్వామివారు సం॥ 2000 నుండి కావలసిన శిక్షణను ఇచ్చుచు సం॥ 2022 ఏప్రిల్ లో తన అసలు లక్ష్యమును తెలిపారు.

ప్రస్తుతము ఈ లక్ష్యాన్ని నెరవేర్చుటకు కావలసిన శిక్షణను కొనసాగించుచున్నారు. స్వామివారు ప్రసాదించిన సేవల ద్వారా తగిన యోగ్యతను సాధించి హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయవలసిందిగా దిశా నిర్దేశం చేశారు. నా జీవితములో స్వామివారి ప్రత్యక్ష లీలలు సం॥ 2000 లో ప్రారంభమైనప్పటికీ పరోక్షంగా నా పుట్టుక, రూపురేఖలు, బాల్యం, విద్యాభ్యాసం, గుణాలు అన్నీ ఈ సంకల్పానికి అనుగుణంగా ప్రసాదించాడు.

ఈ భాగం నుండి నా పరిచయంతో పాటు స్వామివారు ప్రసాదించిన అనుభూతులను మొదటి నుండి ఒక్కొక్కటి వరుస క్రమంలో వివరించుచున్నాను.

## నా పరిచయం

నా పేరు పుల్లగూర్ల సాయిరెడ్డి. మాది సిద్ధిపేట నుండి 7 కి.మీ దూరంలో ఉన్న చిన్నగుండవెల్లి అనే గ్రామము. మా తల్లితండ్రులు కీ.శే పుల్లగూర్ల వెంకటరెడ్డి, రుక్కమ్మ దంపతులు. మాకు 'గడీల' అనే మరో ఇంటిపేరు కూడ కలదు. మాది పూర్తిగా వ్యవసాయ ఆధారిత కుటుంబం. మా తల్లితండ్రులకు చాలా రోజుల వరకు సంతానం కలగలేదు. సంతానం కోసం దేవుళ్ళను ప్రార్థించారు. నా కంటె ముందు ఇద్దరు పిల్లలు పుట్టి చనిపోయారట. చివరికి వారి గురువులు చెప్పినట్లు పిల్లల కోసమని ప్రత్యేక పూజలు చేశారట. దాని పుణ్యఫలముతోనే నేను తేది 05-07-1960 తొలి ఏకాదశి రోజున మా ఊరికి మరో 7 కి.మీ దూరమున గల మా అమ్మమ్మ గారి గ్రామమైన అప్పనపల్లిలో జన్మించానన్నారు. నా తరువాత ఒక చెల్లెలు 'లలిత' కలదు. నన్ను అత్యంత ప్రేమతో పెంచారు. నాకంటే ముందు ఇద్దరు చనిపోవుట వలన మా అమ్మ నాకు దిష్టి తగలకుండా ఉండుటకని మగపిల్లవాణ్ణైనప్పటికీ ముక్కు, చెవులు కుట్టించుట, ఒక సంవత్సరము వరకు కొత్తబట్టలు కట్టకుండుట చేసిందట.

నాకు చిన్నప్పటినుండి శ్రీవేంకటేశ్వరుడంటే అమితమైన ఇష్టము. ఎవ్వరూ చెప్పనప్పటికీ 2వ తరగతి నుండి స్వామివారికి ప్రతి శనివారం ఉపవాస దీక్ష చేసేవాడిని. ప్రతి పూజలో ''నన్ను ఈ లోకానికి

ఉపయోగపడే ఏదేని ఒక మంచి పనికి ఉపయోగించుకొండ''ని ప్రార్థించేవాడిని. మాది మాంసాహార కుటుంబం ఐనప్పటికీ నేను చిన్నప్పటి నుండి శాకాహారిని. పదవ తరగతి నుండి మాంసాహారిగా మారాను.

ఊరిలో మాకు తగినంత భూమి ఉన్నప్పటికీ, నీరు లేక పంటలు పండక అత్యంత దయనీయ స్థితిలో బాల్యం గడిచింది. మొదట్లో మా వ్యవసాయం చక్కగా ఉండేది. ఒక నాలుగు బావులు, 70 నుండి 80 వరకు పశువులు, వాటికి రెండు దొడ్లు ఉండేవి. వంశపారంపర్యంగా వచ్చిన భూమితో పాటు మా తల్లితండ్రుల స్వార్జితంగా ఇల్లు, మరికొంత భూమిని కొన్నారు.

మా ఇల్లు చక్కగా సౌకర్యవంతంగా ఉంటుంది. రెండున్నర అడుగుల మందం గల మట్టిగోడలతో కట్టబడ్డది. కట్టె స్తంభాలతో, దృఢమైన ముఖద్వారం, వెనుక కట్టెభేడము, ఇంటి ముందు అరుగులు కలిగి ఉంటుంది. మాకున్న నాలుగు బావులలో తోటబావి ముఖ్యమైనది. తోట, పశువులు అక్కడే ఉండేవి. రోజులో చాలావరకు అక్కడే గడిపేవారిమి.

మా తండ్రి తెలివైనవాడు, ధర్మాత్ముడు, నీతిమంతుడు. మా ఊరికి ఒక పర్యాయం సర్పంచ్ గా ఉన్నాడు. ఈయనకు భూమి అంటే ఎంతో ఇష్టం. ఎంత ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఒక్క ఎకరం భూమిని అమ్ముటకు ఇష్టపడేవారు కాదు. ల్యాండ్ సీలింగ్ లో మాది కొంత భూమి పోయింది. అప్పుడు చాలామంది మా తండ్రి వద్దకు వచ్చి మీ కొడుకు 18 సంవత్సరాల వయస్సు అని చెప్పినట్లైతే సీలింగ్ లో భూమి పోదని చెప్పారు. కాని భూమికోసం నేను అబద్ధం ఆడలేనని, నా కొడుకు 9వ తరగతి చదువుచున్నాడని చెప్పి, స్కూల్ నుండి బర్త్ సర్టిఫికెట్ ను కూడా సమర్పించాడు. ఫలితంగా భూమి పోయింది. అంతటి సత్యవంతుడు. సం॥ 1970 నుండి పంటలు పండక దినదినము మా పరిస్థితి దిగజారిపోయింది.

## విద్యాభ్యాసం

నేను నా 5వ తరగతి వరకు చిన్నగుండవెల్లిలో, 6 నుండి 10 వరకు మా ప్రక్కనున్న పుల్లూరు గ్రామములో, ఇంటర్మీడియట్ ను గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ, సిద్ధిపేటలో చదివాను. 1979వ సంవత్సరం నా ఇంటర్ అయిన వెంటనే ఇంజనీరింగ్ లో సీటు లభించనందున, చిన్నగుండవెల్లిలో వ్యవసాయము చేయుచు, సిద్ధిపేటలో బి.ఎస్సీని రెండు సంవత్సరముల వరకు చదివాను. నా రెండవ ప్రయత్నములో కూడా ఇంజనీరింగ్ లో సీటు లభించనందున స్వామివారిపైన కోపముచే 1980లో ఉపవాస దీక్షను విరమించుకున్నాను. నేను ఊరిలో 2 సంవత్సరాలు వ్యవసాయము చేయుట వలన అక్కడి పరిస్థితులు స్వయంగా అర్థం చేసుకున్నాను. మా ఆర్థిక పరిస్థితిని చూచి చలించిపోయాను. ఎలాగైనా ఊరిని వదిలిపోవాలనిపించింది. నాకు ఇంజనీరింగులో సీటు లభించినచో ఉద్యోగము చేయక వ్యాపారము చేసి మా కుటుంబాన్ని ఉన్నత స్థితికి తీసుకు రావాలనే కోరిక అప్పుడే ఏర్పడింది. చివరికి 1981 లో కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ ఉస్మానియా విశ్వవిద్యాలయములో సివిల్ ఇంజనీరింగులో సీటు లభించింది. యూనివర్సిటీ హాస్టల్ లో ఉండి విద్యనభ్యసించాను. 1985లో విద్యాభ్యాసము తరువాత జీవనోపాధికి చాలా ఇబ్బంది పడ్డాను. మా ప్రొఫెసర్ కీ.శే డా॥ బద్రుద్దీన్ వద్ద జె.ఆర్.ఎఫ్ గ చేరాను. ఆ తరువాత అదే కళాశాలలో పార్ట్ టైంగా 1987లో స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ మాస్టర్ డిగ్రీలో చేరాను.

## స్వామివారి లీల

1987 లో నా జీవితంలో జరిగిన ఒక స్వామివారి లీలను చెప్పదలచుకున్నాను. ఒకరోజు కేరళలోని ''విక్రమ్ సారాభాయి'' వారు ఉద్యోగ ప్రకటన ఇచ్చారు. దీనిని చూచిన వెంటనే ఎలాగైనా ఇంటర్వ్యూకి వెళ్ళి, మార్గమధ్యంలో తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శించుకోవాలనిపించింది. త్రివేండ్రమ్ కు ఇంటర్వ్యూకి వెళ్ళి ఆ తర్వాత అక్కడే ఉన్న శ్రీ అనంతపద్మనాభస్వామివారిని దర్శించుకున్నాను. పెద్ద ఆలయం, చక్కని దర్శనము ఎంతో ఆనందించాను. తిరిగి హైదరాబాద్ వచ్చు మార్గమున ఉదయం 9 గంటల ప్రాంతమున తిరుపతిలో బ్రేక్ జర్నీ చేసి, శ్రీవేంకటేశ్వరుని దర్శనార్థమై తిరుమలకు వెళ్ళాను. అప్పుడు నేను స్వామిని చూచుటకు ట్రెయిన్ దిగునప్పుడు నాలో ఏదో తెలియని పులకరింత మొదలైంది. స్వామిని చూడాలనే ఆత్రుత పెరిగింది. దొరికిన వాహనాన్ని పట్టుకుని, కొండపై సామానును లాకర్ లో పెట్టి అత్యంత ఆత్రుతగా స్నానం చేసి ముందు వెనక చూడకుండా స్వామి దర్శనానికి వెళ్ళాను. స్వామివారిని చూడాలనే ఆత్రుత తారాస్థాయికి చేరింది. ఆ స్థితిని వర్ణించలేక పోతున్నాను. ఉదా: ఒక వ్యక్తి తన తల్లిదండ్రులను వదిలి 10 సంవత్సరములు జీవనోపాధికై పరదేశము వెళ్ళి, తిరిగి వచ్చిన వెంటనే, తాను ఇంటికి చేరకముందే తన అమ్మ చివరి దశలో ఉన్నదనే విషయము తెలిసినప్పుడు, తన తల్లిని అత్యంత తొందరగా చూడాలనే ఆత్రుత ఏవిధంగా ఉంటుందో నాకు స్వామిని చూడాలనే ఆత్రుత ఆ విధంగా ఉంది. లోనికి వెళ్ళినకొద్దీ ఆత్రుత పెరుగుతోంది. ప్రక్కనున్న భక్తుల మాటలు వినబడుట లేదు. కాళ్ళు చేతులు వణుకుచున్నవి. శరీరం కంపించుచున్నది. ఈ స్థితిలో స్వామి వద్దకు వెళ్ళాను. నా శరీరం లోని నవనాడులు కంపించాయి. కళ్ళనుండి ఆనంద బాష్పాలు పట పట క్రింద రాలాయి. స్వామి శ్రీవేంకటేశ్వరా అంటూ దండం పెట్టుకుని

బయటకు వచ్చాను. శరీరం చల్లబడ్డది. కాని స్వామి విరహాన్ని భరించలేక బయట ఏదో ఒకటి తిని మళ్ళీ దర్శనానికి వెళ్ళాను. అత్యంత తపనచే భావోద్రేకానికి గురై, దర్శన లైనులలో మధ్య మధ్యన దూరుచు ఆరోజు మొత్తం 7 దర్శనాలు చేసుకున్నాను. ఏడవ దర్శనము సందర్భముగా నా కాలి వ్రేళ్ళకు ఒక రాయి బలంగా తాకడం వలన చాలా నొప్పి లేచింది. వెంటనే ఇది శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞగా "ఇక చాలు వెళ్ళు, ఇతర భక్తులు దర్శించుకోవాలి" అనే ఒక భావన నా హృదయములో కలిగింది. మరియు శ్రీవేంకటేశ్వరా "నేను నీవాడిని, మీరు నావారు" అనే తెలియని భావం ఏర్పడింది. చివరికి సాయంత్రం 6 గంటలకు హైదరాబాదుకు తిరుగు ప్రయాణమైనాను. ఆ తరువాత నుండి నా జీవితంలో వృద్ధి చెందుట ప్రారంభమైంది. ఆర్థికంగా దిగజారిపోవుటచే మానసికంగా, శారీరకంగా మా తల్లిదండ్రులు క్రుంగిపోయారు. కుటుంబ బాధ్యత, మా చెల్లెలికి సంబంధం చూసి పెండ్లి చేసే బాధ్యత నేనే తీసుకున్నాను. ఉద్యోగం చేయటం ఏమాత్రం ఇష్టం లేక ప్రైవేట్ కన్స్ట్రక్షన్స్ చేసుకుంటున్నాను. చివరికి పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ గ 1987 అక్టోబర్ లో చేరాను. కాని ఇది రుచించక 1990 లో నా పెండ్లి అయిన వెంటనే మానేసి తిరిగి కన్స్ట్రక్షన్స్ లో పూర్తిస్థాయిలో చేరాను.

## వివాహం

హైదరాబాద్ వాస్తవ్యులైన చెఱుకుపల్లి నారాయణరెడ్డి, శకుంతలాదేవి ఏడవ సంతానం, ఎం.ఎస్సీ కెమిస్ట్రీ చదివిన చి॥ సురేఖారెడ్డితో తేది 04-03-1990లో నాకు వివాహం జరిగింది. ఈ పెండ్లి కూడా స్వామివారి లీలలో భాగంగానే జరిగింది. 1987 నుండి పెండ్లి నిమిత్తమై ఎంతో మంది అమ్మాయిలను చూచాను. అదే క్రమములో ఒకరోజు ఈ సురేఖను కూడ పెండ్లిచూపుల్లో వారింట్లో చూచాను. తొలి చూపులో ఆమె నాకు నచ్చలేదు. కాని గతంలో పరిచయమున్న వ్యక్తిలాగ అనిపించింది. నాలో తెలియని దగ్గరి భావాలు రాసాగాయి. చివరికి పెండ్లికి నిరాకరించాను. ఇలా మూడు నెలలు గడిచాయి. నేను నిరాకరించుటచే ఈమధ్యన ఆమెకు మరో సంబంధమును కూడ చూచారు. ఈ మూడు నెలల కాలము నాలో సురేఖతో వెనకటి పరిచయమున్న భావన ఎక్కువైంది. ఈ భావన నాకే కాకుండ సురేఖకు కూడా కలిగింది. చివరికి ఈ భావనకు లోనై పెండ్లికి ఒప్పుకున్నాను. తేది 28-02-1990 నాడు మా చెల్లెలు పెండ్లి బడికోల్ బాల్ రెడ్డితో చేసి, తేది 04-03-1990 నాడు నేను పెండ్లి చేసుకున్నాను. ఏప్రిల్ 1990 నుండి ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిస్థాయిలో కన్స్ట్రక్షన్ రంగములో బిల్డరుగా వ్యాపారము చేయుట మొదలు పెట్టాను. వ్యాపారములో చాలా ఆటుపోట్లు వచ్చాయి,. ఈ నెల ఎలా గడుస్తుంది అనుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

నాకు ఇద్దరు పుత్రులు. వేదాంత్ మరియు అరవింద్ రెడ్డి. మా తండ్రి తేది 22-12-1990 నాడు చనిపోయారు. నా భార్య ఎం.ఎస్సీ చదివినప్పటికీ పిల్లల పోషణార్థమై ఉద్యోగము చేయక ఇంటిపట్టునే ఉండేది. నాకు వ్యాపరము పైన, నా భార్యకు కుటుంబము పైన ఎక్కువ ఇష్టాలు ఉండేవి. నేను 1987లో పార్ట్ టైంగ ఇంజనీరింగ్ మాస్టర్ డిగ్రీలో చేరాను. ఇది రెండున్నర సంవత్సరాల కోర్స్. కాని నేను వ్యాపారము నందే మనస్సు నిలుపుట వలన క్లాసులకు సరిగా వెళ్ళేవాణ్ణి కాను. రేపు పరీక్ష అనగా గుర్తుకొచ్చేది కాబట్టి పరీక్షను వ్రాసేవాడిని కాదు. వ్యాపారములో డబ్బు వస్తుంది కావున చదువుయందు ఆసక్తి తగ్గింది. అది ఒక డిగ్రీ సాధించుటకు తప్ప నా జీవితానికి ఎందుకు పనికివస్తుందనే అభిప్రాయముతో ఉండేవాణ్ణి. చివరికి మే నెల 1992 లో మాస్టర్ డిగ్రీ నా చేతికి వచ్చింది.

పైన చెప్పిన ప్రతి విషయాన్ని శ్రీవేంకటేశ్వరుడు తన లీలలలో ఉపయోగించుకున్నాడు. సం॥ 1995 నుండి హైదరాబాద్ లోని దుర్గాబాయ్ దేశ్ ముఖ్ కాలనీలో నేనే నిర్మించిన "వెంకటగిరి రెసిడెన్సీ" అనే అపార్టుమెంటులో నివాసముండేవారిమి. సం॥ 1999లో నేను కొంత ఆర్థికముగ ఎదిగిన తరువాత, మమ్ములను కష్టాలకు గురి చేసిందనే కసి చేత ఊరిలోని మా ఇల్లును అమ్మి మరో ఇల్లును నిర్మించుకున్నాము. 1999 వరకు వ్యాపారమే ముఖ్యంగా జీవించాను. అక్టోబర్ 1999 నుండి స్వామి లీలలు ప్రారంభమైనాయి.

## స్వామి లీలలు ప్రారంభం :

నా వయస్సు 39 ఉన్నప్పుడు, అక్టోబర్ 1999 లో దయాబెటిక్ వచ్చింది. ఈ విషయం తెలిసిన వెంటనే మాపై భారం పడ్డట్లనిపించింది. జీవితంపై నిరాశ కలిగింది. ఎలాగైనా దీనిని అధిగమించాలనే ఉద్దేశ్యముతో యోగా, ప్రాణయామ నేర్చుకున్నాను. ప్రతిరోజు ఒక గంట యోగా, ప్రాణాయామం, మరో గంట నడక అలవాటు చేసుకున్నాను. చక్కని జీవన విధానాన్ని అలవాటు చేసుకున్నాను. భక్తిమార్గము ఆకర్షించింది. మాంసాహారముపై విరక్తి కలిగింది. పనిభారము, సమస్యలు ఉండకూడదని భావించి వ్యాపారాన్ని సగానికి తగ్గించాము. అపార్టుమెంట్స్ బదులు కొన్ని ఇండిపెండెంట్ ఇళ్ళు కట్టడం ప్రారంభించాను. అల్వాల్ లోని రైతుబజార్ ఎదురుగా గల జి.వి.రెడ్డి కాలనీలో 600 గజాలలో నాలుగు ఇళ్ళను కట్టుట ప్రారంభించాను. ఇలా వ్యాపారాన్ని తగ్గించి నా జీవితాన్ని క్రమబద్ధీకరించుకున్న తరువాత సం॥ 2000 ఏప్రిల్ నుండి

స్వామివారి ప్రత్యక్ష లీలలు ప్రారంభమైనాయి. నాకు స్వామివారి ప్రత్యక్ష లీలలు సం॥ 2000 నుండి ప్రారంభమైనప్పటికీ అశ్రద్ధచే వాటిని వ్రాయలేదు. ఒక నాలుగు పొందిన తరువాత నాకు మాత్రమే అర్థమయ్యే విధంగ, సారాంశమును ఒక డైరీలో వ్రాశాను. చివరికి స్వామివారు ఏదో సాధించుటకు వీటిని ప్రసాదించుచున్నారని గ్రహించి తేది 20-07-2002 నుండి ప్రత్యేక పుస్తకములు పెట్టి వ్రాయుటను మొదలుపెట్టాను.

## శ్రీ ఆంజనేయుని దర్శించుట :

ఏప్రిల్ 2000, మొదటి అనుభూతి : అప్పట్లో ప్రతి శనివారము టీవీలో జై హనుమాన్ సీరియల్ ప్రసారమయ్యేది. నేను దానిని అతి శ్రద్ధగ చూచేవాడిని. ప్రతి ఎపిసోడును తప్పకుండ చూచేవాడిని. దీనితో నాకు దైవభక్తి, శ్రద్ధ చాల పెరిగాయి.

కల: మా సొంత గ్రామము చిన్నగుండవెల్లి లోని మా తోటబావి వద్ద రెండు పశువుల కొట్టములు కలవు. దానికి కొంత దూరములో మా తండ్రి సమాధి కలదు. ఈ రెండింటికి మధ్యన, పశువుల కొట్టము ముందు నేను శ్రీ ఆంజనేయుణ్ణి చూచాను. ఆయన జై శ్రీరామ్ అంటూ తన గదను పైకి ఎత్తాడు. ఆ ఆంజనేయుడు నేను టీవీ సీరియల్ లో చూచే ఆంజనేయుడు ఒకటే విధంగా కలడు. పైగా అదే గొంతు, జైశ్రీరామ్ అంటూ ఆయన పైకి ఎగిరాడు. తన కాళ్ళను క్రిందికి ఒత్తుచు జైశ్రీరామ్ అంటూ తన గదను పైకి ఎత్తుచు ఎగిరాడు. ఇంతే కల. ఇందులో ''జైశ్రీరామ్'' అనే పదము నా మనస్సులో పదే పదే మారుమ్రోగింది. నేను చాల సంతోషించాను. శ్రీ ఆంజనేయుడు దర్శనమిచ్చాడని మురిసిపోయాను.

నేను జైహనుమాన్ టివి సీరియల్ చూచుచున్నాను కాబట్టి అదే భావముతో ఉన్నా కాబట్టి ఈ కల యాదృచ్ఛికంగా వచ్చిందని భావించి ఎక్కువ విలువ నీయలేదు. ఇలా సమయము గడుస్తున్నది. వ్యాపారము చేసుకుంటున్నాను.

## తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శించుట

జులై 2000 ప్రాంతములో మరో కల కన్నాను. నిజానికి ఈ కలను కూడ నేను యాదృచ్ఛికమనే భావించాను. కలను పొందిన 15 రోజుల వరకు నా భార్యకు కూడ చెప్పలేదు. కాని కలలోని అంశములు నిజమగుటను చూచి ఆమెతో చెప్పాను. దీనిని పొందిన రెండు సంవత్సరముల తరువాత వ్రాసినప్పటికీ ఆ కలలోని భావాలు నా మనస్సులో ముద్రించుకున్నందున ఉన్నది ఉన్నట్లుగా ఇలా వ్రాశాను.

''ఇది నా జన్మలో మరచిపోని సంఘటన. నా జన్మ పావనమైన సంఘటన. నేను పుట్టింది ఇందుకే అయి ఉండవచ్చును. నేను ఏ జన్మలో చేసిన పుణ్యమో నన్ను ఆ దేవాది దేవుడు ఈ జన్మలో కరుణించాడు. కొన్ని వేల జన్మలు తపస్సు చేసిన దొరకని భాగ్యాన్ని ఆ శ్రీవేంకటేశ్వరుడు నాకు ప్రసాదించాడు. నేను ఒక సామాన్య మానవుణ్ణి. ఒక మారుమూల ఊరిలో వ్యవసాయ వృత్తిగల కుటుంబంలో పుట్టినవాణ్ణి. పూజ చేయు విధానము కాని, వేదమంత్రములు కాని తెలియదు. ఏ ఒక్కరోజు ఆ శ్రీవేంకటేశ్వరునికి అభిషేకించి నైవేద్యము పెట్టలేదు. కాని నా కష్ట సమయములందు ఆయన్నే కొలిచేవాణ్ణి. ఏదో ఒక దేవుణ్ణి కోరుకో అంటే మాత్రం నేను శ్రీవేంకటేశ్వరుణ్ణే కోరుకుంటాను. నా తల్లి రుక్కమ్మ, తండ్రి వెంకటరెడ్డి గార్లు కూడ పెద్దగ చెప్పుకోతగిన భక్తులు కారు. మా ఇంటిలో శ్రీవేంకటేశ్వరుణ్ణి నేను మాత్రమే ఎక్కువ కొలిచేవాణ్ణి. నాకు నా తల్లితండ్రులు శ్రీవేంకటేశ్వరుణ్ణి కొలవమని చెప్పలేదు. నేను 2వ తరగతి చదువుచున్నప్పుడు మా అమ్మమ్మగారి ఊరు, అప్పనపల్లికి పోయాను. అక్కడ నా సమవయస్సు వారైన మేనమామ కొడుకు, పెద్దమ్మ కొడుకులు ప్రతి శనివారము శ్రీవేంకటేశ్వరునికి ఉపవాస దీక్ష ఉండుటను చూచి ప్రభావితుడనై, నేను కూడ ఈ దీక్షను ప్రారంభించాను. ప్రతి శనివారము పూజ చేసేవాడిని. రాత్రిపూట ఉపవాస దీక్ష చేసేవాడిని. మా తల్లితండ్రులు కూడ నా నిర్ణయాన్ని వ్యతిరేకించలేదు. ఉపవాస దీక్షకు తగిన ఏర్పాట్లు చేసేవారు. ఈ విధంగా ఇంటర్ వరకు ఉపవాస దీక్ష కొనసాగించాను. తరువాత ఇంజనీరింగ్ లో సీటు రావాలని ఆ దేవదేవుణ్ణి కోరుకున్నాను. కాని రాలేదు. మరొక సంవత్సరం కూడా రాలేదు. కోపముతో ఆ దేవునిపైన విశ్వాసము సన్నగిల్లింది. ఉపవాస దీక్ష మానివేశాను. కాని తరువాతి సంవత్సరం కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్, ఉస్మానియా యూనివర్సిటీలో సీటు లభించింది. కాని తిరిగి ఉపవాస దీక్షను కొనసాగించలేదు. కాని ఎక్కడో నా హృదయంలో ఆయనే ఉన్నాడన్న మాట మాత్రం నూటికి నూరు పాళ్ళు నిజం. ప్రతి కష్టంలో ఆయన్నే వేడుకునేవాడిని. నా నోటికి అనుకోకుండ ఆయన పేరు, రూపము గుర్తుకు వచ్చేవి. నాకు సర్వము ఆయనే అనే నమ్మకం కలదు. నా సర్వ దుఃఖములను ఆయనే తీర్చునను విశ్వాసము దృఢముగా కలదు.

ఇది అంతా ఆ శ్రీవేంకటేశ్వరుని లీల మాత్రమే అని దృఢముగ ఇప్పుడు చెప్పగలను. లేకుంటే నేను 2వ తరగతి నుండి 13 సంవత్సరములు క్రమం తప్పకుండ ఆ శ్రీవేంకటేశ్వరునికి ఉపవాస దీక్ష ఉండుట, అందులో మాలాంటి కుటుంబంలో అంటే ఆయన కటాక్షమే అని చెప్పగలను. నా యందు ఆ దయామయుడు తన పరిధులను మించి కటాక్షించాడు అంటే అందులో సందేహమే లేదు.

వివాహము తరువా త ప్రతిరోజు ఉదయము పూజ చేసి భోజనము చేయుట అలవాటు చేసుకున్నాను. ఇలా నా జీవితము జరుగుచున్నది. ఏదేని కష్టము కుటుంబములో కాని లేదా వ్యాపారములో కాని వచ్చినప్పుడు ఆ శ్రీవేంకటేశ్వరుణ్ణి మాత్రమే వేడుకునే వాడిని. మా తండ్రి గారిని కూడ వేడుకుంటాను. మా తండ్రి పేరు వెంకటరెడ్డి, తల్లి రుక్కమ్మ. అందువల్ల నేను ఒక్కొక్కప్పుడు స్వయంగా ఆ శ్రీవేంకటేశ్వరునికి బిడ్డనన్న భావన కలుగుచుండును.

నేను కన్స్ట్రక్షన్ వ్యాపారము చేయుచుంటిని. అందులో సాధక బాధకాలు చాల ఉండును. అప్పుడు ఆల్వాల్ లోని ఓమ్ సాయి కాలనీలో డ్యూప్లెక్స్ ఇల్లును కట్టుచున్నాను. ప్లాట్ కొని, పర్మిషన్ తీసుకుని ఇళ్ళు కట్టి అమ్ముట నా వ్యాపారము. అది 600 గజముల స్థలము. అందులో 4 ఇండ్లు కట్టుచున్నాను. రెండు శ్లాబులు పూర్తయినవి. బ్రిక్ వర్క్ మొదలైంది. దీని వెనుక శ్రీమాన్ బ్రిగేడియర్ జి.బి.రెడ్డి అని ఒక రిటైర్డు మిలిటరీ ఆఫీసర్ ఉంటున్నాడు. ఆయన ఈ కాలనీకి ప్రెసిడెంట్. నాకు మిత్రుడే. ఆయనకు, నేను ప్లాట్ కొన్న యజమానికి శత్రుత్వము. ఒకరోజు జి.బి.రెడ్డి గారు నా వద్దకు వచ్చి నీకు ఆయన కొంత ప్రభుత్వ భూమిని అమ్మాడని, ఆయనపై కేసు పెట్టమని అన్నారు. దానికి నేను నిరాకరించుటచే ఆ కోపము నాపై తీసుకొనుటకు సిద్ధంగా ఉన్నాడు.

ఇంతలో నాకు ఆ సమయము వచ్చింది. భవిష్యత్తులో ఏమి జరుగునో తెలిసింది. ఏ విధంగా ఉండగలనో ఊహించుకొంటిని. ఆ సంఘటన నాకు, నా జీవితానికి అత్యంత శుభకరమైంది. నేను ఒకవేళ గత జన్మములు ఎత్తినచో, నా అన్ని జన్మములలోను ఈ జన్మమే శ్రేష్ఠమైనది. నా జన్మ ధన్యమైంది.

కల : ఆ రోజు మామూలుగనే మా ఇంట్లో పడుకున్నాను. ఆ రాత్రి ఒక స్వప్నము వచ్చింది. అందులో నన్ను ఒక అదృశ్య శక్తి మా ఇంటి నుండి దక్షిణం వైపుకు తీసుకెళ్ళింది. తమిళనాడు వైపు తీసుకెళ్ళుచున్నదని కలలోనే అనుకున్నాను. చివరికి తిరుపతికి తీసుకెళ్ళింది. ఇంతలో చిత్రం జరిగింది. స్వయంగా శ్రీవేంకటేశ్వరుడు నాముందు నిలిచాడు (లేదా ఆ శక్తి నన్ను తిరుమల శ్రీవేంకటేశ్వరుని ముందు దింపింది). నల్లని ముఖము, నల్లని చేతులు, నల్లని కాళ్ళు, చక్కని పీతాంబరమును ధరించినాడు. శంఖు చక్రములను ధరించినాడు. ఒక చెయ్యి అభయమును ప్రదర్శించుచున్నది. మరొక్క చేయి కటి యందు ఉన్నది. అతనిపైన బంగారు మకర తోరణము ఉన్నది. నేను ఆయన ముందు నిలబడ్డాను. స్వామివారు తన అణువణువును చూపెట్టారు. ఆయన అభయ హస్తములోని గీతలను కూడ స్పష్టంగా చూచాను. నేను అలాగే చాలాసేపు నిలుచున్నాను. చివరికి నాలో ఒక పులకరింత వంటిది కలిగింది. నాకు రాబోవు రోజులలో చాల కష్టములు వచ్చునని అనిపించింది. నేను అలాగే స్వామివారిని చూచుచుంటిని. ఆ స్వామి నాతో ఒక్క మాట కూడ మాట్లాడలేదు. కాని నాకు రాబోవు రోజులలో చాలా కష్టములు వచ్చునని ఒక అనుభూతి కలిగింది. నా అరికాళ్ళనుండి వణుకుతో కూడిన భయము ప్రారంభమైంది. కొంచెము సమయము తరువాత స్వామివారిలో చలనము కనబడ్డది. స్వామి తన అభయ హస్తమును తీసి నాకు షేక్ హ్యాండ్ (హల్లో) రూపముగ ఇవ్వబోయాడు. అప్పుడు నాలో "నీవు భయపడకు నేనున్నాను. నీకు ఏమీ కాదు" అన్నట్లు అనుభూతి కలిగింది. నేను ఆయన చేయిని హల్లో రూపంగా నా చేయితో అందుకోబోవు లోపల కల అదృశ్యమైంది. ఇది నా జీవితములో జరిగిన నిజమైన సంఘటన. తెల్లవారి మామూలుగ పూజమందిరములో పూజ సమయమున నాకు దర్శనమిచ్చినందులకు కోటి కోటి ప్రణామములును తెలుపుకున్నాను. పైన చెప్పిన స్వప్నములో స్వామివారు అత్యంత ప్రకాశవంతంగా కనబడ్డారు. అభిషేకము తరువాత నీటి పదనలో ఎలా మెరుస్తూ ఉంటారో ఆ విధంగా అత్యంత నల్లగా కనబడ్డారు. ఆ రూపము నా మనస్సులో బలంగా ముద్రించుకుంది. ఈరోజు కూడా నేను అదే రూపును ధ్యానించుదును. ఇది కల.

దీని అర్థము నాకు తరువాత తెలిసింది. నాకు నా జీవితములో ఎప్పుడు రాని కష్టములు వచ్చాయి. ఎప్పుడు ఏమి కీడు జరుగునో అని భయము ఒకటిన్నర సంవత్సరముల పాటు జరిగింది. భయముతో ఒళ్ళంతా వణుకుట, ప్రతిక్షణము ఆ దేవాది దేవుణ్ణి ధ్యానించడం జరిగింది. జి.బి.రెడ్డి గారికి నాపై చాల కోపము కలిగి నా యొక్క 4 ఇళ్ళను కూలగొట్టించాలని కంటోన్మెంట్ అధికారులకు, బ్రిగేడియర్ కు, పూణేలోని మరియు ఢిల్లీలోని వారి హెడ్ ఆఫీసుకు కంప్లైంట్ రాస్తూ నేను కొంత ప్రభుత్వ భూమిలో కన్స్ట్రక్షన్ చేశానని, అనుమతికి విరుద్ధంగా కట్టానని, ఇది కాలనీ వారికి ఇబ్బంది అని, త్వరగ దీనిని కూలగొట్టవలెనని ప్రతి 3 రోజులకొక కంప్లైంట్ రాస్తూ ఉండెను. ఆ అధికారులందరు ఆయనకు చాలా మిత్రులు. పైగా ఆయన క్రింద ఒకప్పుడు పని చేసినవారు కావటం ఆయనకు అనుకూలించింది. కంటోన్మెంట్ వారు ఒక నోటీసు ఇచ్చారు. ఎం.ఆర్.వో మరియు కంటోన్మెంట్ అధికారులు నాలుగు సార్లు సర్వే చేశారు. ఒక 15 సార్లు అందరు వచ్చి చూచారు. కాని చివరికి ఇది ప్రైవేటు భూమి అని, అది నాదేనని తేల్చి చెప్పారు. కాని కన్స్ట్రక్షన్ అనుమతి ప్రకారం లేనందున 256 నోటీసు ఇచ్చి 15 రోజులలో కూల్చెదమని చెప్పారు. నేను ఒక అడ్వకేటు వద్దకు వెళ్ళాను. ఆయన 13వ రోజు కోర్టులో వేశాడు. కాని ఆ కోర్టు ఆర్డర్ ఇవ్వలేదు. కంటోన్మెంట్ వారికి 7 రోజుల నోటీసు

ఇచ్చిం ది. దీనితో వారు 16వ రోజు అంటే 18-11-2000 నాడు కూల్చుటకు రంగం సిద్ధం చేసుకున్నారు. వారికి ఢిల్లీ నుండి, పూణే నుండి ప్రెజర్ ఎక్కువైంది. ఏవిధంగానైనా దీనిని కూల్చవలెనని నిర్ణయించుకున్నారు. 17వ తేదీన పోలీసు ప్రొటెక్షన్ కోసం ఉత్తరం కూడా వ్రాశారు. ఇంతలో హైకోర్టు నాకు వారం రోజుల వరకు స్టే ఇచ్చారు. నాకు ఈ 7 రోజులు నిద్ర పట్టలేదు. చివరికి 7 రోజుల తర్వాత సిటీ కోర్టులో నా స్టే డిస్మిస్ అయింది. మళ్ళీ పారలు, గునపములు, మనుష్యులను సిద్ధం చేసుకుని నా బంగ్లాలను పడగొట్టుటకు వెళ్ళుచున్నారు. ఆ క్షణంలో వేరే కోర్టు 14 రోజుల వరకు స్టే ఇచ్చారు. దీనిని వారు వెకేట్ చేయించుటకై ముగ్గురు నలుగురు అడ్వకేట్స్ వారి పక్షమున వాదించారు. విపరీతమైన ఒత్తిడి, ఏ క్షణములో ఏమి జరుగునో అని భయము. ఆ ఇళ్ళను ఎవరు కొనవద్దని శ్రీమాన్ జి.బి.రెడ్డి గారు అందరికీ చెప్పడం జరుగుచుండెను. ఈ విధముగ నా పంచ ప్రాణములు నా చేతిలో లేవు. ప్రతిక్షణము శ్రీవేంకటేశ్వరుణ్ణే ధ్యానించడం జరిగింది. ఇది నాకు ఆ దేవుణ్ణి ధ్యానించుటకు ఆ దేవాది దేవుడు కల్పించిన మంచి సదవకాశము. దీనిని నా జన్మలో మరువలేను. ఇలా ఒకటిన్నర సంవత్సరముల వరకు అంటే దాదాపు మార్చి 2002 వరకు, ఎప్పుడు ఏమి జరుగునో అనే భయముతో ఉన్నాను. కాని చివరికి ఏమీ కాలేదు. ఇదంతా ఆ దేవుని కృపవల్లే జరిగిందన్నది నూటికి నూరుపాళ్ళు నిజం. ఇట్టి నాలుగు ఇళ్లలో చివరి ఇల్లును స్వామివారి ప్రసాదంగా ఇప్పటికి నా వద్దనే ఉంచుకున్నాను.

## స్వామి శిక్షణ

పైన చెప్పిన ప్రతి విషయము పైకి కనబడేది మాత్రమే అంతరంగంగ ఈ సంఘటనలో ఎంతో శిక్షణ ఇచ్చాడు. నాకు వ్యాపారమంటే ఇష్టమైనప్పటికీ, నా వ్యామోహాన్ని వంద రెట్లు పెంచాడు. ఏ చిన్న సంఘటన జరిగిన భరించలేని స్థితి కలిగించాడు. భయముతో స్వామివారిని నిరంతరం స్మరించేవాడిని. అలా శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రభూ అని పిలవగానే పరిగెత్తుకొచ్చి నా హృదయము లోనికి ప్రవేశించేవాడు. వెంటనే నేను తీవ్రమైన భావస్ఫూర్తికి గురయ్యేవాడిని. నా హృదయంలో దైవాన్ని దర్శించేవాడిని. శరీరం రోమాంచితం అయ్యేది. ఆనందపు భావాలలో మునిగి తేలేవాడిని. అన్ని సమస్యలపైనున్న మమకారము తగ్గి స్వామివారిపైననే సంపూర్ణ మనస్సు లగ్నమయ్యెడిది. పరమానంద భావానికి లోనయ్యేవాడిని. ఒకరకమైన దివ్యమైన రసామృతాన్ని గ్రోలేవాడిని. మనసు చెప్పలేని వర్ణించలేని పరమానందమును పొందుచు, ఆనంద బాష్పాలు కళ్ళనుండి జాలువారుచుండెడివి. ఎంతగా ఆనంద పడేవాడినంటే నా చొక్కా ఛాతీభాగము చాలావరకు ఆనంద బాష్పాలతో తడిసిపోయేది. నా కళ్ళలో అంతటి నీరు (ఆనంద బాష్పాలు) ఎక్కడినుండి వచ్చుచున్నవో తెలియక ఆశ్చర్యపడేవాడిని. ప్రభూ! అని పిలివగనే స్వామివారు ఎక్కడున్నా క్షణంలో పరుగెత్తుకొచ్చేవాడు. నా హృదయంలో నిలిచేవాడు. ఇంకా చెప్పాలంటే ప్రభూ! అనే పదంలో 'ప్ర' అనే అక్షరాన్ని పలుకగనే స్వామివారు ఏతెంచి 'భూ' అనే అక్షరం పలికే లోపలే నా హృదయంలో నిండిపోయేవారు. అప్పటికే కళ్ళవెంట నీరు పటపట రాలుచుండేది. అమితమైన ఆనందాన్ని అనుభవించేవాడిని. రోజుకు కనీసం 5 నుండి 10 సార్ల వరకు ఇలా జరుగుచుండేది. నన్ను పరమానంద భరితుణ్ణి చేశాడు. ఈ లోకంలో ఆనంద సామ్రాజ్యానికి రాజుగ చేశాడు. లేదా ఆనంద సామ్రాజ్యములో ఒక గొప్ప కోటీశ్వరుణ్ణి చేశాడు. నేను అనుభవించిన ఆనందము బహుశా ఈ లోకంలో చాలా తక్కువ మంది అనుభవించి ఉంటారు. ఆనంద సామ్రాజ్యానికి రాజుగ నాది నేను తలచుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. దివ్యభావాల పరాకాష్ఠకు వెళ్ళేవాడిని. ఈ లోకపు వ్యవహారాలన్న మరిచేవాడిని. ఒక్కొక్కసారి ఆనందమును భరించలేక సొమ్మసిల్లిపోయే స్థితి కలిగేది. ఇంతకంటే ఆనందం లోకంలో వెతికినా దొరకదు. అంత ఆనందాన్నిచ్చాడు. మూగవాడిగ అనుభవించేవాడిని. ఇలా మొత్తం ఒకటిన్నర సంవత్సరాలు నా నరనరాలలో శ్రీవేంకటేశ్వరుడు నావాడుగ లీలయైపోయాడు.

పైన చెప్పిన స్వప్నములో శ్రీవేంకటేశ్వరుడు దర్శనమిచ్చి, అణువణువును చూపెట్టాడని మాత్రమే చెప్పాను. కాని ఈ సంఘటన ద్వారా నాలో ''భక్తి'' బీజమును నాటాడు. స్వప్నము తరువాత 15 రోజుల వరకు ఎలాంటి పరిణామాలు చోటు చేసుకోలేదు. ఆ తరువాత బీజము మొలకెత్తి నా నరనరాల్లో వ్యాపించింది. స్వామివారి స్మరణలో కలిగే ఆనందమును వదలలేక అంతర్ దృష్టి బాహ్యదృష్టి అనే రెండు దృష్టికోణాలను ఏర్పరచుకొని, అంతర్ దృష్టితో సదా ఆయనను స్మరించుటను అలవాటు చేసుకొన్నాను. స్వామివారి గురించి మరింత తెలుసుకోవాలన్న తపన నాలో పెరిగింది.

## సంపూర్ణ శరణాగతి

ఒక సమయంలో నా ఇళ్ళను కూల్చుటకు అధికారులు సిద్ధం అయ్యారు. ఆపుటకు నా శక్తి సరిపోలేదు. ప్రయత్నించి అలసిపోయి చివరికి సాయంత్రం 5 గంటల ప్రాంతమున మా ఆఫీసుకు వచ్చి స్వామివారిని ప్రార్థించుట మొదలుపెట్టాను. ఆ సమయాన శ్రీవేంకటేశ్వరుడు తప్ప నాకు దిక్కెవరు లేరనే భావన కలిగింది. వెంటనే స్వామివారిని అత్యంత ఆత్రుతతో కళ్ళనుండి

నీరు జాలువారగ , రోమాంచితుడనై ప్రభూ! శ్రీవేంకటేశ్వరా అంటూ భయమును, ఆనందమును తట్టుకోలేక ఒక ఉన్మాదిలాగ కేకలు పెడుతూ అరిచాను. ప్రభూ! ప్రభూ! అంటూ ఆయననే స్మరించుచూ బాహ్య ప్రపంచమును పూర్తిగా మరచిపోయాను. ఆ సమయమున నాకు శ్రీవేంకటేశ్వరుడు తప్ప మరేది కనబడలేదు. మొత్తం గంటన్నర కాలం ఈ ఘటన జరిగింది. చివరికి నేను మీవాడను ప్రభూ, నన్ను స్వీకరించండి అంటూ గట్టిగా ఏడ్చుచు మొర పెట్టుకుంటూ నాది నేను నా సమస్త సంపద, పరివారముతో పాటు మీవారమని, స్వీకరించమని పెద్దగా అరుస్తున్నాను. చివరికి నాది నేను నా కుటుంబముతో సహా మానసికంగా ఒక వస్తువులాగా మారిపోయి మా ఆఫీసు నుండి ఎగిరి తిరుమల శ్రీవారి ఆలయంలోని హుండీలో పడిపోయాను. ప్రభూ! మీ హుండీలో పడిన ప్రతి వస్తువు మీదే. ఇప్పుడు నేను మీ వాడిని. మీ ఆస్తిని. నాపై మీకు పూర్తి అధికారమున్నది. నేను, నా కుటుంబము, ఆస్తిపాస్తులు అన్నీ మీవే. నాకంటూ ఏమీ లేదు అంటూ గొల్లున అరుస్తూ అనంతమైన ఆనందముతో, శరీరం మొత్తం రోమాంచితం కాగా నేను స్వర్గలోకమున విహరించునట్లు ఆనందపడ్డాను. పరవశించిపోయాను. ఇప్పుడు నేను మీవాడనని, ఈ లోకానికి ఉపయోగపడే ఏదేని మంచిపనిని నాచే చేయించండని దీనంగా వేడుకున్నాను. మరియు ప్రభూ! నేను అజ్ఞానిని. ఏది మంచో, ఏది చెడ్డదో తెలియదు. బోధ చేసే గురువులు, పెద్దలు లేరు. జీవితంలో ఎలా ప్రవర్తించాలో ఎలా మాట్లాడాలో తెలియదు. అన్నీ మీరే అని అనుకుంటున్నాను కాబట్టి ఇప్పటినుండి నా మనస్సులో ఉద్భవించే ప్రతి ఆలోచన మీదే కావాలి. నేను ఆ ఆలోచన ప్రకారమే నడుచుకుంటాను. అది తప్పు ఆలోచన కాకూడదు. లోక కళ్యాణం కోసమై లేక మీ సంకల్పమై ఉండాలని వేడుకున్నాను. ఇంతటి ఆనందమును నేను ఏ రోజు ఆనుభవించలేదు. ఇది పరమానంద స్థితి. ఆనంద బాష్పాలు వచ్చేటువంటి ఆనందం కంటే పదిరెట్లు అధిక ఆనందమును ఇచ్చే స్థితి. భగవంతుడు తలచుకుంటే తప్ప మనము దీనిని పొందలేము. ఆయన అనుగ్రహముచే మాత్రమే సాధ్యము. నా జీవితములో ఈరోజు వరకు ఏకధాటిగ ఒక గంటకు పైగ అనుభవించిన పరమానంద స్థితి కేవలం మూడుసార్లు మాత్రమే. అందులో ఇది మొదటి స్థానం ఇవ్వదగింది. ఈరోజు నేను గంటన్నర వరకు ఈ స్థితిని అనుభవించాను. నాకు తెలియకుండానే సంపూర్ణ శరణాగతిని, ప్రపత్తిని ఘటించాను. ఆ తర్వాత నా సంపూర్ణ వ్యక్తిత్వాన్ని కోల్పోయాను. నేను శ్రీవేంకటేశ్వరుని వ్యక్తిననే భావన నా మనస్సులో బలంగా నాటుకున్నది. ఒకరకంగా ఈరోజుతో సాయిరెడ్డిగ నా జీవితము పరిసమాప్తి చెంది శ్రీవేంకటేశ్వర పాదసేవకుడిగ నూతన జీవితము లోనికి అడుగిడాను.

ఇక్కడ మరొక్క విషయం చెప్పదలచుకున్నాను. నేను, నాది నేను నాకున్న సర్వస్వము, కుటుంబంతో సహా మీకు సమర్పించాను అని చెప్పాను. దీనర్థం ఆరోజు వరకు నాకు ఈ భూమిపైన ఉన్న సమస్త ఆస్తులపైన, ధన వాహనాల పైన, కుటుంబ సభ్యుల పైన, ఇతర వ్యక్తులపైన ఎంత అధికారముంటుందో ఆ మొత్తం అధికారాన్ని స్వామివారికి సమర్పించాను. ఈ భూమిపైన నాకంటూ, నావారంటూ ఎవ్వరూ లేరు అనే స్థితిని కల్పించుకున్నాను.

ఇది నేను స్వామివారి వైపు వేసిన మొదటి అడుగు. ఆ తరువాత నా ప్రతి అడుగు, తెలిసి వేసినా, తెలియక వేసినా శ్రీవేంకటేశ్వరుని వైపే వెళ్ళింది.

ఈ రోజు పొందిన పరమానందాన్ని మరువలేకపోయాను. మళ్ళీ పొందాలనిపించింది. తెల్లవారి తిరిగి అదే సమయానికి అదే ఆఫీసులో మళ్ళీ శరణాగతి చేశాను. స్వామివారిని అత్యంత ఆత్రుతతో ప్రేమతో స్మరిస్తూ, ప్రార్థన చేయుట ప్రారంభించాను. కాని నిన్న పొందినంతటి ఆనందాన్ని పొందలేకపోయాను. చివరికి నా హృదయాన్ని స్వామివారికి సమర్పించు సమయమున, నా హృదయాన్ని చూచుకున్నాను. చిత్రం జరిగింది. నా హృదయ స్థానము ఖాళీగా కనపడ్డది. అప్పుడు అర్థం అయింది. దీనిని నిన్ననే స్వామివారికి ఇచ్చేశాను కాబట్టి ఖాళీగా ఉన్నదని అనుకున్నాను. అంతటితో ప్రార్థన ముగించాను. మళ్ళీ తిరిగి ఎప్పుడు ఇలా ప్రయత్నించలేదు.

## స్వామినుండి భావాలు చేరుట

జులై 2000లో కల కన్న తరువాత ఒకానొక సమయాన ఇలా అనుకున్నాను. నేను ఏ రోజు శ్రీవేంకటేశ్వరుడంటే ఇష్టం అని ఆయనతో చెప్పలేదు. అలాంటప్పుడు నాకు శ్రీవేంకటేశ్వరుడంటే ఇష్టం అనే నా మనస్సులోని భావాలు ఆయనకెలా తెలిసింది? అనే అనుమానముతో ఉన్నాను. దీనికి జవాబుగ ఒక చక్కని మరో లీలను చూపాడు.

లీల : ఆ లీలలో ఎలాగైతే కాంతి కిరణాలు సూర్యుని నుండి ప్రారంభమై అద్దంపై పడి పరావర్తనం చెందినట్లు మన మనస్సులో కలిగే భావాలు మొదట స్వామివారి నుండి ప్రారంభమై మనకు చేరి మననుండి పరావర్తనం చెంది తిరిగి స్వామికి చేరుటను చూపెట్టాడు. ఇలా ప్రతి భావము భగవంతుని నుండే మనకు చేరును. తరువాత మనము ఆ భావాన్ని ఏ విధంగా స్వీకరించుచున్నామనే విషయం కూడ వెంటనే స్వామివారికి తెలిసిపోతుంది. ఈ విధమైన లీలను చూపుచు ఈ స్థితి నుండి

శిక్షణ ఇచ్చుటను ప్రారంభించాడు.

**నా దశ:** నిరంతరము శ్రీవేంకటేశ్వరుని చూచుచు, ఆయనను స్మరించేవిధంగా చేశాడు. సంపూర్ణ శరణాగతి చేసి ఆయనవాణ్ణనే భావనతో జీవించుట ప్రారంభించాను. శ్రీవేంకటేశ్వర పాద సేవకుడిగ నాది నేను భావించుకున్నాను. మరియు నా మనస్సులోని భావాలు స్వామివారివని, ప్రతిభావం ఆయనకు తెలుసునని భావించి సన్మార్గములో పయనించుటకు తోడ్పడింది. ముఖ్యంగా ఈ లీలలో స్వామివారిపై, ఆయన మాటపై విశ్వాసము కలిగి ఉండునట్లు చేశాడు. స్వామివారితో అత్యంత దగ్గరి బంధము ఏర్పడింది. స్వామిని విడిచి ఉండలేని స్థితిని కల్పించాడు. నాది నేను నా కుటుంబముతో పాటు సర్వదాస్తిని ఆయనకు ధార పోయుట వలన మాపైన స్వామివారికి సంపూర్ణ అధికారము లభించింది. మరియు ఇది స్వామివారు ప్రసాదించిన సేవా వృక్షానికి వేళ్ళలాగ పని చేసింది. నా మొదటి కలలో ఎక్కడైతే శ్రీ ఆంజనేయులవారు 'జైశ్రీరాం' అంటూ పైకి ఎగిరాడో అదే స్థలములో 'హరినామ క్షేత్రము'ను స్థాపించుమని శ్రీవేంకటేశ్వరుడు ఆజ్ఞాపించాడు. బహుశా స్వామివారు వచ్చుటకు ముందు తన సేవకుడు వచ్చి ఆ ప్రాంతాన్ని చూచినట్లుంది.

## స్వామివారి లీలలలోని రహస్యం

స్వామివారి లీలలలోని రహస్యమును తెలుపుచున్నాను. స్వతహాగా నేను చాలా ధైర్యవంతుణ్ణి. ఛాలెంజింగ్ పనులంటే చాలా ఇష్టం. కష్టాలను ఎదుర్కొని పోరాడుటలోనే ఆనందమును అనుభవించేది. కాని శ్రీవేంకటేశ్వరుడు కల్పించు చిక్కుల్లో చిక్కినప్పుడు చాలా బాధపడేవాడిని. నా ధైర్యం ఏమాత్రం పనిచేయక పోవును. విల విల కొట్టుకుందును. ఆ బాధలను భయమును తట్టుకోలేకపోయేవాడిని. నీటి నుండి బయటకు తీసిన చేపపిల్ల వలె కొట్టుకుందును. ఆ కొట్టుకొనుటలో రకరకాలుగా స్వామివారిని ప్రార్థించేవాడిని. ఆయనను ఏవిధంగా ప్రార్థించుతే తృప్తిచెందును? ఆయనకు మన నుండి ఏమి కావాలి? నా నడవడి ఏ విధంగా ఉండాలి? మొదలగునవి నా మనస్సుకు వచ్చేవి. రకరకాల వాగ్దానాలను చేసేవాడిని. నాకు తెలియకుండానే నూతనమైన వాగ్దానాలను, ప్రతిజ్ఞలను నాచే చేయించేవారు. ఈ విధంగా నాకు తెలియకుండనే ఒక నూతన బీజం నా మనస్సులో పడేది. ఆ విధంగా తాను ఏ మార్పు కోరుకొనునో, ఏది అవసరమో దానిని నా హృదయములో నాకు తెలియకుండానే బీజం నాటేవరకు ఈ లీల కొనసాగేది. ఆ తరువాత కొంత విశ్రాంతి ఇచ్చి మళ్ళీ అవసరమున్నప్పుడు ఈ నాటిన బీజం మొలకెత్తేటట్లు చేసేవారు. మరిన్ని లీలలను ఆ దిశగ నడిపి నా మదిలో తాను కోరుకున్న విధంగా మార్చేవారు. కొన్నిసార్లు దుఃఖకరమైన సంఘటనలు, మరికొన్నిసార్లు ఆనందకర సంఘటనలను సృష్టించి నన్ను తాను అనుకున్న దారిలో అనుకున్న విధంగా నడిపించేవారు. స్వామివారు అనుకున్నది సాధించేవరకు ఈ శిక్షణ కొనసాగేది.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురించుచున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థించుచు ఆశీర్వదించగలరని ప్రార్థన. **(సశేషం)**

**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**

**పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిద దాసు)**

**ఇ.నెం.1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ,**

**హైదరాబాద్. ఫోన్ : 040-27175050**

## ఆగండి.. ఆలోచించండి

**తన బాధ ప్రపంచానికి బాధ అన్నాడు దేవులపల్లి కృష్ణశాస్త్రి.ప్రపంచం బాధ తన బాధ అన్నాడు శ్రీశ్రీ. భగవత్ భాగవతుల ఆనందమే తన ఆనందం అన్నాడు సాయి రెడ్డి (గోవింద దాసు). తన స్వప్న అనుభూతులను నిత్య జీవితానుభవాలతో కలగలిపి నూతన ఆధ్యాత్మిక తరంగాలను సృష్టించి ఆలోచింపచేస్తున్నాడు సాయిరెడ్డి.**


**"దిశా నా దశ" పైకి చదువుతే విచిత్రమనిపిస్తుంది. లోతుల్లోకి వెళితే భగవంతునికి భక్తునికి మధ్య భక్తుని దీనాలాపన ఏదో తెలియరాని తపన ఆవేదన కర్తవ్యాచరణం నేను నాది నాకోసమనే కర్తృత్వభావత్యాగనిరతి పాఠకుణ్ణి మధురానుభూతుల్లోకి తీసుకెళ్తుంది. ఇది సత్యం.. సత్యం. ఒక భక్తుడు ఆర్ద్రహృదయుడై నిత్యం భగవంతునితో మాట్లాడుతూ వుండాలని అదే భగవత్ సన్నిధికి సోపానాలని తెలుస్తోంది. భగవద్దాసానుదాసులలో చరమదాసులకే ఈ దిశ.. నా దశ అర్థమవుతుంది.**

– శ్రీనివాస దాసుడు రాళ్ళబండి శ్రీనివాసన్

తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 21వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

## సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

**నిబంధనలు:**

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/- ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/-కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ - 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగి రూ. 5/- స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

**గమనిక:**

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సీగూడ, హైదరాబాద్ - 500007.
ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:
**93482 12354**

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

## భృగుడు

సూత మహర్షి రాగానే శౌనకాది మునులందరూ భక్తితో వేచి నిలబడి నమస్కరించి ఆయన ఆసీనుడు కాగానే తామూ కూర్చున్నారు. వెంటనే సూతుడు ''మునులారా! మీ శ్రద్ధాసక్తులు నన్నెంతో అబ్బురపరిచాయి. ఈ రోజు భృగుడనే విప్రుని చరిత్ర చెబుతాను వినండి. శుక్రాచార్యుని జనకుడయిన భృగువు వేరు. ఈ భృగు నామక విప్రుడు వేరు. నామ సామ్యం చేత భ్రమపడకండి. ఇప్పుడు నేను చెప్పబోయే భృగుడు – గంగానదికి దక్షిణ తీరంలో ఉన్న 'మహాపద్మమ'నే నగరంలో నివసించిన ఒక బ్రాహ్మణోత్తముడు. ఎందుకు ఉత్తముడని చెప్పానంటే –

**"ధర్మనిత్యుండు సత్యవ్రత పరుండ హిం**
**సాశాలి యింద్రియ జయవిభాసి**
**నిజకర్మ తృప్తుండు నిష్క్రోధుడంచిత**
**న్యాయ సంప్రాప్త ధనముల దేవ**
**పిత్ర తిథి జ్ఞాతి మిత్ర కార్యములు ని**
**ర్వర్తించు, సువినయ వంతులైన**
**తనయులఁ గన్నాడు, తన్నెల్లవారును**
**వినుతింప మన్నాడు తనమనమున**
**నెట్టి కృత్యంబు మేలొయే నెద్ది సేసి**
**కృత పరాయణ ధర్మతాస్థితి వహింతు**
**నొక్కొ? యని చింతఁబొందుచు నుండు నాత్మ**
**నిష్ఠయలవాటు కాంక్షించి నృపవరేణ్య!**

**-549ప - షష్ఠాశ్వాసము - శాంతిపర్వము - మహాభారతము**

అతడు నిత్యం ధర్మకార్యాలనే ఆచరించేవాడు. సత్యవాక్కును వ్రతంగా పాటించేవాడు. అహింస తత్త్వాన్ని మనసుకెక్కించుకున్నవాడు. ఇంద్రియాలను జయించి కాంతివంతమైనవాడు. నిత్య కర్మలు చేయడంలో తృప్తి చెందినవాడు. క్రోధరహితుడు. న్యాయ మార్గంలో ఆర్జించిన ధనాన్ని మాత్రమే దేవకార్యాలకు, పితృకార్యాలకు,

> **“**
> **పతివ్రతామతల్లీ! నాగేంద్రుడయిన పద్ముని చూడడం కన్నా, నాకింక వేరే కోరిక ఏదీలేదు. ఆ మహానుభావుడు వచ్చేటంతవరకు ఈ ప్రక్కనే ఉన్న అడవిలో వేచి ఉంటాను. ఆయన దర్శనమే నాకు కావలసింది. నీ నాథుడు రాగానే ఆతని కొఱకు నేను వేచి ఉన్నానని చెప్పండి అంతేచాలు.**
> **”**

అతిథి సత్కార్యాలకు, మిత్ర కార్యాలకు వెచ్చించేవాడు. అంతటి చక్కటి సద్వర్తనము కలిగి అందరిచేత మన్ననలు పొందినవాడు. వినయవంతులైన పుత్రులను పొంది ఆనందమగ్నుడైనాడు. అన్నీ ఉన్నా, అంత చేసినా భృగువుకు ఎప్పుడూ ఒక్కటే ఆలోచన. ఎటువంటి కార్యాలు చేస్తే మేలు కలుగుతుంది? వేటిని మంచి పనులని కీర్తిస్తారు? ఏవి చేస్తే నేను ధర్మపరుడనౌతాను? ఆత్మనిష్ఠ ఏం చేస్తే కలుగుతుంది? నిత్యం ధర్మకార్యాలే చేస్తున్నా భృగువు మనసులోనుంచి చింత మాత్రం పోవటం లేదు. అలా భృగువు మథనపడుతుండగా ఒకరోజున ఒక అతిథి అతని ఇంటికి వచ్చాడు. ఆ అతిథి ముఖంలో కనిపిస్తున్న తేజస్సు చూసి పరమానంద భరితుడై ఆ మహానుభావుడికి సకల సత్కారాలూ చేసి, అతని ముందు తన మనసులోని భావాన్ని వ్యక్తం చేశాడు.

“భూసురోత్తమా! నీ సంభాషణ మాధుర్యం వల్ల మన మధ్య మైత్రి ఏర్పడింది. ఆ చనువుతో నా మనసులోని మాట నీకు తెల్పాలని ఉంది. నా పలుకులాలకించి నాకు ఏది హితమో ఉపదేశించవలసిందిగా కోరుతున్నాను. అదేమంటే – నేను ఆత్మావలోకనం చేయాలనే సత్సంకల్పంతో నిష్ఠామతినై కూర్చుంటాను. కాని అది నాకు శక్యం కావటం లేదు. సత్త్వ రజ స్తమో గుణాలలో ఇరుక్కుపోయిన నాకు ఆత్మావలోకనం సాధ్యం కావటం లేదు. ఆత్మను సందర్శించి అఖండానందాన్ని పొందాలంటే ఏం చేయాలి? ఎటువంటి నియమాలకు బద్ధుణ్ణి కావాలి? ఏ మార్గాన్ని అనుసరిస్తే ఆత్మను ఆత్మలోనే దర్శించి సుఖానుభూతిని పొందుతాను. దయచేసి నాకీ విషయాలన్నీ తెలియచెప్పు” అని భృగువడిగాడు.

అప్పుడా అతిథి దేవుడు “మహాత్మా! భృగునామా! నేను కూడా నీలాగానే మోహంలో చిక్కుకుపోయాను. ఎంత ప్రయత్నించినా ఆత్మను దర్శించలేకపోయాను. తద్దర్శనానికి దారి ఏదో ఎంత చింతించినా దొరకలేదు. అయినా ఒక్కటి మాత్రం చెప్పగలను. కొంతమంది బ్రహ్మచర్యాన్ని అవలంబించి, మరికొంతమంది గృహస్థాశ్రమాన్ని పాటిస్తూ, ఇంకొంతమంది తపశ్చర్య చేత – ఆత్మను దర్శించి నీవు చెప్పిన సుఖానుభూతిని పొందుతుంటారు. అంతేకాకుండా యజ్ఞాలు చేసి కొందరు, దానధర్మాల ద్వారా మరికొందరు, నిష్కర్మ ద్వారా ఇంకొందరు ఆత్మసందర్శన సుఖాన్ని అనుభవిస్తుంటారు. ఇంకా చెప్పాలంటే – భృగూ! తల్లితండ్రులను ఆరాధించి కొందరు, గురుభక్తితో కొందరు, సత్శీలంతో కొందరు, శాంతగుణంతో కొందరు, ఇంద్రియ నిగ్రహంతో కొందరు, సత్యవాక్య పాలనతో కొందరు, అహింసా నియతితో కొందరు ఆత్మావలోకనం గావించి మోక్షపదాన్ని పొందుతుంటారు. మోక్షం కావాలి, రావాలి అనుకొంటే – అనుకున్నంత మాత్రాన అది అందరికీ లభిస్తుందా? నాకు తెలిసిన ఒక విషయం చెబుతాను విను. నైమిశారణ్యంలో గోమతీనది ప్రవహిస్తున్నది గదా! ఆ గోమతీ నది చెంతనే మహాపద్మమనే ఒక తటాకం ఉంది. ఆ మడుగు ఒడ్డున ఒక సర్పరాజు నివసిస్తున్నాడు. ఆ తటాక ప్రాంతంలో మాంధాత్రుడు మొదలైన అనేకమంది మహాత్ములు గొప్ప గొప్ప తపస్సులు చేసి ఇహలోక పరలోక సౌఖ్యాలు అనుభవించారు. ఆ పుణ్యక్షేత్రంలో ఒక నాగరాజు నివాస మేర్పరచుకొని ఉన్నాడని చెప్పాను గదా!

**“పద్ముడను పేరి యన్నాగ పతియు దాత్తు**
**డఖిల ధర్మజ్ఞుడతుల దయా న్వితుండు**
**సుజన సంభావ్యమాను డస్తోక పుణ్య**
**నియత నిత్యు డాగంతుక ప్రియతముండు”**

**-పద్యం 558 - షష్ఠ ఆశ్వాసం - శాంతిపర్వం - మహాభారతం**

“భృగూ! ‘పద్ముడు’ అనే పేరుతో ఒప్పియున్న ఆ నాగేంద్రుడు ఎటువంటి వాడనుకొన్నావు? అతడు ఉదాత్త మనస్వి. సమస్త ధర్మసూత్రాలూ తెలిసినవాడు. సాటిలేని దయాహృదయం కలవాడు. నిత్యం గణనీయమైన పుణ్యాకార్యాలు చేస్తూ పేరు తెచ్చుకొన్నవాడు. సుజనుల చేత ప్రశంసింపబడేవాడు. అతిథులను ప్రేమాతిశయంతో సత్కరించేవాడు, గుణ గరిష్ఠుడైన పద్ముడు. నిన్ను మిక్కిలి ఆదరంతో ఆహ్వానిస్తాడు. నీవు నాకు చెప్పిన విషయాన్ని అతి సులభంగా తెలియచెప్పు నీ కోరికను అతి సత్వరంగా తీరుస్తాడు. నా మాట నమ్ము. నాగరాజైన ఆ పద్ముని సందర్శనానికి వెంటనే వెళ్ళు. నీ కోరికా నెరవేరుతుంది. నా

మైత్రీ ధర్మం సఫలమవుతుంది'' అని చెప్పిన అతిథి దేవుని పలుకులకు సంతోషపడిన భృగువు ఆతనిని ఆ నాటి రాత్రి దాకా తనతోనే గడిపి, మరునాడు ఉదయాన వెళ్ళవలసిందని అర్థించాడు. అతిథి కూడా దానికంగీకరించి మరునాడు తన గ్రామానికి వెళ్ళిపోయాడు.

మునులారా! అతిథి ఇచ్చిన సలహా భృగువు కెంతగానో నచ్చింది. వెంటనే ప్రయాణానికి సంసిద్ధుడై బంధుమిత్రులందరి దగ్గరా సెలవు తీసుకుని పద్మని చూడటానికి బయలుదేరాడు.

నైమిశారణ్యానికి బయలుదేరిన భృగువు దారిలో అనేక పవిత్ర తీర్థాలను, పుణ్యక్షేత్రాలను సందర్శించాడు. వెళ్ళి వెళ్ళి నైమిశారణ్యంలో ఉన్న గోమతీ నదీతీరాన్ని చేరాడు. ప్రక్కనే ఉన్న మహాపద్మహ్రదాన్ని చూశాడు. దాని ఒడ్డున ప్రకాశవంతంగా, ఆకర్షణీయంగా వెలిగిపోతున్న పద్మని భవనాన్ని సమీపించాడు. ఎప్పుడైతే ఒక అతిథి తన మందిరంలోనికి ప్రవేశించి వస్తున్నాడో – అది చూసిన నాగేంద్రుని పత్ని భక్తితో భృగుడికి ఎదురు వెళ్ళి గౌరవంతో లోపలికి రమ్మని ఆహ్వానించి సకల సత్కారాలు చేసింది. నమస్కరించి – ''మహాత్మా! మీరే పని మీద మా గృహానికి విచ్చేశారు? మీరు ఏది ఆజ్ఞాపించినా దానిని చేయటానికి సంసిద్ధంగా ఉన్నాను. చెప్పండి స్వామీ'' అని వినయంగా నమస్కరించి నిలబడింది.

''తల్లీ! నేను నీ భర్త అయిన పద్మని కలిసి మాట్లాడాలని వచ్చాను. ఆయన వద్దకు తీసుకొని పొమ్ము'' అన్న భృగుని మాటలు విన్న ఆ సాధ్వి తన భర్త ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో చెప్పసాగింది.

''దినకరుడైన సూర్యుని రథానికి నా పతి వాహకులలో ఒకడు. ఇప్పుడాతని వంతు రావడంతో సూర్యుని రథాన్ని మోయడానికి ఆ దేవుని చెంతకు వెళ్ళాడు. తన విధి పూర్తి అయిన తరువాత, సుమారు ఏడెనిమిది రోజుల తరువాత ఇక్కడకు వస్తాడు. నిజం చెబుతున్నాను. నీవెందుకిక్కడకు వచ్చావో, ఏ కోరిక మీద వచ్చావో చెబితే నేనా కోరికను సఫలీకతం చేస్తాను. ఎందుకంటావేమో భర్త విధి భార్యది కదా! సర్పరాజులే సూర్యరథానికి కట్టే త్రాడులు గదా! నెలవారీ వంతు రావడంతో నా నాథుడు సూర్య దేవుని వద్దకు వెళ్ళాడు. తిరిగి రావటానికి సమయం పడుతుంది. నీకేం కావాలో చెప్పు. తప్పక ఇస్తాను'' అన్న పద్మని భార్య మాటలకు ఆ పతివ్రతలోని ధర్మగుణానికి, అభ్యాగత సేవాభిలాషకు మనసులో మెచ్చుకున్నాడు భృగువు.

**నాథా! నీవు చెప్పిన ధర్మసూత్రాలన్నీ నా మదిలో ఎప్పుడు మెదులుతూనే ఉంటాయి. ఒకసారి గుర్తు చేస్తాను. నీ పట్ల నా భక్తి ఎటువంటిదో తెలుస్తుంది. శిష్యులైన వారికి గురుభక్తే అసలైన వ్రతం. బ్రాహ్మణులకు అనవరతం వేద జ్ఞానాన్ని తెలుసుకోవటమే కర్తవ్యం. ఇక రాజులైన వారికి ప్రజలను రక్షించటమే విధి. వైశ్యులకు న్యాయసమ్మతంగా ధనాన్ని ఆర్జించటం సద్వ్రతం.**

''పతివ్రతామతల్లీ! నాగేంద్రుడయిన పద్మని చూడడం కన్నా, నాకింక వేరే కోరిక ఏదీలేదు. ఆ మహానుభావుడు వచ్చేటంతవరకు ఈ ప్రక్కనే ఉన్న అడవిలో వేచి ఉంటాను. ఆయన దర్శనమే నాకు కావలసింది. నీ నాథుడు రాగానే ఆతని కొఱకు నేను వేచి ఉన్నానని చెప్పండి అంతేచాలు'' అని చెప్పి భృగువు గోమతీ నదీతీరాన ఉన్న పుణ్యారణ్యానికి వెళ్లిపోయాడు. అక్కడ పద్మని రాకకోసం ఎదురు చూస్తూ నిరాహారుడై జపం చేసుకుంటూ ఉండిపోయాడు. ఆరు రోజులు జరిగాయి. అయినా భృగువు ఆహారం తీసుకోలేదు. పద్మని వార్త తెలియలేదు. భృగువు నిష్ఠ మానలేదు. ఈ విషయం గమనించారు పద్మని బంధువులు. తమ ధర్మాన్ని తాము నిర్వహించాలనే తలంపుతో ఆ బంధువులు పద్మని భార్యను, పుత్రులను తమ వెంట తీసుకుని భృగువు వద్దకు వెళ్ళి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ''మహాత్మా! నీవిక్కడకు వచ్చి ఆరు దినాలయింది. ఇంతవరకు నీవు మా ఆతిథ్యాన్ని స్వీకరించలేదు. మొదటి నుంచి మేము అతిథి పూజాపరులము. మేము ధర్మాన్ని తప్పకుండా మెలగాలన్నది మా లక్ష్యం. మమ్మల్ని అధర్మపరులుగా చేయక, మా ప్రార్థనను మన్నించి నీవిప్పటికైనా భుజించాలన్నది మా కోరిక. అన్నము, ఫలాలు, కందమూలాలు సిద్ధంగా తెచ్చాము. అవేగాక ఇంక దేనిని నీవడిగినా తెచ్చి ఇస్తాము. నీవు ఆహారమును స్వీకరించి మమ్మల్ని రక్షించు'' అని ప్రాధేయపడ్డారు వారందరూ. వ్రతనిష్ఠలో ఉన్న భృగువు వారి మాటలాలకించి తన ఉద్దేశాన్ని కూడా తెలియబరిచాడు.

''ధర్మపరులైన నాగరాజులారా! నాదొక విన్నపం. భుజగేశ్వరుడైన పద్మని రాకకోసం ఎదురుచూస్తూ జపనిష్ఠలో మునిగి ఉన్నాను. పద్మని చూసి, అతనితో

మాట్లాడేంతవర కు నేను భుజించకూడదని నియమం పెట్టుకున్నాను. నా నియమం తీరేవరకు నాకు ఆకలీ వుండదు. దప్పిక వేయదు. మీమీద అలిగి నేనీ అడవికి రాలేదు. మీ ఆతిథ్యాన్ని తిరస్కరించాలన్న ఉద్దేశం నాకు లేదు. నా నియమాన్ని భగ్నం చేసి నన్ను బాధపెట్టడం భావ్యం కాదు గదా. అంతేగాక ఇంక రెండు రోజులలో నా వ్రత దీక్ష కూడా పూర్తవుతుంది. ఈ రెండు దినాలూ వేచి ఉండండి. మీకు అతిథిపూజ చేయలేదన్న ధర్మహాని కలుగకుండా చూస్తాను. మరొక మాట. ఒకవేళ ఎనిమిదో రోజున కూడా పద్ముడు రాకుంటే – ఆ దినాన మీ మాట ప్రకారమే మీ గృహానికి వచ్చి తప్పకుండా భుజిస్తాను'' అని భృగువు సర్పరాజులను, పద్ముని భార్యను వేడుకున్నాడు. భృగువు యొక్క ఆలోచనలను అంగీకరించిన సర్పరాజులు తమ తమ నివాసాలకు వెళ్ళిపోయారు. భృగువు కోరుకున్నట్లు ఎనిమిదో రోజు రానే వచ్చింది. పద్ముడి విధ్యుక్త ధర్మం కూడా ఆ నెలకు పూర్తికాగా సూర్యానుమతితో ఇంటికి తిరిగి వచ్చాడు ఆ సర్పేంద్రుడు. వచ్చిన పెనిమిటిని చూసి మహదానందపడిపోయింది ఆ పతివ్రతా శిరోమణి. అప్పటికే అలంకరించుకొని ఉన్న ఆమె భర్తకు ఎదురు వెళ్ళి సగౌరవంగా కానుకలతో ప్రియ సంభాషణ మొనర్చి ఇంటి లోపలికి తీసుకొని వచ్చి కాళ్ళకు నీళ్ళొసగి, ఆతని సంతోషమే తన సంతోషంగా భావించి నమస్కరించింది. తనకు సమీపంగా ఉన్న భార్యను చూసి పద్ముడు ఆనందం వెల్లి విరుస్తుండగా –

**"అతివ! సేమమె! తగ దేవతాతిథి ప్ర**
**పూజనంబులు నడచునే? పూర్వవృత్తి**
**యెడలి యేను లేకునికి నేమేని వికల**
**మయ్యెనో? చెప్పు' మనవుడు నా మృగాక్షి"**

**-576 పద్యము - షష్ఠాశ్వాసము - శాంతి పర్వము - మహాభారతము**

''సుందరీ! ఇక్కడ అందరూ క్షేమమే గదా! దేవతలను, అతిథులను సక్రమంగా యథావిధిగా పూజిస్తున్నారా? ఈ కొద్ది నాళ్ళూ నేనిక్కడ లేకపోవటం వల్ల – ఏమైనా తప్పులు జరగలేదు గదా! నా పరోక్షంలో ఏమైనా ముఖ్య విషయాలు జరిగితే చెప్పు 1 నేను చూసుకుంటాను'' అని లాలనగా అడిగాడు.

''నాథా! ఇంతకాలం నీవు నాకిచ్చిన శిక్షణ ఉంది గదా! నేను ధర్మకార్యాలు నిర్వర్తించకుండా ఉంటానా? దేవపూజలన్నీ ప్రతిరోజు సక్రమంగా చేశాను. అతిథి సత్కారాలు సమగ్రంగానే నిర్వహించాను. మిత్రులను సగౌరవంగా సన్మానించాను. పూర్వం లాగా, ఎక్కడా, ఏ లోపం జరగకుండా అన్నీ యథావిధిగా జరిగాయి.

**"గురుభక్తి శిష్యులకును, వేదపరత వి**
**ప్రులకును, జనరక్ష భూపతులకు,**
**న్యాయార్జనంబు వైశ్య జనంబులకుఁ ద్రి వ**
**ర్ణారాధనంబు శూద్రావళికిని**
**పతివాక్య కరణంబు భటులకు, సర్వోప**
**కారక్షమంబైన సారభూత**
**మనగ పెంపొందు గృహస్థాశ్రమంబు పై**
**వారని ప్రియమెల్ల వారలకును**
**లోకమేల? యేనేల? యిట్టేకతంబ**
**యింద్రియంబుల గుదియించి యిచ్చ నడచి**
**యుండు వాడగాకను మతి యోగికిని, బ**
**తివ్రతాత్వంబు భార్యకు సువ్రతములు"**

**-579 పద్యము - షష్ఠాశ్వాసము - శాంతిపర్వము - మహాభారతము**

నాథా! నీవు చెప్పిన ధర్మసూత్రాలన్నీ నా మదిలో ఎప్పుడు మెదులుతూనే ఉంటాయి. ఒకసారి గుర్తు చేస్తాను. నీ పట్ల నా భక్తి ఎటువంటిదో తెలుస్తుంది. శిష్యులైన వారికి గురుభక్తే అసలైన వ్రతం. బ్రాహ్మణులకు అనవరతం వేద జ్ఞానాన్ని తెలుసుకోవటమే కర్తవ్యం. ఇక రాజులైన వారికి ప్రజలను రక్షించటమే విధి. వైశ్యులకు న్యాయసమ్మతంగా ధనాన్ని ఆర్జించటం సద్వ్రతం. పై మూడు వర్ణాల వారిని ఆరాధించటం నాలుగో వర్ణం వారికి ధ్యేయం. భటులు రాజాజ్ఞను శిరసావహించటాన్ని లక్ష్యంగా ప్రవర్తించాలి. చాతుర్వర్ణాల వారికి ఉపకారం చేయాలనే సద్బుద్ధితో మెలిగే వారితో నిండిన గృహస్థాశ్రమం మీద అభిమానం కలిగి ఉండటం సర్వుల ముఖ్య లక్షణం. లోకంతో పనేమిటి? నేనేమిటి? నా నిత్య ధర్మమేమిటి? ఇంద్రియాలను జయించి, ఏకాగ్రచిత్తంతో నిష్కాముడనై తపస్సు చేసుకుంటాను అనే ఆలోచనలో వర్ణించటం యోగివ్రతం. పాతివ్రత్య లక్షణాలతో పతిని అనుసరించటమే భార్యకు సువ్రతం. ఇటువంటి సమస్త ధర్మ పరిజ్ఞానాన్ని కలిగిన నీ అడుగు జాడలలో, ధర్మసూక్ష్మాలను పరిగణించే నీ బోధనతో ప్రవర్తించే నేను నీ మనసుకు కష్టాన్ని కలిగించే ఏ పనైనా చేస్తానా? చేయనని నీకూ తెలుసు. నీ పరోక్షంలో నీవు నిర్దేశించిన సమస్త శుభకార్యాలూ నిర్విఘ్నంగా జరిగాయి. వాటి గురించి నీవేమీ ఆలోచించవలసిన పని లేదు. ఈ కాలంలో జరిగిన ఒక ముఖ్య విషయం మాత్రం నీ దృష్టికి తీసుకు రాక తప్పదు. అదేమంటే – నాథా! పరమ పవిత్రమూర్తి అయిన ఒక బ్రాహ్మణోత్తముడు మన గృహానికి వచ్చాడు. నేను అతిథి

సత్కారా లన్నిటినీ చేసి, ఏ పనిమీద వచ్చావని అడిగాను. కాని ఆ మహీసురుడు ‘ నీ భర్తను దర్శించటానికి వచ్చాను’ అ ని చెప్పాడే గాని, కార్యమేమిటో అని నేనడిగినా, ఏమీ చెప్పలేదు. నీవు ఇంటివద్ద లేవనీ, సూర్యదేవుని వద్దకు సేవా నిమిత్తమై వెళ్ళావని చెప్పాను. దానికా విప్రుడు సర్వేంద్రుడు తిరిగి వచ్చేవరకు ఇక్కడకు కొంచెం దూరంలో ఉన్న అడవిలో జపం చేసుకుంటూ ఉంటాను. నీ నాథుడు రాగానే నాకు తెలియబరచమని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ విప్రుడు వెళ్ళి ఏడు రోజులైంది. ఈరోజు ఎనిమిదో రోజు. మన బంధువులు, పుత్రులు, నేను అందరం కలిసి అతని వద్దకు మొన్నటి దినాన వెళ్ళి నిరాహారుడిగా, జపతత్పరుడిగా ఉన్న ఆయనను ఆహారాన్ని స్వీకరించమని ప్రార్థించాము. కాని, అతడు తన నియమాన్ని వదలలేదు. అందువల్ల నీవా అతిథి చెంతకు వెళ్ళి ఆతనిని గౌరవపూర్వకంగా సన్మానించి ఆతని కోరిక తీర్చాలి. ఇదొక్కటే నీవు చేయవలసిన పని'' అని భార్య నివేదించగానే పద్ముడు ఒక్కసారిగా కోపోద్రిక్తుడైనాడు. భార్యవైపు ఎఱ్ఱబారిన కళ్ళతో చూచాడు.

“మానినీ మణీ! ఏమిటేమిటి? నేను ఎవడో ఒకడిని చూడటానికి వెళ్ళాలా? ఏమి చెబుతున్నావు నీవు? నేనెవరినో నీకు తెలియదా? దేవతలు, గంధర్వులు, రాక్షసులు మొదలైన వారంతా నన్నే విధంగా గౌరవిస్తారో నీకు తెలియదా? ఊరూ పేరూ కూడా తెలియని ఒక అనామకుడిని దర్శించి, గౌరవించటానికి నేను వెళ్ళటమేమిటి? అది అసంభవం. నీవు నన్నక్కడికి వెళ్ళమని చెప్పటం కూడా సబబుగా లేదు'' అని పద్ముడు ఉగ్రుడై పలికేసరికి అతనిని శాంతచిత్తుని చేయబోయింది ఆ పతివ్రతామ తిలకం.

**“అనిన నీరాక వార్చి మహాశతోడ**
**నున్న విప్రుని యభిలాష మొక్క భంగి**
**తీర్పకుండుట ధర్మువే? ధీర శాంత**
**చిత్త! నీ యట్టి యాచార విత్తమునకు”**

**-పద్యము 582 - షష్ఠాశ్వాసము - శాంతిపర్వము - మహాభారతము**

ధీరశాంతచిత్తుడవైన సర్వేంద్రా! నా మాట కూడా విను. నీ రాక కోసం నిరాహారుడై, నీ సందర్శనం కోసం భగవద్ధ్యానంలో నిమగ్నుడై ఎదురు చూస్తున్న విప్రుని కోరికను తీర్చకపోవటం నీకు ధర్మమంటావా? నీవు మొదటినుంచీ కూడా సదాచార పరాయణుడవే. అటువంటి నీవు – నిన్ను వెతుక్కుంటూ వచ్చిన అతిథిని నిరాకరించి నిరాశపరచటం నీకు ఉచితమేనా? చెప్పు. సర్వధర్మ నిష్ణాతా! వేదవేదాంగ విదుడవైన నాథా! మరొక్కమాట! ఉత్తమోత్తముడైన ఒక బ్రాహ్మణుని నిష్కారణంగా, అతిథి అని అయినా చూడకుండా, బాధిస్తే – ఆ పాపం ఊరికే పోతుందా? ఆ విషయం నీకు నేను చెప్పాలా? ఆ పాపాగ్నిలో నీ ధర్మశాస్త్ర వైదుష్యాన్ని, నీ సందర్భోచిత ఔచిత్యాన్ని, నీ దయాగుణ పారమ్యాన్ని, చివరకు నీ ముక్తి సాధనను కాల్చివేయటానికి సిద్ధపడతావా? అదేనా నీ న్యాయోక్తి? ఆ విప్రుని ఆశను భంగపరిస్తే – అది బ్రహ్మహత్యా పాతకానికే దారి తీస్తుంది గదా! నీవా ధర్మనిష్ఠలో పుట్టి పెరిగినవాడివి. ఆ విప్రుని కోరిక తప్పక తీర్చాలని అనుకోవటం నీ ధర్మం కాదా! ఇంకో విషయం. జ్ఞానమూర్తులైన పండితులు – మౌనం వహించటం వల్ల దృఢమైన జ్ఞానం, దానం చేయటం వల్ల అభివృద్ధీ, కోరిక తీర్చటం వల్ల నరకయాతన తప్పిపోవటం, మొదలైన సుఖాలు కలుగుతాయని నొక్కి వక్కాణించారు.

**ప్రాణనాథా! తొలకరి వాన కోసం చాతక పక్షి ఆశగా ఎదురు చూసేవిధంగా నీ రాక కోసం, ఆ విప్రుడు ఎంతో ఆశతో వ్రతదీక్ష పూని మన మందిరానికి కొద్ది దూరంలోనే ఉన్న అడవిలో నిరీక్షిస్తూ ఉన్నాడు. సజ్జనుడైన ఆతనిపైన నీకు క్రోధం ఎందుకు చెప్పు? ధర్మమూర్తీ! సమాదరణంతో ఆతని ఆశను తీర్చి, అతనిని సంతోషపెట్టడమే నీ కర్తవ్యం గదా?”**

ప్రాణనాథా! తొలకరి వాన కోసం చాతక పక్షి ఆశగా ఎదురు చూసేవిధంగా నీ రాక కోసం, ఆ విప్రుడు ఎంతో ఆశతో వ్రతదీక్ష పూని మన మందిరానికి కొద్ది దూరంలోనే ఉన్న అడవిలో నిరీక్షిస్తూ ఉన్నాడు. సజ్జనుడైన ఆతనిపైన నీకు క్రోధం ఎందుకు చెప్పు? ధర్మమూర్తీ! సమాదరణంతో ఆతని ఆశను తీర్చి, అతనిని సంతోషపెట్టడమే నీ కర్తవ్యం గదా?'' అని ఉద్బోధించిన భార్య మాటలకు నిండు మనసుతో ఆనందించాడు పద్ముడు. అంతవరకు తనలో చెలరేగిన కోపాన్ని ఉపసంహరించుకున్నాడు. చల్లని చూపులతో భార్యవైపు చూశాడు. శాంతమూర్తి అయినాడు.

**“నీయట్టి భార్య కలుగుట**
**తోయజ దళనయన! యిట్లు తొలగితి దురితా**
**పాయంబునఁ బొరయక, యే**
**పోయెద నవ్విప్రు కోర్కి పూర్ణము సేయన్”**

**-590 పద్యము - షష్ఠాశ్వాసము - శాంతిపర్వము - మహాభారతము**

“సాధ్వీమణీ! నీవంటి ధర్మపరాయణురాలైన భార్యను కలిగి ఉన్నందున పాప పంకిలం నుండి బయట పడగలిగాను. అపాయం నుంచి భర్తను రక్షించగలిగేది భార్యే గదా! కనీ, వినీ ఎరుగనివాడు, ఒక అజ్ఞాన పురుషుడు, అనామకుడు వేచి ఉన్నాడు, అతనిని వెళ్ళి చూసిరమ్మని నీవు గట్టిగా చెప్పడంతో గర్వం నన్ను ఆవహించింది. కోపం పెల్లుబికింది. అందుచేతనే నిన్ను, నీ మాటలను తిరస్కరించాను. సురాసురుల చేతనే గౌరవింపబడే నేను ఒక సామాన్య మానవుని చూడటానికి వెళ్ళటమా అని అహంకరించాను. నా ప్రవర్తనకు నీవు ఏమాత్రం బెదరకుండా నాకు ధర్మోపదేశం చేశావు. నీవు చెప్పినదంతా నిజమే. నా కర్తవ్యాన్ని, ధర్మాచరణను గుర్తు చేసి నన్ను అధర్మవర్తన నుంచి తప్పించావు. నాకు ఎంతో మేలు చేశావు. అప్రతిష్ఠపాలు కాకుండా నన్ను కాపాడావు. మితి లేని కోపం కారణంగానే కార్తవీర్యార్జునుడు పరశురాముని చేతిలో మృతి చెందాడు గదా! క్రోధావేశంతోనే రావణాసురుడు శ్రీరాముని చేతిలో ప్రాణాలు కోల్పోయాడు. అనేకులు కోపిష్ఠులై నశించిపోయారు. ధర్మగుణం రక్షించటం, అధర్మం భక్షించటం సహజం. అది తెలుసుకొని క్రోధాదులను దూరం చేసుకొని, సత్ప్రవర్తనతో మెలగడం సర్వజన శ్రేయస్కరం. నీవు చెప్పిన ధర్మవాక్యాలు నాకు సదా ఆచరణీయాలు” అని పలికి, పద్ముడు వెంటనే భృగుడున్న ప్రదేశానికి వెళ్ళాడు.

తనముందు వినయవంతుడై నిలబడిన పద్ముని చూసిన భృగుడు సంతోషాతిశయంతో అతనికి ఎదురు వెళ్ళి సగౌరవంగా అతనిని తీసుకొని చెట్ల నీడలో ఉన్న ఒక ఇసుక తిన్నెను సమీపించాడు. ఇద్దరూ ఇసుకతిన్నెపైన ఆసీనులైనారు. పద్ముడు భృగుని ప్రేమమీర చూసి — ‘విప్రోత్తమా! అత్యంత నిష్ఠతో, నిరాహారుడవై నా రాక కోసం ఎదురు చూస్తున్నందుకు గల కారణమేమిటి? నీ కోరిక ఏమిటి? అది ఏదైనా తప్పక తీరుస్తాను. నీ కోరిక ఏమిటో చెప్పు మహాత్మా! నా భార్య, బంధువులు నీవిక్కడ నాకోసం వేచి ఉన్నావని చెప్పారు. దర్శించదగిన వాడివైన నీ దగ్గరకు వెంటనే వచ్చాను. నీ రాకకు గల కారణం తెలుసుకోవాలని ఉంది” అని అడగడంతో భృగువు తన గురించి చెప్పసాగాడు.

“మహానుభావా! సర్పరాజా! నేను ధర్మారణ్యంలో జపధ్యానాదులు చేసుకుంటూ ఉండేవాడిని. మాన్యుడైన బ్రాహ్మణుని కుమారుడను. నిన్ను దర్శించాలనే కోరికతో నైమిశారణ్యానికి వచ్చాను. నీ మందిరానికి వచ్చిన నాకు అతిథి సత్కారాలు చేసి, నీ గృహిణి, నీవు సూర్యదేవుని ఆరాధించటానికి వెళ్ళిన సంగతి చెప్పడంతో ఇక్కడే ఉండిపోయాను. ఈ ఏడెనిమిది రోజులు నీ రాకకోసం వాన కోసం కర్షకుడు ఎదురు చూసినట్లు నియమ నిష్ఠలతో దైవధ్యాన నిమగ్నుడనై ఎదురు చూస్తూ గడిపాను. నా మనోవ్యథను పోగొట్టడానికి నీవే అర్హుడివి. వేరెవ్వరూ లేరు. ఇది నా మనోనిశ్చయము” అన్న భృగువు మాటలకు ఆయన కోరిక తీర్చడం తన విధ్యుక్త ధర్మమని భావించిన పద్ముడు — భృగువు ముఖ తేజస్సు గమనించాడు.

**“నీవు కళ్యాణ మూర్తివి నీ మనో ర**
**థంబు సఫలంబు సేసి కదా మదీయ**
**జనన సఫలత గలిగింతు’ నను భుజంగ**
**మాధిపతి మోముc జూచి యిట్లనియె నతడు”**

**-595 పద్యము - షష్ఠాశ్వాసము - శాంతిపర్వము - మహాభారతం**

“భృగూ! నీవు శుభాకారుడివి. శుభమనస్వివి. నీ కోరిక తీర్చినప్పుడు గదా నా జన్మకు సఫలత చేకూరేది. నీ కోరిక ఏమిటో చెబితే దానిని తీర్చి ధన్యుడినౌతాను” అన్న పద్ముని చూసి ఒక్కక్షణం తటపటాయించాడు భృగువు” అని నిమిషం ఆగిన సూత మహర్షిని చూసి లేచి నిలబడ్డాడు శౌనకుడు.

“గురుదేవా! అయితే ఆత్మ సందర్శనం చేయటానికి అనువైన పద్ధతులన్నీ సర్పరాజైన పద్ముడికి తెలుసంటారా? వాటిని భృగువుకు తెలియజెప్పాడా?” అని అడిగాడు.

శౌనకుని ప్రశ్నలు విన్న సూత మహర్షి —

“మునులారా! ఆ విషయాలన్నీ సవిస్తరంగా రేపు చెబుతాను. ఈనాటికి మీ మీ నివాసాలకు వెళ్ళి రేపు రండి” అని చెప్పి తానూ ఆశ్రమోన్ముఖుడైనాడు.

**(సశేషం)**

**“సాధ్వీమణీ!**
**నీవంటి ధర్మపరాయణురాలైన**
**భార్యను కలిగి ఉన్నందున పాప**
**పంకిలం నుండి బయట పడగలిగాను.**
**అపాయం నుంచి భర్తను రక్షించగలిగేది భార్యే**
**గదా! కనీ, వినీ ఎరుగనివాడు, ఒక అజ్ఞాన**
**పురుషుడు, అనామకుడు వేచి ఉన్నాడు,**
**అతనిని వెళ్ళి చూసిరమ్మని నీవు గట్టిగా**
**చెప్పడంతో గర్వం నన్ను**
**ఆవహించింది.**



ధారావాహికం

# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

గత సంచిక తరువాయి

## తూలనాడుట

ఆర్తనాదం విన్నది సీత. అది రాముని కంఠస్వరమే. నిశ్చయించుకుంది. చూసింది లక్ష్మణుణ్ణి.

నహిమే హృదయం స్థానే జీవితం వావతిష్ఠతి

''నా మనసు మనసులో లేదు. నా ప్రాణాలు పోయేటట్లున్నాయి. సౌమిత్రీ! ఆక్రందన విన్నావుగా. రాముణ్ణి కాపాడు. పో పరిగెత్తు'' – అది మైథిలి ఆత్రుత. ఆవేదన.

కదల్లేదు లక్ష్మణస్వామి.

క్రుద్ధురాలైంది జానకి. ''లక్ష్మణా! రాముని మీద నీది ప్రేమ కాదు. నట. నీ ప్రేమ బూటకం.

''మిత్ర రూపేణ భ్రాతుస్త్వమపి శత్రువత్''

రామునికి మిత్ర రూపంలోని శత్రువు నువ్వు. నన్ను కోరుతున్నావు. అందుకే పోలేదు. నా భర్త ఆపద పాలు కావాలి. అది నీకు ఇష్టం. సంకటస్థితిలో ఉన్నాడు రాముడు. ఇపుడు నా రక్షణ ముఖ్యమా? నేను క్షేమంగా ఉన్నాను. వుంటాను. నిజంగా అన్న మీద ప్రేమ ఉంటే – రాముణ్ణి రక్షించు. త్వరగా పో'' – భయకంపిత అయింది. శోకమగ్న అయ్యింది. కన్నీరు మున్నీరుగా విలపించింది.

పరుష వచనాలవి. విన్నాడు లక్ష్మణుడు. అంటున్నాడు ''అమ్మా! రాముడంటే ఎవరనుకున్నావ్? నాగులు అసురులు గంధర్వులు కిన్నెరులు దానవులు రాక్షసులు దేవతలు మానవులు ఎవ్వరూ అన్నకి హాని చేయలేరు. జయించలేరు. రాముడు విష్ణు పరాక్రముడు. తల్లీ నువ్వు ఇలా మాట్లాడతగదు. నిన్ను రక్షించాలి. అది నా ధర్మం. అది రామాజ్ఞ. నిన్ను ఒంటరి దాన్ని చేయలేను. ఆశ్రమం విడిచి పోలేను''.

''అమ్మా! మనసు కుదుట పరచుకో. శోకించకు. జింకను తెస్తాడు. లేదా చంపుతాడు. త్వరగా వస్తాడు రాముడు. మనకు వినిపించింది రాముడి కంఠం కాదు. అది మారీచుని మాయ. అది వాడి గొంతుక. నీ రక్షణ భారం నాకు అప్పగించాడు. మళ్ళీ నిన్ను అన్నకి అప్పగించాలి. అది నా ధర్మం. అందుకే నిన్ను వదిలిపోలేను. ఖరదూషణాదుల్ని సంహరించాం మనం. రాక్షసులకి పగవారమైనాం మనం. సీతమ్మా! అది రాక్షసుల పనే. చింతించకు తల్లీ'' – అది

లక్ష్మణుని వినయపూర్వక సమాధానం.

విన్నది మైథిలి. కోపం తారాస్థాయికి చేరింది. కన్నులు ఎఱ్ఱబడ్డాయి. పరుషంగా అంటోంది.

**అనార్యా! కరుణారంభ! నృశంస! కులపాంసన ।**
**అహం తవప్రియం మన్యే రామస్య వ్యసనం మహత్ ।।**

"దుశ్శీలుడా, కఠినాత్ముడా, నీవు క్రూరుడవు. వంశనాశకుడవు. రాముడు ఆపదలో వున్నాడు. అది తెలుసు నీకు. నీది దుర్బుద్ధి. నీదు మేకవన్నెపులివి. ప్రచ్ఛన్న శత్రువు నీవు. లక్ష్మణా నన్ను పొందాలని ఉన్నావు. అందుకే రాముని వెంట వచ్చావు. భరతుడే నిన్ను ప్రేరేపించి ఉంటాడు. నీ కోరిక తీరదు. భరతుని పన్నాగం ఫలించదు. రాముణ్ణి ఆశ్రయించాను నేను. ఒక క్షుద్రుణ్ణి కోరుతానా? నా రాముడు లేకపోతే — ఒక్కక్షణం బతకను. ఇదో ఇపుడే నీముందు ప్రాణాలు విడుస్తాను. గోదావరిలో దూకుతాను. ఉరి పోసుకుంటాను. కాలకూట విషం తాగుతాను. అగ్ని ప్రవేశం చేస్తాను".

**నత్వాహం రాఘవాదన్యం పదాపి పురుషం స్పృశే**
**'రాముని తప్ప – పర పురుషుణ్ణి కాలితో కూడా స్పృశించను'.**

ఆమె క్రోధం దుఃఖంగా మారింది. గుండెలు బాదుకుంది. విలపించింది. చూశాడు లక్ష్మణుడు. ఓదార్చాలనుకున్నాడు. ఆమె క్రోధావేశానికి తగ్గాడు. మౌనం వహించాడు. అయినా తొణకలేదు. తల వంచాడు. నమస్కరించాడు. అంటున్నాడు.

"అమ్మా నీవు పూజ్యురాలవు. ఇలా మాట్లాడ తగదు. అయినా పరుషంగా మాట్లాడుతారు స్త్రీలు. అది వారికి సహజగుణం. ఒక్కోసారి వినయం కోల్పోతారు. ధర్మం కోల్పోతారు. చాంచల్యానికి లోనవుతారు. క్రూరంగా ప్రవర్తిస్తారు. ఆప్యాయతలుండవు. అనురాగాలుండవు. అనుబంధాలుండవు. అన్నింటికి విఘాతం కల్గిస్తారు. తల్లీ! నీవు జనకరాజు పుత్రివై వుండి – చాలా నిష్ఠూరంగా పలికావు. నీ మాటలు — కాల్చిన బాణపు ములుకుల్లా ఉన్నాయి. నా చెవుల్ని కాల్చినట్లున్నాయి. ఒక దుష్టస్వభావం కల స్త్రీలా — ఒక పామర స్త్రీలా నన్ను, నా శీలాన్ని శంకించావు. దానివల్ల ఏ కీడు కల్గుతుందో?"

"అమ్మా నేను వెళ్తున్నాను. నీకు భద్రమగుగాక. వనదేవతలు నిన్ను రక్షించెదరు గాక. నాకు అపశకునాలు కనిపిస్తున్నాయి. అవి భయంకరంగా ఉన్నాయి. రామునితో నీవు కలిసి ఉండాలి. అలా చూసే భాగ్యం కలుగుతుందో కలగదో — నేనెరుగను" అది సౌమిత్రి — బాధాతప్త హృదయం.

పర్ణశాల వదిలాడు లక్ష్మణస్వామి. నడిచాడు. ఆగాడు. వెనక్కి తిరిగి చూశాడు సీతమ్మని. నడిచాడు. పదే పదే వెనక్కి తిరిగాడు. చూశాడు. గుండె నిబ్బరం తెచ్చుకున్నాడు. కదిలాడు ముందుకు. పోతూ పోతూ మూడు గీతలు గీశాడని — ఆ గీతల్ని దాటవద్దన్నాడని — ఆ గీతలే లక్ష్మణరేఖ అని — ఒక నానుడి ఉంది. అలాంటివి శ్రీరామాయణంలో లేవు. వాల్మీకి చెప్పనూ లేదు.

## మనలో మాట

సీతమ్మ మాయలేడిని కోరడం విశ్లేషిస్తే — కొన్ని నిజాలు బయట పడతాయి. 1. వనవాసంలో ఆకులు కందమూలాలు పండ్లు పూలు చాలు నాకు. రామా! నేను నిన్నేమీ కోరను. నీకు కష్టం కల్గించను. నీకు బరువు కాను. నీవెంట నన్ను తీసుకెళ్ళు అంది మైథిలి.

ఏదైనా కోరుకో ఇస్తానంది అనసూయ. అపుడూ ఏమీ కోరలేదు జానకి. అలా పదమూడేళ్ళు గడిచాయి. ఇపుడు జింకను కోరింది. సతికి పతియే దైవం. భర్తని కాదని మరొకటి కోరరాదు. మాయమృగాన్ని కోరింది. ఫలితం — భర్తకు దూరమైంది. ఇది భారతీయ మహిళా లోకానికి ఒక గుణపాఠం అంటోంది శ్రీరామాయణం.

ఆధ్యాత్మిక పరంగా ఆలోచిస్తే — పరమాత్మని జీవుడు విస్మరిస్తాడు. లౌకిక విషయాస్తుడవుతాడు. అపుడు ఫలితం ఎలా ఉంటుందో – కష్టాల కడలిలో మునగానాం తేలానాంగా వుంటుందని — హెచ్చరిస్తున్నాడు వాల్మీకి మహర్షి మనల్ని.

2.అగ్రస్తే గమిష్యామి మృద్నంతీ కుశకంటకాన్ — నీకు ముందు నడుస్తాను. దర్భలు ముళ్ళు తొలగిస్తాను అంది. ఖరదూషణ మారీచాదులు దర్భలు. రావణ కుంభకర్ణ ఇంద్రజిత్తు ఇత్యాదులు ముళ్ళు. వాళ్ళని సంహరించు. అందుకే ముందు లంక చేర్తాను — అని అంతరార్థం.

3.అది నెరవేరాలంటే — జింకను కోరాలి. రాముణ్ణి పంపాలి. సౌమిత్రిని పొమ్మన్నా పోలేదు. అతని శీలాన్ని శంకించింది. పరమభాగవతుడైన భరతుణ్ణి కూడా అనరాని మాటలంది. అంత కఠినంగా పలికితే కాని లక్ష్మణుడు వెళ్ళడు. తను ఒంటరి కావాలి. అపహరణానికి గురి కావాలి.

అంటే సీత మూఢురాలు కాదు. మొండిది కాదు. అగస్త్యాశ్రమంలో అన్నదమ్ములకు ఆయుధాలందించింది. ఎలాగైనా తను ముందుగా లంక చేరాలి. అది దేవకార్యం కోసం. రామావతార ప్రయోజనం కోసం. లోక కళ్యాణం కోసం — ఇది అంతర్లీనంగా సీతమ్మ కోరిక.

4.జానకిని అడవులకి వద్దన్నాడు రాముడు. పురుషవేషంలోని ఆడదానివా అని ఎగతాళి చేసింది.

శేషభూతుడైన లక్ష్మణస్వామిని తూలనాడింది. మొదటిది భగవద పచారం. దానికి ఆర్నెల్లు – రెండోది భాగవత అపచారం. దానికి ఆర్నెల్లు. వెరసి మొత్తం ఏడాదిపాటు శిక్ష. నిష్కారణంగా ఎగతాళి చేయరాదు. నిందించరాదు. అది శ్రీరామాయణం మనకు నేర్పే పాఠం.

5.లోకంలో మహానుభావులుంటారు. పతివ్రతలుంటారు. వారి అంతఃకరణాలు పరిశుద్ధాలు. మాలిన్యాలు అంటవు. దైవవశాత్తూ లోక హితార్థం వాళ్ళు అపచారాలు చేస్తే – తమకు తామే శిక్ష విధించుకుంటారు. కడిగిన ముత్యంలా బయట పడతారు. మలిన మనస్కులు, పాపకర్ములు, పరహింసాపరులు అపచారం చేస్తే ఇక్కడే ఈ జన్మలోనే ఫలితాన్ని అనుభవిస్తారు. లేదా జన్మాంతరంలో పాపఫలితాన్ని అనుభవిస్తారు. క్రిమికీటకాది జన్మలెత్తుతారు.

6.జటాయువు సీతమ్మకి రక్షణగా ఉంటానన్నాడు. సౌమిత్రి సీతమ్మని విడిచి వెళ్తూ – జటాయువుకి చెప్పవచ్చు. ఆశ్రమంలో సీతమ్మ ఒంటరిగా వుంటుంది. మేం వచ్చేవరకు కాపలా కాస్తూ ఉండని చెప్పలేకపోయాడు. అంటే అది దైవనిర్ణయం. సీతాపహరణం జరగాలి.

## యతి వేషం

సీతను విడిచిపెట్టాడు లక్ష్మణుడు. రాముని కోసం వెళ్ళాడు. ఆ అదను కోసం మాటు వేశాడు దశగ్రీవుడు. అవకాశం చిక్కింది. వెంటనే రూపం మార్చాడు. కాషాయవస్త్రం కప్పుకున్నాడు. తలవెంట్రుకలు జటలుగా మారాయి. కుడిచేత కమండలం పట్టాడు. ఎడమ భుజాన దండం వుంచాడు. ఛత్రం పట్టుకున్నాడు. పాదుకలు తొడిగాడు. ఆశ్రమం వైపు అడుగులు వేశాడు. చూశాడు సీతను. ఆ చూపు ఎలా ఉందంటే – చంద్రుణ్ణి విడిచిన రోహిణిని అంగారకుడు చూసినట్లుంది.

దశాననుడు క్రూరకర్ముడు. ఉగ్రతేజుడు. చూశాయి చెట్లు. ఆకులు అల్లాడలేదు. గాలి వీచడం మానేసింది. గలగలా పారే గోదావరి భయపడింది. నిశ్శబ్దంగా ప్రవహించింది. శనిదేవుడు చిత్తా నక్షత్రాన్ని సమీపించినట్లు – వైదేహి దగ్గరకెళ్ళాడు రావణుడు. గడ్డి కప్పిన బావిలా – పుణ్యవేషంలోని మహాపాపిలా – పర్ణశాల ముందు నిల్చున్నాడు. నిశితంగా చూశాడు జానకిని. మన్మథ పరవశుడైనాడు. తమాయించుకున్నాడు. వేదమంత్రాలు వల్లిస్తున్నాడు.

దిగాలుగా వుంది మైథిలి. కన్నీరు కార్చుతోంది. రామలక్ష్మణుల కోసం ఎదురు చూస్తోంది. వాళ్ళు పోయిన దిక్కుకేసి చూస్తోంది. ఆమె అందచందాలు పొగిడాడు రావణుడు. అవి 17 శ్లోకాలు. తర్వాత ఒంటరిగా ఉన్నావు. ఎవరు నీవు? నీ పేరేమిటి? – వివరాలడిగాడు.

వచ్చినవాడు బ్రాహ్మణుడనుకుంది. ఉపేక్షించరాదనుకుంది. అతిథి కదా అనుకుంది. సాధువు కదా అనుకుంది. ఆతిథ్యానికి ఆహ్వానించింది. లేకపోతే



శపిస్తాడనుకుంది. అర్ఘ్యమిచ్చింది. పాద్యమిచ్చింది. వన్యఫలాలున్నాయి అంది. క్షణకాలం ఆలోచించింది. అతడు అడిగిన దానికి సమాధానమిస్తోంది.

జనక మహారాజు కుమార్తెను. రాముని భార్యను సీతని – అంటూ వనవాస కారణం తెల్పింది. అవి 30 శ్లోకాలు. అందులో చెప్పకోదగ్గది రామునికి 25 సంవత్సరాలు. సీతకు 18 సంవత్సరాలు – వయస్సు పేర్కొనబడింది. తర్వాత అతని వివరాలు అడిగింది. చెబుతున్నాడతడు.

''నా పేరు రావణుడు. రాక్షసరాజుని. లంక నా రాజధాని. నిన్ను చూశాను. ఇష్టపడ్డాను. నన్ను భర్తగా స్వీకరించు. పట్టపురాణి అవుతావు. వేలమంది దాసీలున్నారు. నీకు సేవలు చేస్తారు. సీతా రావణ సంభాషణం అద్భుతంగా వర్ణించాడు వాల్మీకి. అవి 17 శ్లోకాలు.

రావణుని కోరికను సీత తిరస్కరించింది. ''రావణా! సూర్యకాంతిని పట్టుకోలేవు. అలా నన్ను తాకలేవు. నా రాముడు సింహం. నీవు నక్కవి. నా రాముడు సముద్రం. నీవు పిల్లకాల్వవి. బంగారానికి సీసానికి ఎంత తేడానో – గంధానికి బురదకి ఎంత తేడానో – మదపుటేనుగుకు అడవిపిల్లికి ఎంత అంతరమో – గరుత్మంతునికి కాకికి ఎంత అంతరమో – నెమలికి నీరు కాకికి ఎంత తేడానో – ఆ దశరథ రామునికి నీకూ అంతే తేడా'' – అలా సీతమ్మ చెప్పిందే కానీ గాలికి అరటి చెట్టులా కంపించిపోయింది. గజగజ వణికింది.

రావణాసురుడికి కోపం వచ్చింది. కనుబొమలు ముడిపడ్డాయి. తన గొప్పతనం చెప్పాడు. తన పరాక్రమం చెప్పాడు. తన దుష్కృత్యాలు చెప్పాడు. ''దేవేంద్రుడు భయపడతాడు నాకు. దేవతలు పారిపోతారు. గాలి వీచడానికి వాయువు భయపడతాడు. సూర్యుడూ అంతే. శీతకిరణాలు ప్రసరిస్తాడు. నా లంకా పట్టణం బంగారుమయం. మేడలు వైదూర్యమయం. నా రాజ్యంలో ఋతుభేదం లేదు. సర్వకాలాల్లో పూలుంటాయి. పండ్లుంటాయి. సీతా! నీవు రాజపుత్రివి. రాజ్యం లేనివాడు రాముడు. అడవుల పాలైనాడు. కలలో కూడా రాముణ్ణి తలచకు. వాడొక తాపసి. వాడితో సుఖపడలేవు. యుద్ధంలో రాముడు ఎంత? నా వేలికి చాలడు. ఆ మానవుణ్ణి రాముణ్ణి తిరస్కరించు. నన్ను అనుభవించు''.

వినింది వైదేహి. కోపం వచ్చింది. కన్నులు ఎర్రబడ్డాయి. ''రాక్షసుడా! గొప్ప వంశమని చెప్పుకున్నావు. ఇలా నీచంగా కోరుతావా? నీవు క్రూరుడవు. ఇంద్రియ లోలుడవు. నీకు దుర్బుద్ధి పుట్టింది. నాశనమై పోతావు. నీవే కాదు. నీ వాళ్ళందరూ నాశనమవుతారు. దేవేంద్రుని భార్య శచీదేవి. ఆమెని కోరి బతికితే బతకవచ్చు. నేను రాముని భార్యను. అవమానించినా అపహరించినా బతకడం ఉత్తది. ఒకవేళ నీవు అమృతం తాగినా బతకవు''.

## సీతాపహరణం

విన్నాడు రావణుడు. తన ప్రతాపం ప్రదర్శించాడు. భిక్షుక రూపం పోయింది. మహాకాయుడైనాడు. అది కొండంత రూపం. అగ్నికణాల్లా నేత్రాలు. నీలమేఘ చ్ఛాయ దేహం. తప్తకాంచన కుండలాలు. రక్తవర్ణ వస్త్రాలు. ధనుర్బాణాలు. పది తలలు. ఇరవై చేతులు. భయంకరంగా ఉన్నాడు. చూశాడు సీతను.

''సీతా! నీకు నా బలం తెలియదు. నా శౌర్యం తెలియదు. నా పరాక్రమం తెలియదు. ఆకాశంలో నిల్చుంటాను. భూమిని ఎత్తి పారేస్తాను. సముద్ర జలాల్ని ఇట్టే తాగేస్తాను. యుద్ధంలో మృత్యువునే చంపేస్తాను. సూర్యుణ్ణి అడ్డుకుంటాను. నా మాట విను. నీవు కోరింది ఇస్తాను. రాముణ్ణి విడిచిపెట్టు. వాడు రాజ్యభ్రష్టుడు. రాజు కాలేడు. అల్పాయుష్కుడు'' అన్నాడు.

కామ మోహితుడైనాడు. సమీపించాడు సీతను. పట్టుకున్నాడు. అది – ఆకాశంలో బుధుడు రోహిణిని పట్టుకున్నట్లు ఉందన్నాడు వాల్మీకి. పరివ్రాజక వేషంలో వచ్చాడు. భిక్షకి వచ్చాడు అనుకుంది మైథిలి. సన్యాసి కదా అనుకుంది. సత్కరించింది. అతడామెని సమ్మానించాలి. సంతోషపరచాలి. అందుకు విరుద్ధంగా ప్రవర్తించాడు రాక్షసరాజు.

**వామేన సీతాం పద్మాక్షీం మూర్ధజేషు కరేణసః ।**
**ఊర్వోస్తు దక్షిణేనైవ పరిజగ్రాహ పాణినా ॥**

ఎడమ చేత సీతమ్మ జుట్టు పట్టాడు. తొడల్ని కుడిచేత పట్టాడు. రెండు చేతులతో ఎత్తాడు. అంతలో కనపడని రథం ప్రత్యక్షమైంది. కంచర గాడిదలు పూన్చిన రథం బంగారు చక్రాల రథం.

'రామా రామా' కేకలు వేసింది సీతమ్మ. భయపెట్టాడు రావణుడు. రథమెక్కాడు. ఆమెను ఒడిలో కూర్చోబెట్టుకున్నాడు. తాచుపాములా మెలికలు తిరిగింది మైథిలి. పెనుగులాడింది. రథోపరిభాగాన పడింది. గట్టిగా పట్టుకున్నాడు. రథం కదిలింది. గాల్లోకి ఎగిరింది.

రోహిణి చంద్రుని భార్య. చంద్రుని కొడుకు బుధుడు. రోహిణి బుధునికి తల్లితో సమానం. బుధుడు రోహిణిని పట్టాడు అంటే – సీత జగన్మాత. తల్లిని పట్టుకున్నాడు రావణుడు. అదొక దుశ్చర్య అని వాల్మీకి అభిప్రాయం.

ఈనాడు కొందరు కొడుకులున్నారు. తల్లితండ్రుల సంపాదన మీద బతుకుతూ ఉంటారు. తాగుబోతులై



తిరుగుతూ ఉంటారు. డబ్బుకోసం అమ్మానాన్నల్ని పీడిస్తూ ఉంటారు. తన్ని తరిమేస్తారు కూడా. కామాతురాణాం న భయం న లజ్జా. కామునికి భయం ఉండదు. సిగ్గు ఉండదు. జన్మనిచ్చిన తల్లిపై – సోదరిపై అత్యాచారం చేస్తారు కూడా.

1. సీతను తాకితే కాలిపోతాడు రావణుడు. అందుకని భూమితోసహా పెళ్ళగించాడు. జానకిని ఎత్తుకుపోయాడు. అది ఒక కథనం. ఆ మాట శ్రీరామాయణంలో లేదు. వాల్మీకి చెప్పలేదు.
2. పుంజకస్థల ఒక అప్సరస. బ్రహ్మదేవుని దగ్గరకు వెడుతోంది. చూశాడు రావణుడు. ఆమెని పట్టుకున్నాడు. వివస్త్రని చేశాడు. బలాత్కారంగా రమించాడు. వెళ్ళిపోయాడు. బ్రహ్మకి జరిగింది చెప్పిందామె. ఇష్టపడని స్త్రీని బలవంతంగా అనుభవిస్తే – తల నూరు ముక్కలై చస్తాడు. అది రావణునికి చతుర్ముఖ బ్రహ్మ ఇచ్చిన శాపం. అది గుర్తువుంది రావణునికి. ఆ విషయం యుద్ధకాండలో వస్తుంది. మహాపార్శ్వునికి స్వయంగా చెబుతాడు రావణుడు.
3. సతాపహరణ సమయంలో – రావణునికి కామవాంఛ లేదు. సీతని అనుభవించాలనే కోరికా లేదు. రాముడు ఎక్కడ వస్తాడో, అడ్డుకుంటాడో, చంపేస్తాడో అని భయం. త్వరగా లంక చేరాలని ఆరాటం. అందుకే శాపం ఫలించలేదు.
4. రావణుడు తపోబల సంపన్నుడు. సీతను తాకాడు. కాలిపోలేదు. తపశ్శక్తి వాడికి రక్ష – అంటాడు హనుమంతుడు వానర వీరులతో.
5. పురుష వేషంలోని ఆడదానివా – హేళన చేసింది రాముణ్ణి సీతమ్మ. నానా దుర్భాషలాడింది లక్ష్మణుణ్ణి. రాముడు భగవంతుడు. తనని నిందించినా సహిస్తాడు. లక్ష్మణుడు భాగవతుడు. భాగవతుల జోలికి పోతే సహించడు భగవంతుడు. వెంటనే రావణుని రాక – అపహరణ, భర్తతో ఏడాదిపాటు ఎడబాటు. అది భాగవత నిందకు ఫలితం. హిరణ్యకశిపుడు నిందించాడు నారాయణుణ్ణి. స్పందించలేదు. బాలభక్తుడు ప్రహ్లాదుని జోలికి పోయాడు. ఫలితం – స్తంభోద్భవుడైనాడు శ్రీహరి. ఉగ్రనారసింహుడైనాడు. హిరణ్యకశిపుని దారుణంగా సంహరించాడు. ఏతావాతా తేలిందేమిటి – భగవంతుడి కన్నా భాగవతుడు మిన్న.

అయితే ఇపుడు దైవనింద చేసేవాళ్ళు ఎక్కువైనారు. భాగవతుల్ని తూలనాడేవాళ్ళు, హింసించేవాళ్ళు కోకొల్లలు. మరి వాళ్ళు సుఖంగా ఉన్నారు. అంటే వారి సుకృతఫలం ఇంకా వుంది. అది అడ్డుపడుతోంది. ఆ ఫలం తీరిపోయాక – ఈ జన్మలో కాని – జన్మాంతరంలో కాని శిక్ష అనుభవించక తప్పదు. అలాగే రావణునికి సుకృతఫలం రక్షణగా నిలిచింది. తర్వాత పాపఫలం అనుభవించాడు. చచ్చాడు.

మహావేగంగా పోతోంది రథం. తన్ను తాను తెలియని దానిలా ఉంది సీత. పిచ్చిదానిలా అరుస్తోంది. రామా! లక్ష్మణా! అంటోంది. 'ఈ రాక్షసుడు నన్ను అపహరించాడు. మీకు ఎలా చెప్పాలి?' – అంటోంది. రోదిస్తోంది. రావణునితో ఇలా పలుకుతోంది.

(సశేషం)

# ఓర్పు కలిగియున్న ఒనగూడు విజయాలు

- డా॥ కూర్మాచలం శంకరస్వామి

**మనిషికుండవలయు మదినింత ఓరిమి**
**పెంపు సేయు నదియు పెద్దతనము**
**ఓర్పు కలిగియున్న ఒనగూడు విజయాలు**
**శంకరునిది పలుకు శంక వలదు**

ఓర్పు మానవులకు గొప్ప అలంకారము. ఓర్మి కలిగియున్న చోట కూర్మి పెరుగుతుంది. కూర్మి యున్నచోటే సుఖశాంతులు ఉంటాయి. ఓర్పు లేని ఇంట కోపతాపాలు తాండవిస్తాయి. ''సహనమొక్కటబ్బ చాలు కష్టంబురా''. సహనమున్న చోట సౌఖ్యముండు అన్నారు పెద్దలు. ప్రతి చిన్నదానికి సహనాన్ని కోల్పోతారు చాలామంది. ఇలాంటి తత్వము ఎవరికీ మంచిది కాదు.

చేసే పనిలో చిన్న అపజయం కలిగిన అసహనం కోల్పోవడం అవివేకమే. అన్ని కాలాలు మనకు అనుకూలంగా ఉండవు. అవకాశము చిక్కినప్పుడే కాస్త ఓర్పు వహించి అంది పుచ్చుకోవాలి.

గెలిచి తీరాలన్న కోరిక గుండెల్లో నిరంతరం కదలాడుతుండడమే ఆశావాదానికి ఆయువు పట్టు. సర్వస్వాన్ని కోల్పోయినా రేపన్నది ఒకటి ఉందన్న ఆశతో మనిషి జీవించాలని వేదవాక్కు. కలిసి ఉందాం. కలిసి భుజిద్దాం. కలిసి పనిచేసి శక్తిని, ధైర్యాన్ని సృష్టిద్దాం. కలిసి ధ్యానం చేసి తేజస్సును సృష్టించుకుందాం. ఓర్పును నేర్పును పెంపొందించుకుందాం. వీటిద్వారా అందరం శాంతి పొందుదాం అని సమిష్టితత్వాన్ని బోధించింది వేదం. జీవం తొణికిసలాడుతూ నిండు నూరేళ్ళూ జీవిద్దాం. మనసు విప్పి మాట్లాడుతూ ఉందాం. పెద్దలు చెప్పే విషయాలు శ్రద్ధగా విందాం అని మరో వేదవచనం ప్రకారం ఇవన్నీ జరగాలంటే ఓర్పు అనే ఆభరణం మనుషులకు తప్పనిసరిగా ఉండాలి.

సానుకూల ధోరణి మనిషిని విజయ తీరాలకు చేరుస్తుందని సాహిత్యంలో ఎన్నో దృష్టాంతాలున్నాయి. వ్యక్తీకరణ ప్రపంచంలోకి అడుగుపెట్టిన పసిపాపకు ఎవ్వరూ పరిచయం ఉండరు. అయినా తన బోసి నవ్వులతో తనంత తానే అలవోకగా పలకరించి అందరినీ ఆకట్టుకుంటుంది. అందరినీ పరవశింపచేస్తుంది. అదే తొలి పరిచయంగా పరిణమిస్తుంది. ఆ చిరునవ్వే స్నేహానికి బీజమవుతుంది. పసిపాపకు ఉన్నంత ఓర్పు, చనువు చాలదా మనసుల మధ్య మాసిపోని బంధం ఏర్పడటానికి. ఆ మాత్రం త్యాగం చేయలేమా? బుద్ధిజీవిగా పుట్టిన మనం?

అలవాటుగా గిరవాటు వేసిన గింజ నిస్తేజం, నిరాశలకు గురికాదు. మట్టి, గాలి, తేమ, వెలుగులతో చెలిమి చేసి మొలకగా రూపు దాల్చుతుంది. ఆ మొక్కయే మొక్కై పుష్పించి, ఫలించి మరిన్ని వృక్షాల సృష్టికి దోహదం చేసి ఒక అడవికే ప్రాణం పోస్తుంది. అందాలను చిందిస్తుంది. ఆరోగ్యం, ఐశ్వర్యం, పర్యావరణ సమతౌల్యం పంచుతుంది.

అలాగే ఆశావాది ఓర్పుతో ప్రతి అవకాశాన్ని బంగారు భవితకు మార్గంగా చేసుకోవాలి. ఆ ఆశయంతోనే మరింత మందికి స్ఫూర్తి కలిగించాలని ఎదురీదే చేతులుంటే ఏరు దారివ్వక ఏం చేస్తుంది? పయనించే అడుగులుంటే బాట చేతులెత్తక ఏం చేస్తుంది? అని అంటాడు ఓ మహాకవి. మనసు చేసే అతి ముఖ్యమైన పని ఆలోచన. అది లేని మనసు ఆలోచన రాని మనిషి ఉండడు. ఆలోచన సముద్ర తరంగంలా నిరంతర ప్రక్రియ. అది ఎంత గొప్పదంటే ఒక ఆలోచన భవిష్యత్తును నిర్దేశిస్తుంది. భవితను మార్చగలదు. చరిత్రగతిని తలకిందులు చేయగలదు. అంత శక్తిగల ఆలోచనలు ఉన్నతంగా ఉండాలంటే భూదేవికి ఉన్నంత ఓర్పు మనిషికి ఉండాలి. అది ప్రతి ఒక్కరూ ఆశాకిరణంలా వెలిగే ఉత్సాహాన్ని పెంచుతుంది.

నేను నీకు ఆసరాగా ఉన్నానని నోటితో చెప్పనక్కరలేదు. ఒక అనురాగ స్పర్శ, ఒక ఆత్మీయ పలకరింపు, ఒక చల్లని చూపు మీరు తమ పట్ల శ్రద్ధ వహిస్తున్నట్లు తెలుపుతాయి. ఆ భావ వ్యక్తీకరణే ఎదుటివారికి ఒక భరోసానిచ్చి జీవితంలో ఒక కొత్త మార్పును తెస్తుంది. ఆత్మీయుల్ని పెంచుతుంది.

''ఎంత దున్నినా మట్టి ఎప్పుడైనా కలత చెందిందా? ఎంత ఉరికినా ఏటికి నలత ఉన్నదా? ఎంత ఎగిసినా నింగికి ఎప్పుడైనా కొరత ఉన్నదా? ఎంత పీల్చినా గాలికి ఎప్పుడైనా కోత ఉన్నదా? అన్న సినారె మాటలు ఆశావహ దృక్పథానికి ఖచ్చితమైన ఉదాహరణలు. చిక్కని చీకటిలో మిణుగురు

వెలుతురు చిమ్మచీకటిలో తళుక్కుమనే మెరుపురేఖ యొక్క ప్రవాహపు వడిలో గడ్డిపోచ ఆసరా నిరాశ నిండిన జీవితంలో చిన్న ఆత్మీయ పలకరింపు, ఓటమిలో చిన్న ఓదార్పు ఇవన్నీ మానసికంగా శక్తినీ, ఉత్సాహాన్ని, స్ఫూర్తిని, ధైర్యాన్ని కలిగిస్తాయి. విజయం సాధించాలంటే కేవలం కోరిక ఉంటే సరిపోదు. దాన్ని సాధించడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయాలో గుర్తించి సత్వర కార్యాచరణకు సన్నద్ధం కావాలి. దానికి సహనం ఎంతో అవసరం. సహనం లేనిచోట ఏ కార్యాలూ నెరవేరవు. ఎవరి ఆశలు తీరవు.

కూరిమి పెంచే ఓరిమి గురించి మన పురాణాలలో ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా పంచమ వేదమైన భారతంలో పాండవుల ఓర్పు అనితర సాధ్యం. చిన్నతనం నుండి పాండవులను కౌరవులు ఎన్నో కష్టాలకు గురి చేశారు. దుర్యోధనుడు భీముణ్ణి ఎన్నోసార్లు చంపడానికి ప్రయత్నించాడు. అంతేగాక లక్క యింటిలో పాండవులను కాల్చి బూడిద చేయాలనుకున్నాడు. మాయా జూదంలో పాండవులను ఓడించి వారి రాజ్యాన్ని ఆక్రమించాడు. నిండుసభలో ద్రౌపదిని వివస్త్ర చేయబోయి అవమానించాడు. పన్నెండేండ్లు వనవాసంలో వారిని మనశ్శాంతిగా ఉండనివ్వలేదు. అన్న వరుస అయిన జయద్రథుడు ఒంటరిగా ఉన్న ద్రౌపదిని అవమానించినా పాండవులు ఎంతో ఓర్పు వహించారు తప్ప ఏనాడూ తొందర పడలేదు. నిరాశకు గురికాలేదు. చివరికి కురుక్షేత్ర యుద్ధంలో విజమయం సాధించారు. దీనిని బట్టి ''ఓర్పు కలిగియున్న ఒనగూడు విజయాలు'' అన్న పెద్దల మాట పరమ సత్యమని తెలుస్తోంది.

# రచనలకు శ్రీ వేంకటేశం  ఆహ్వానం

'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

## రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



# వట సావిత్రీ వ్రతం

– డా.మరుదాడు అహల్యాదేవి

(17-06-2023 వట సావిత్రీ వ్రతం)



**వివాహిత స్త్రీలు వటసావిత్రీవ్రతం చేయడం మంచిది. ఏ స్త్రీకైనా జాతకరీత్యా వైధవ్యం లేక కుజదోషం వున్నా ఈ వ్రతం తప్పక చేయాలి. సావిత్రీ వ్రత ప్రభావం వల్ల ముత్తయిదువుల సౌభాగ్యం అక్షయ మవుతుంది. వారికి వైధవ్య దుఃఖం నుండి విముక్తి లభించి, మంచి సంతానం కలుగుతుంది. వారి కుటుంబం సుఖ సంతోషాలతో వర్ధిల్లుతుంది.**

ముత్తయిదువులు తమ భర్తల దీర్ఘాయువు కొరకు వటసావిత్రీ వ్రతం చేస్తారు. వటసావిత్రీవ్రతం అమావాస్య నాడు చేయడం లోక విధానం. భవిష్యత్ పురాణం నిర్ణయ సింధులో వటసావిత్రీవ్రతం (వటవృక్ష పూజ) జ్యేష్ఠమాసం అమావాస్యనాడు ఆచరించాలని ఉంది. కుజదోష పీడిత కన్యలు త్వరగా వివాహం జరగడానికి, కలకాలం దాంపత్య సుఖానికి వటసావిత్రీవ్రతం పూజ చేయడం శుభప్రదం.

### వట సావిత్రీ వ్రత విధానం

వ్రతం చేయదలచిన మహిళలు తెల్లవారు జామున లేచి స్నానం చేసి వటసావిత్రీ వ్రతం సంకల్పన చేయాలి. ఉపవాసం ఉండాలి. పరగడుపున (ఏమీ తినకూడదు) వ్రతం ఆచరించాలి. పూజలో నైవేద్యం కోసం హల్వా, పూరీలు, పిండితో చేసిన మాల కావాలి. ఒక శుభ్రమైన పళ్ళెంలో పూజకు కావలసిన సామగ్రి, బియ్యం, కుంకుమ, నేతిదీపం, బెల్లం లేదా పటికబెల్లం, ఇంట్లో తయారు చేసిన భోజనం, పసుపు, పారాణి, పువ్వులు, ధూపం, నానబెట్టిన శనగలు, తడిపిన దారం పట్టుకుని ఏదైనా గుడిలో ఉన్న రావిచెట్టు (వటవృక్షం) దగ్గరకు వెళ్ళాలి. వటవృక్ష మూలంలో బ్రహ్మ, మధ్య విష్ణువు, చివర శివుడు, వృక్షం అంగాలలో సావిత్రీదేవి, ఉంటారు. వటవృక్షం కింద మట్టితో చేసిన సావిత్రి, సత్యవంతుడు, ఎద్దుపై ఉండే యమధర్మరాజు బొమ్మలు ఉంచి పూజ చేయాలి. ఆ బొమ్మలకు పూజ చేశాక ఒక చెంబుతో నీరు తీసుకుని వటవృక్ష వేళ్ళను నాలుగువైపులా తడపాలి. చెట్టుకు కుంకుమతో తిలకం దిద్దాలి. నేతి దీపం వెలిగించి పెట్టాలి. ఇప్పుడు దారానికి పసుపు రాసి వటవృక్షానికి మూడు లేక ఏడు సార్లు ప్రదక్షిణ చేస్తూ దారాన్ని రావిచెట్టుకు చుట్టాలి. వృక్షపు ఆకులతో మాల ధరించి, సావిత్రీ సత్యవంతుల కథ వినడం లేదా చదవడం గాని చేయాలి. ఆ తర్వాత నైవేద్యం సమర్పించాలి. దీనికి ముందు వెదురుబుట్టలో నానిన శనగలు, ప్రసాదం, పసుపు, కుంకుమ, వస్త్రం ఉంచి దక్షిణ పెట్టి అత్తగారికి వాయనం ఇచ్చి కాళ్ళకు నమస్కరించాలి.

### సావిత్రి కథ

భద్రదేశ రాజు అశ్వపతి. సంతానం కోసం సతీసమేతంగా సావిత్రి వ్రతాన్ని విధి విధానంగా చేసి, అటు అత్తగారింటికి, ఇటు పుటినింటికి ఖ్యాతిని, గౌరవాన్ని తెచ్చే కూతురు పుట్టాలని కోరుకున్నాడు. కొంత కాలానికి సావిత్రీదేవి అశ్వపతికి కూతురుగా పుట్టింది. శుక్లపక్ష చంద్రునిలా దినదినాభివృద్ధి చెందుతూ పెరిగి పెద్దది అయింది. సావిత్రికి యుక్తవయస్సు వచ్చింది. రాజు అశ్వపతి ఒకరోజు, తన కూతురు సావిత్రికి తగిన వరుడిని వెదకమని మంత్రికి చెప్పి పంపించాడు. అయితే సావిత్రి తన మనస్సుకు నచ్చిన వరుడిని నిర్ణయించుకుంది. దేవర్షి నారదుల వారు అశ్వపతిని చూడవచ్చాడు. నారదుడు సావిత్రిని ఉద్దేశించి ''నీ మనసు లోని మాట చెప్పు'' అన్నాడు. సావిత్రి ఇలా అంది. ''ద్యుమత్సేన మహారాజు కొడుకు సత్యవంతుని కీర్తి విని భర్తగా ఎంచుకొన్నాను''. ద్యుమత్సేన మహారాజు

రాజ్యం పోగొట్టుకొని అంధుడై భార్యతో అడవులలో తిరు గుతున్నాడు. నారదుడు సత్యవంతుని గుణగణాలను ప్రశంసించాడు. తర్వాత సావిత్రి, సత్యవంతుల గ్రహ, నక్షత్రాలను లెక్కించాడు. భవిష్యత్తులో సావిత్రికి పన్నెండేళ్ళ వయసులో సత్యవంతుడికి మరణం సంభవిస్తుందన్నాడు. వేరొక వరుడిని చూద్దామని అన్నాడు అశ్వపతి. కాని సావిత్రి తండ్రితో ఇలా అంది. నాన్నగారూ! నేను క్షత్రియ కన్యను. వంశాచారం ప్రకారం క్షత్రియ కన్య జీవితంలో ఒకేసారి భర్తను నిర్ణయించుకుంటుంది. సత్యవంతుడిని నా భర్తగా భావించాను. అతను అల్పాయుష్కుడైనా సరే నా నిర్ణయం మారదు. ఇంకొకరికి నా మనస్సులో భర్తగా స్థానం ఇవ్వలేను అన్నది.

కొంతకాలానికి సావిత్రీ సత్యవంతుల వివాహం జరిగింది. సావిత్రి మెట్టినింట భర్త, అత్త మామలతో కలిసి ఉంటోంది. కొంతకాలం జరిగిపోయింది. నారదుడు చెప్పిన సమయం వచ్చింది. దానికి మూడు రోజుల ముందు నుండీ సావిత్రి ఉపవాసం మొదలు పెట్టింది. ఆరోజు అత్తమామల దగ్గర అనుమతి పొంది సావిత్రి కట్టెలు కొట్టడానికి అడవికి బయలుదేరిన సత్యవంతునితో కలిసి వెళ్ళింది. అడవిలో సత్యవంతుడు తియ్యని పండ్లు కోసి కొన్ని తను తిని, మరికొన్ని సావిత్రికి ఇచ్చాడు. తర్వాత కట్టెల కోసం సత్యవంతుడు చెట్టెక్కాడు. కొద్దిసేపటికి అతనికి భయంకరమైన తలనొప్పి వచ్చింది. చెట్టు దిగాడు. సావిత్రి భర్తను, ఒక వటవృక్షం క్రింద పడుకోపెట్టుకుని వత్తసాగింది. సత్యవంతుని మరణభయం సావిత్రి మనసుని వణికించసాగింది. చూస్తుండగానే మృత్యుదేవత అయిన యమధర్మరాజు వచ్చి బ్రహ్మరాతను సావిత్రికి తెలిపి సత్యవంతుని ప్రాణాలు తీసుకెళ్ళిపోయాడు. సావిత్రి సత్యవంతుని పార్థివ శరీరాన్ని అక్కడే విడిచి యముని వెంట బయలుదేరింది. తన వెనకే వస్తున్న సావిత్రిని యమధర్మరాజు చూసి, తిరిగి వెళ్ళమని ఆదేశించాడు. అప్పుడు సావిత్రి ఇలా అంది. ‘‘యమధర్మరాజా! భార్య యొక్క సతీత్వం సార్థకత ఛాయలాగా భర్త చరణాలను అనుసరించడంలో ఉంది. ఇది ధర్మం, మర్యాద. మీవంటి ధర్మరాజులు దీనికి వ్యతిరేకంగా చెప్పడం భావ్యం కాదు. పతిలేని సతి జీవితానికి సార్థకత లేదు. నా భర్త ప్రాణాలు తిరిగి ఇవ్వమని ప్రార్థిస్తున్నాను.

పతివ్రత అయిన సావిత్రి ధర్మనిష్ఠ చూసి సంతోషించిన యమధర్మరాజు ఏదైనా వరం ఇవ్వదలిచాడు. పతి ప్రాణాలు తప్ప ఏదైనా వరం కోరుకో అని సావిత్రితో అన్నాడు. . ‘‘నా అత్త మామలకు చూపు రావాలి. వారికి దీర్ఘాయువు, సామ్రాజ్యం ప్రసాదించు స్వామీ’’ అని సావిత్రి కోరింది. యముడు ‘తథాస్తు’ అని ముందుకు సాగాడు. సావిత్రి ఆయన్ను అనుసరించింది. కొంతదూరం వెళ్ళాక వెనక్కి తిరిగి చూశాడు యముడు. సావిత్రి తన వెనకే వస్తూ కనిపించింది. సావిత్రిని తిరిగి వెళ్ళమని ఆదేశించాడు. సావిత్రి ఇలా అంది. ధర్మరాజా! భర్తలేని జీవితానికి సార్థకత దక్కదు. భార్యాభర్తలం వేరు వేరు మార్గాల్లో ఎలా వెళ్ళగలం? భర్త ఏ మార్గంలో వెళ్తాడో నాకూ అదే మార్గం అనుసరణీయం అన్నది.

సావిత్రి పతివ్రతా లక్షణం చూసి యమధర్మరాజు ఇంకొక వరం ఇవ్వాలనుకున్నాడు. వరం కోరుకో అన్నాడు. తన మామగారు రాజ్యాన్ని తిరిగి పొందాలని సావిత్రి కోరింది. ‘తథాస్తు’ అని యమధర్మరాజు ముందుకెళ్ళాడు. అయినా సావిత్రి యమధర్మరాజు వెంటే వెళుతోంది. ఆమెని ఎలాగైనా అక్కడితో నిలుపు చేయాలనుకున్న యముడు మూడోవరం ఇస్తున్నాను కోరుకో. దీంతో వెనక్కి తిరిగి వెళ్ళు అన్నాడు. ‘నూరుగురు కొడుకులకు తల్లిని కావాలి’ అని సావిత్రి కోరింది. ‘తథాస్తు’ . ఇక నా వెంట రాకు. వెనక్కి తిరిగి వెళ్ళు అంటూ యముడు ముందుకు కదలబోయాడు.

యమధర్మరాజా! నాకు నూరుగురు కుమారులు కలుగుతారని వరమిచ్చావు. భర్త లేకుండా నేను తల్లిని ఎలా అవుతాను? భర్త లేకుండా సంతానవతిని ఎలా కాగలను? అని సావిత్రి ప్రశ్నించింది. ఆమె మూడో వరంలోని అంతరార్థాన్ని యమధర్మరాజు గ్రహించాడు. సావిత్రిలోని ధర్మనిష్ఠ, జ్ఞానం, వివేకం, పతివ్రతా లక్షణాలు యమధర్మరాజు మనస్సుని కరిగించాయి. సత్యవంతుని ప్రాణాలను తన పాశం నుండి విడిచిపెట్టాడు. వినయంతో సావిత్రి, యమధర్మరాజుకి నమస్కరించింది. సావిత్రి సత్యవంతుని ప్రాణాలు తీసుకుని భర్త పార్థివ శరీరం ఉన్న వటవృక్షం దగ్గరకు వచ్చింది. వట వృక్షానికి నమస్కరించి ప్రదక్షిణ చేసింది. అదే సమయంలో సత్యవంతుడు ప్రాణాలతో లేచి కూర్చున్నాడు. సంతోషంగా సావిత్రి భర్తతో కలిసి అత్తమామల దగ్గరకు వెళ్ళింది. అత్త మామలకు చూపు వచ్చింది. సత్యవంతుడి తండ్రి ద్యుమత్సేనునికి రాజ్యం తిరిగి లభించింది. యమధర్మరాజు వరప్రభావంతో సావిత్రికి నూరుగురు కుమారులు కలిగారు. పతివ్రత అయిన సావిత్రి కీర్తి నలుదిశలా వ్యాపించింది.

హిందూ స్త్రీలు భక్తి శ్రద్ధలతో వటసావిత్రీ వ్రతం ఆచరించడం అనాదిగా వస్తోంది. ఈ వ్రతం ముత్తయిదువలకు, కుజదోష కన్యలకు అన్ని విధాల శ్రేయోదాయకం.

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

సేకరణ : కె.వి.రాఘవాచార్యులు

గత సంచిక తరువాయి

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**

## 204. జాంవబత్ప్రముఖావృతాయ నమః

రాముడు జాంబవంతుడు మున్నగు వారిచే పరివేష్ఠింపబడినాడు.

జాంబవంతుడు బ్రహ్మ పుత్రుడయిన భల్లూక రాజు. సుగ్రీవుని మంత్రి ఇతడు జంబూపథంలో మొదట ప్రవేశించినాడు గనుక జాంబవంతుడు అని పిలువబడినాడు. సీతాన్వేషణకు బయలుదేరిన హనుమదాది వానరులు, జాంబవంతుడు దక్షిణ సముద్ర తీరమును చేరినారు. హనుమంతుడు సముద్రమును దాటి లంకకు వెళ్ళుటకు సంశయించినప్పుడు అతని బలాన్ని వివరించి, అతనిని ప్రశంసించి హనుమ లంకను చేరుటకు, సముద్రమును లంఘించుటకు ప్రేరకుడయినాడు జాంబవంతుడు. ఇతడు విష్ణుదేవుని దశావతారములు చూచేంత వరకు జీవించాడు. జాంబవంతుడు ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడితో యుద్ధము చేసి తన కోరిక నెరవేర్చుకుని తన కుమార్తె జాంబవతిని కృష్ణునకిచ్చి వివాహం చేసినాడు. జాంబవతి కుమారుడే సాంబుడు. సప్తర్షుల శాపముచే సాంబుడు యాదవ వినాశనమునకు కారణమైన ముసలమును ప్రసవించినాడు.

రాముడు జాంబవంతుడు మొదలగు మహాపురుషులు, మహావీరులతో పరివేష్ఠింపబడి యున్నాడు. జాంబవంతాది ప్రముఖులచే పరివృతుడైన రామునిగ అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.


## 205. జానకీశాయ నమః

మిథిలాధిపతి జనక మహారాజు కుమార్తె యగు సీత భర్త రాముడు.

సీత పూర్వ జన్మమున వేదవతి. ఈమె కన్యగా ఉండి విష్ణువును పెండ్లాడగోరి తపస్సు చేయుచుండగా రావణుడు ఈమె తపస్సును భంగము చేసినాడు. వేదవతి అగ్నిప్రవేశము చేసి అయోనిజగా, సీతగా జన్మించింది. సీతాపతియైన రామునిగ అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 206. సురాధ్యక్షాయ నమః

దేవతలకు ప్రభువై, వారి బాగోగులను చూసి రక్షించువాడు విష్ణువు. శాస్త్ర వ్యవస్థను బట్టి ధర్మా ధర్మములకు సరియగు ఫలితము లభించవలసి యున్నది. ధర్మాధర్మముల నాచరించు మానవులకు నిస్పక్షపాతముగా దేవతలు ఫలితము ఈయవలసి యున్నది. సురలు అంటే దానశీలురు. సుష్ఠురాతి దదాతి–శ్రద్ధయా సూక్త్యాదాతి–సురః – సమృద్ధిగా, శ్రద్ధగా ప్రేమతో ఇచ్చువారు దేవతలు. జల, కాంతి, వాయువ్యాదులను ప్రసాదించే వరుణ, సూర్య, పవనాదులందరూ దానశీలురే. అందుకే వారు దేవతలు. సురలు. విష్ణుభూతి గలవారిలో దానశీల స్వభావము ఉంటుంది. దానవ్యవస్థను కొనసాగించే ప్రభువు – విష్ణువు సురాధ్యక్షుడు. దేవతల కర్మలపై కూడ పర్యవేక్షించు నట్టి అధికారము గలవాడు





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

భగవంతుడు. కనుక సురాధ్యక్షుడని పిలువబడుచున్నాడు.

సురాధ్యక్షుని యొక్క విష్ణువు యొక్క అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము. ఈ నామము విష్ణు సహస్ర నామములలో 136 సంఖ్యతో ఉన్నది.

## 207. సాకేతేశాయ నమః

– సూర్య వంశీయుల, ఇక్ష్వాకుల రాజధానియగు అయోధ్యకే సాకేతమను నామాంతరము కలదు. శ్రీరాముని జన్మస్థలం, రాజధాని అయోధ్య.

సాకేతము / అయోధ్య కోసల దేశపు రాజధాని సరయూ నదీ తీరమున వున్న నగరము సాకేతపురి / అయోధ్య.

అయోధ్యాపతి (సాకేతమునకు ప్రభువు) అయిన రామునిగ అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 208. పురాతనాయ నమః

సృష్టికి పూర్వమే ఉన్న శాశ్వతుడు. కాలాతీతుడు. సనాతనుడు. అందరి కంటే, అన్నిటి కంటే ముందున్నవాడు పురాతనుడైన భగవంతుడు. భగవంతుడు ప్రతి కల్పంలోను, సృష్ట్యాదిలోని అనాదిగా పూర్వకాలము నందు బ్రహ్మాదులకు సర్వ విద్యలను ఉపదేశించుచున్నాడు. కనుక భగవంతుడు పురాతనుడు అనబడుచున్నాడు. ఈ నామము విష్ణు సహస్ర నామములలో 500 సంఖ్యతో ఉన్నది. కాలేన అపరిచ్ఛిన్న త్వాత్ పురాతనః అని నివృత్పత్తి.

పురాతనుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునికి నమస్కారము.

యస్మాత్ జ్ఞాతం న పురాకించినైవ య ఆబభూవ భువనాని విశ్వా ॥ అని యజుర్వేద ఉవాచ.

సృష్టిలో ఉపాధుల కంటే ప్రాచీనుడై తాను సృజించి ఉపాధులకు తనే పోషకుడు, రక్షకుడు అయిన నారాయణుడు పురాతనుడు.

## 209. పుణ్య శ్లోకాయ నమః

పవిత్రమైన కీర్తి గలవాడు భగవంతుడు. అపకీర్తి లేనివాడని భావము.

దుష్టశిక్షణ, శిష్టరక్షణ కార్యములను భగవంతుడు చేయుచుండుటచే భగవంతుడు పవిత్రమైన కీర్తి గలవాడయినాడు.

పుణ్యశ్లోకుడయిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.


## 210. వేద వేద్యాయ నమః

భగవంతుడు వేదములచే తెలియదగినవాడు.

వేదవేద్యుడయిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

**వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే ।**
**వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాత్ రామాయణాత్మనా ॥**

వేదములచే తెలియదగిన పురుషోత్తముడు, విష్ణువు – దశరథుని పుత్రునిగా జన్మించినాడు. వేదము వాల్మీకి మహర్షి ద్వారా రామాయణముగా అవతరించింది.



# తల్లిదండ్రుల సేవ మాధవ సేవ

## అను పుండరీకుని చరితము

– చిల్లర సీతారామారావు

**శ్లో || "సర్వతీర్థమయీ మాతా సర్వదేవమయా పితా
మాతరం తస్మాత్ యత్నేన పూజయేత్"**

తల్లి సకల తీర్థ స్వరూపము. తండ్రి సకల దేవతా స్వరూపము. కావున తల్లితండ్రులకు అన్నివిధాలా సేవలను అందించాలి. వారిని పూజించాలి. ప్రదక్షిణలు చేసి నమస్కరించి వారి ఆశీర్వాదములు తీసుకోవాలి. భక్తిశ్రద్ధలతో తల్లితండ్రులను సేవించిన వారికి మాధవుడిని సేవించినంత ఫలము ప్రాప్తిస్తుంది. తల్లితండ్రులను సేవించడం, పూజనం, పతిసేవ, సమదృష్టి, మిత్రులకు ద్రోహమును తలపెట్టకుండుట అను వాటిని పంచ మహా యజ్ఞములు అని పేర్కొంటారు. వీటిలో విశిష్టమైనది తల్లితండ్రుల సేవ. తల్లితండ్రులను సేవించిన వారికి వేలకొలది యజ్ఞములు, వేలకొలది తీర్థములందు స్నానమాచరించినందువల్ల కలుగ ఫలము కంటే అధిక ఫలము లభిస్తుంది. తల్లితండ్రులకు ప్రదక్షిణలు చేసత్ సప్తద్వీపములతో కూడిన పృథ్విని చుట్టివచ్చినట్లవుతుందని పురాణోక్తి. తల్లితండ్రులకు ప్రదక్షిణలు గావించి విఘ్నేశ్వరుడు విఘ్నాధిపత్యమును సాధించుకున్నాడు. తల్లితండ్రులకు సేవలొనర్చిన ధర్మవ్యాధుడు దివ్యదృష్టి సంపన్నుడ, వేదవేత్త అయినాడు. కౌశికుడు ధర్మవ్యాధుడి బోధనల వలన జ్ఞానోదయమై తల్లితండ్రులకు సేవలు చేసి తన జీవితమును సార్థకము చేసుకున్నాడు. శ్రీరాముడు తండ్రి ఆజ్ఞ పాలించి ఆదర్శపురుషుడిగా నిలిచాడు. వృద్ధులు, అంధులు అయిన తల్లితండ్రులను కావడిలో కూర్చోబెట్టి, కావడిని మోసుకుంటూ వెళ్ళి పుణ్యక్షేత్రములను దర్శింపచేశాడు శ్రావణ కుమారుడు.

ప్రాతః కాలమున లేవగానే తల్లితండ్రులకు నమస్కరించాలి. పిదప పాదములకు నమస్కారము చేయాలి. మర్యాద పురుషోత్తముడైన శ్రీరాముడు నిద్రనుండి లేవగానే వెళ్ళి తల్లితండ్రుల పాదములకు నమస్కరించెడివాడని రామాయణము చెబుతున్నది. తల్లితండ్రులకు గాని, పెద్దలకు గాని ఒంటి చేతితో నమస్కరించరాదు. నమస్కారము చేయు పద్ధతిని మహాభారతము ఇలా చెప్పింది.

**శ్లో || "సవ్యేన సవ్యం సంగృహ్యా దక్షిణేన తుదక్షిణమ్ |
నకుర్యాదేక హస్తే న గురోః పాదాభివాదనమ్" ||**

తల్లి తండ్రి మున్నగు వారికి నమస్కరించేటప్పుడు కుడిచేతితో కుడిపాదాన్ని, ఎడమ చేతితో ఎడమ పాదాన్ని తాకుతూ నమస్కరించాలి. ఎప్పుడూ ఒక చేతితో నమస్కారము చేయకూడదు. తల్లితండ్రులకు నమస్కరిస్తూ ప్రదక్షిణలను చేయడం వలన ఆరుసార్లు భూప్రదక్షిణ, పదివేలసార్లు కాశీయాత్ర, వందలసార్లు సముద్ర స్నానముల వలన లభించు ఫలము కన్నా అధిక ఫలము ప్రాప్తిస్తుందని

శా స్త్రోక్తి. వృద్ధులకు, పెద్దలకు నమస్కారము చేయువారికి ఆయువు, విద్య, యశస్సు, బలము అను ఈ నాలుగు వృద్ధి నొందుతాయని మనుస్మృతి కారుదు పేర్కొన్నాడు.

శ్లో ॥ "అభివాదనశీలస్య నిత్యం వృద్ధోపసేవినః ।
చత్వారితస్య వర్ధంతే ఆయుర్విద్యా యశోబలమ్" ॥

తల్లి భూదేవి స్వరూపము. తండ్రి హిరణ్య గర్భ స్వరూపుడు. ఆచార్యుడు పరమాత్మ స్వరూపుడు కనుక వీరిని భక్తి శ్రద్ధలతో పూజించాలి. మాతృమూర్తిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే భూలోకము, తండ్రిని ఆరాధిస్తే అంతరిక్షము, ఆచార్యుని ఆరాధిస్తే బ్రహ్మలోకమును పొందుతారు.

తల్లితండ్రులు తమ బిడ్డలను పెంచడానికి, మంచి భవిష్యత్తును కల్పించడానికి అమితమైన కష్టాలు, పరిస్థితులు మున్నగు వాటిని అధిగమించాల్సి వస్తుంది. తొమ్మిది నెలలు గర్భమును మోసి, ప్రసవ వేదన అనుభవించి పుట్టిన బిడ్డకు పాలిచ్చి, పెంచి పెద్ద చేస్తుంది తల్లి. బిడ్డ సంరక్షణా భారమును స్వీకరించి, జాతక కర్మలు మున్నగు వాటిని నిర్వర్తించి, ఎదుగుదలకు, ఉన్నతమైన వ్యక్తిత్వ వికాసమునకు సర్వవిధముల సహాయపడుతాడు తండ్రి. ఇటువంటి తల్లితండ్రుల ఋణమును ఎన్ని జన్మలెత్తినను తీరదు. తల్లితండ్రులను కంటికి రెప్పలా కాపాడుకోవడం పుత్రుని బాధ్యత. తల్లితండ్రుల సేవయే మాధవసేవ. తల్లితండ్రుల సేవలొనర్చు వారికి భగవదనుగ్రహము కొరకు వేరే సాధనములు అవసరము లేదు. భగవంతుడే స్వయముగా వారిని అనుగ్రహిస్తాడు.

పూర్వకాలమున లోహదండము అను నగరముండెడిది. నిరంతరము విష్ణుభగవానుని ధ్యానము చేసెడివాడు, సత్కర్మ నిరతుడు, సత్యవంతుడు దయాది సద్గుణ సంపన్నుడు, పాపరహితుడు అయిన జహ్నువు అను బ్రాహ్మణోత్తముడు ఆ నగరమునందు నివసించెడివాడు. అతని భార్య సాత్యకి. పతివ్రతా శిరోమణి. వారి గృహము సిరిసంపదలతో, అతిథులతో, బంధు మిత్రులతో కళకళ లాడుతూ ఉండేది. సంతాన లేమితో ఆ దంపతులు వ్యధ చెందుతుండేవారు. ఎన్నో నోములు, ఎన్నో వ్రతాలు ఆచరించారు. భగవత్కృప వలన వారికి వృద్ధాప్య దశయందు మగ సంతానము కలిగింది. ఆ శిశువుకు పుండరీకుడు అను నామకరణము చేసి అల్లారుముద్దుగా పెంచసాగారు. ఉపనయనము, వేదాధ్యయనము మున్నగునవి పూర్తికాగానే జహ్నువు చక్కని కన్యను చూచి పుండరీకునికి వివాహము జరిపించాడు. కొంతకాలము పుండరీకుని కాపురం సజావుగా ఆనందోత్సాహముల మధ్య సాగిపోయింది. కాలము ఎప్పుడూ ఒకే రీతిగా ఉండదు. పూర్వజన్మ కర్మల ఫలితముగా పుండరీకుని ప్రవర్తనలో మార్పు చోటు చేసుకుంది. దుష్టులతో స్నేహము అలవడింది. తల్లితండ్రులు అల్లము, పెళ్ళాము బెల్లము అన్న భావన ఏర్పడింది. ధనము విచ్చలవిడిగా లభిస్తుండటంతో జూదము, వేశ్యాగృహముల కేగడం మున్నగునవి అలవాటు అయ్యాయి. ధనము ఇవ్వనప్పుడు తల్లితండ్రులను నిందించడం, భార్యను అభినందించడం, సన్మార్గులను దూషించడం, దుర్మార్గులను భూషించడం, భోగభామినుల సేవ శ్రేయముగా నెంచడం, భాగవతుల సేవలను హేయముగా చూడటం, కొండెములు చెప్టం, పరుల యందు దోషముల నారోపించడం, తనను తాను ప్రశంసించుకొనడం, ధర్మకార్యములకు ఆటంకం కల్పించడం, అధర్మకార్యములను ప్రోత్సహించడం మున్నగునవి అతనికి నిత్యకృత్యములు అయినాయి. తనయుడు చెడు మార్గమున పయనించడం గమనించిన తల్లితండ్రులు అతనిని మందలించారు. కుమారా! నీవు చెడు మార్గమున పయనిస్తున్నావు. అది నీకు శ్రేయోదాయకము కాదు. దుష్టుల స్నేహము ఎప్పటికయినా ప్రమాదమే. వేశ్యలు ధనాశాపరులు. నీ దగ్గర ధనమున్నంత వరకు వారి దృష్టిలో నీవు రాకుమారుడవు. ధనాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు న గౌరవము శూన్యమవుతుంది. ఇప్పటికయినను నీ ప్రవర్తన మార్చుకొనుము. సత్శీలుడవు కమ్ము అన్నారు. పుండరీకుడు తల్లితండ్రుల హితబోధను పెడచెవిన పెట్టాడు. క్రోధముతో వారిని దూషించడం మొదలుపెట్టాడు. రామ, కృష్ణ అనుకుంటూ మీ బ్రతుకులు మీరు బ్రతకండి. మీకు నా విషయాలు అనవసరం. నా వ్యవహారములందు జోక్యము చేసుకోవద్దు. ఇంకా మీరు ఎందుకు బ్రతికి ఉన్నారో నాకు అర్థము గావడం లేదు. మీరు చస్తే గాని నాకు మనశ్శాంతి లభించదు. ఇంట్లో కనిపిస్తే చాలు ఊరికే హితబోధలు అని చీదరించుకున్నాడు. తనయుడి పరుష వాక్కులు హృదయమును గాయపరచగా మరణించడమే మేలని భావించారు. అంతలో కాశీకేగువారు కొందరు అక్కడికి వచ్చారు. కాశీకేగి అక్కడ దేహత్యాగము చేద్దామనుకొని వారితో కలిసి కాశీయాత్రకు బయలుదేరారు పుండరీకుని తల్లితండ్రులు.

ఒకనాటి సాయంత్రం ఒక పౌరాణికుడు కాశీ మాహాత్మ్యమును గురించి ప్రసంగిస్తున్నాడు. ఆ ప్రసంగమును వినడానికి భర్తతో కలిసి వెళ్ళింది పుండరీకుని పత్ని. పౌరాణికుడు కాశీ మహిమను వర్ణించసాగాడు. కాశి యను పేరు అతి పవిత్రమైన పుణ్యప్రదాయకమైన నామము.

కాశి యను రెండక్షరములు స్మరించినంత మాత్రముననే సమస్త పాపరాశి దగ్ధమవుతుంది. కాశి కైవల్యప్రదము. కాశి క్షేత్రము నందు మృతి నొందిన వారికి ముక్తి సులభముగా లభిస్తుంది. సంసార రోగగ్రస్తులైన, వారికి కాశీవాసం వినా, సంసార రోగశాంతిని కలిగించే దివ్యౌషధం మరొకటి లేదు. ఆనందదాయకమైనది, ఆనందరూపము కలిగినది అయిన కాశీని ఆనందవనము అని కూడా అంటారు. గంగ కంటె నుత్కృష్టమైన తీర్థము కాని, కాశి కంటే పవిత్రమగు క్షేత్రము కాని, విశ్వనాథుని కంటె నుత్తమమగు దైవము గాని లేవు. కాశీయందు మరణావస్థలో నున్న మానవులు విశ్వనాథుని తారకోపదేశము వలన సమస్త పాపముల నుండి విముక్తులై మోక్షసామ్రాజ్యము ననుభవించెదరు. కాశీనగరము నందలి గంగానదిలోస్నానమాచరించినవారికిఅంతశ్శుద్ధి,ఇంద్రియ నిగ్రహశక్తి కలుగుతాయి. విశ్వేశ్వరుని దర్శనము వలన మోక్షము, జ్ఞానము లభిస్తాయి. కాశీనగరము నందు చేయు హవనము, దానము, జపము, తపము, ధర్మకార్యములు స్వల్పమ నను అనంత ఫలములు అందిస్తాయి. కావున ప్రతి మానవుడు తప్పనిసరిగా జీవితములో నొకసారి యైననూ కాశీయాత్ర చేసి, కాశీవిశ్వనాథుని దర్శించుకొని జీవితమును సార్థకము చేసుకోవాలి. ప్రసంగము వినిన తరువాత కాశీక్షేత్రమును దర్శించాలన్న సంకల్పము కలిగింది పుండరీకునికి. వెంటనే రెండు అశ్వములు తెప్పించాడు. ఒక అశ్వము మీద తాను ఎక్కి, మరొక అశ్వము మీద భార్యను ఎక్కించి కాశీ యాత్రకు బయలుదేరాడు. పుండరీకుడు మార్గమధ్యమున తల్లితండ్రులను గమనించాడు. ఆ వృద్ధ దంపతులు నడవలేక, ఎండకు ఓర్వలేక, పరితపిస్తూ కాళ్ళు తడబడుచుండగా నెమ్మదిగా నడుచుకుంటూ పోతున్నారు. వారిని గమనించనట్లు అశ్వములను ముందుకు నడిపిస్తూ పుండరీకుడు కాశీకి సమీపమున నున్న కుక్కుట ముని ఆశ్రమమునకు చేరుకున్నారు.

కుక్కుటముని గొప్ప మహిమ కలవాడు. ఆయన మహిమను ఆదిశేషుడు కూడా వర్ణింపజాలడు. తల్లితండ్రులకు శుశ్రూష చేయడం, వారికి పురాణాలు చదివి వినిపించడం ఆయన నిత్యకృత్యము. తల్లితండ్రలను ప్రత్యక్ష దైవములుగా భావించి నిత్యము వారి సేవలయందే కాలము గడుపుచున్నందువల్ల నిద్రాహారములను పాటింపడు. పుండరీకుడు కుక్కుటమునికి నమస్కరించి ఇక్కడి నుండి కాశీ క్షేత్రము ఎంత దూరములో ఉంటుంది అని అడిగాడు. కాశీ క్షేత్రము ఉన్నదని గాని, ఎంత దూరములో ఉంటుందని గాని నాకు తెలియదు అని జవాబిచ్చాడు కుక్కుటముని. ముక్తిప్రదాయిని అయిన కాశీని గురించి తెలియని వారుండరు. నీకు కాశీ గురించి తెలియదా? ప్రతివారూ కాశీ గురించి తెలుసుకోవాలి. కాశీ గురించి తెలియని నీవు ఒక మునిగా ప్రజలను వంచిస్తున్నావు అని ఎగతాళిగా మాట్లాడుతూ ఆశ్రమం బయట ఉన్న చెట్టు క్రింద కూర్చున్నాడు. చలి మూలాన నిద్రపట్టక కళ్ళు తెరుచుకునే కూర్చున్నాడు.

తెల్లవారు ఝామున అయిదుగురు స్త్రీలు ఆశ్రమంలోకి రావడం చూచాడు పుండరీకుడు. వారు మలినమైన రూపాలతో, నల్లని మొహములతో చూడటానికి పిశాచాలుగా ఉన్నారు. పుండరీకుడు భయపడి అక్కడినుండి లేవలేదు. ఆశ్రమానికి వచ్చిన స్త్రీలు వాకిలి ఊడ్చి కల్లాపి చల్లి ముగ్గులు పెట్టారు. పిదప కుక్కుటముని గదిలోనికి వెళ్ళి ఆయనకు నమస్కరించి బయటకి వచ్చేసరికి వారి శరీరాలు అందంగా మెరుస్తూ ఉన్నాయి. వారి మొహాలు దివ్యతేజస్సుతో శోభిల్లుతున్నాయి. ఇది గమనించిన పుండరీకుడు వారిని సమీపించి పలకరించాడు. తల్లులారా! దివ్యతేజస్సుతో ప్రకాశిస్తున్న మీరు ఎవరు? మీరు ఇక్కడికి వచ్చేటప్పుడు వికృత రూపాలతో వచ్చారు. ఇప్పుడు దివ్యాంగనల వలె మారిపోయారు. దానికి కారణమేమిటి? అని అడిగాడు. గంగాదేవి యను స్త్రీ మాట్లాడుతూ – నీవు తల్లితండ్రులను కష్టపెట్టిన పాపాత్ముడవు. నీచుడవు. కుక్కుటముని దర్శన భాగ్యము వలన మమ్ములను చూడగలిగావు. మేము పుణ్యనదులము. మాయందు మానవాళి స్నానమాచరించినపుడు వారి పాపములను పరిహరిస్తాము. వారి పాపములు మాకు అంటుకొని వికృత రూపాలు ప్రాప్తిస్తుంటాయి. ఈ మలిన రూపములను తొలగించుకోవడానికి ఈ ఆశ్రమానికి వచ్చి సేవ చేస్తుంటాము. కుక్కుటముని అనుగ్రహమువలన తెల్లవారేసరికి మా రూపాలు మాకు వస్తాయి. తల్లితండ్రులను దేవతా మూర్తులుగా భావించి వారికి నిత్యము శుశ్రూషలు చేయడం వలన మా పాపములను కడిగివేసే శక్తి కుక్కుటమునికి లభించింది. జ్ఞప్తియందుంచుకొనుము. తల్లితండ్రులను కష్టపెట్టడం మహాఘోరము. ఇంతకన్నా మహాపాపము మరొకటి ఉండదు అని ఆ స్త్రీలు అక్కడినుండి అదృశ్యమయ్యారు.

గంగాదేవి బోధనలు అతడి కళ్ళు తెరిపించాయి. పుండరీకునకు తాను చేసిన తప్పు తెలిసి వచ్చింది. తల్లితండ్రుల పట్ల తన ప్రవర్తన గుర్తుకు వచ్చింది. తల్లితండ్రులు ప్రత్యక్ష దేవతలని, వారి సేవ కనాన

మించినది లేదని అర్థం చేసుకున్నాడు. వెంటనే బయలుదేరి తల్లితండ్రులను అన్వేషించాలని కుక్కుటమునికి నమస్కరించి బయలుదేరాడు. అన్వేషణలో తల్లితండ్రులు కనిపించగానే వారి పాదముల మీద పడి రోదిస్తూ తన తప్పిదములను మన్నించమని వేడుకున్నాడు. ఒక కావడిని తెచ్చి తల్లితండ్రులను అందులో కూర్చుండబెట్టి, కావడిని తన మూపున నుంచుకొని బయలుదేరి కాశీ క్షేత్రమునకు చేరుకున్నాడు. అక్కడ వారిని సేవించడం మొదలుపెట్టాడు. గంగానదికి తీసుకొని వెళ్ళి స్నానము చేయించెడివాడు. వివిధ రకాలైన పక్వాన్నాలతో తృప్తిగా భోజనం పెట్టేవాడు. విశ్వనాథుడు, విశాలాక్షిల దర్శనము చేయించెడివాడు. కొంతకాలము గడిచిపోయింది. తల్లితండ్రులను తీసుకొని పండరీపురమునకు చేరుకున్నాడు పుండరీకుడు. అక్కడ ఒక పర్ణకుటీరమును నిర్మించుకుని అందులో నివసించసాగారు. పుండరీకుడు తెల్లవారకముందే అడవికి పోయి హోమాది కార్యక్రమములకు కావలసిన దర్భలు, సమిధలు, ఫల పుష్పాదులను ప్రతినిత్యం తెచ్చి తండ్రికి వాటినందించేవాడు. తండ్రికి, తల్లికి మోక్షప్రాప్తికి కావలసిన సర్వసంభారాల్ని యథావిధిగా సమకూర్చేవాడు. తల్లితండ్రుల సేవా కార్యక్రమాన్ని వేళ తప్పకుండా నిర్విఘ్నంగా కొనసాగించెడివాడు. తండ్రిసేవతో పాటు విష్ణుసేవ కూడా ఎంతో నియమబద్ధంగా చేస్తుండేవాడు. పుండరీకుడు పూజలు చేసి, దీప ధూపాలతో అర్చించి ఆనందించెడివాడు. శంఖములో పోసిన తీర్థమును తల్లితండ్రులకు ఇచ్చెడివాడు. తల్లికి, తండ్రికి వివిధ రకాలైన పక్వాన్నాలతో తృప్తిగా భోజనం పెడుతూ ఉండేవాడు. పాదములను ఒత్తెడివాడు. విసనకర్రతో వీచెడివాడు. వారి పాదముల దగ్గరనే నిద్రించెడివాడు. నిరంతరం తండ్రి సేవలోనే గడపటం వలన విషయ వాంఛలన్నీ తొలగిపోయాయి. దేదీప్య జ్యోతిలాగా అతని హృదయ కమలం ప్రకాశించసాగింది.

పుండరీకునికి తల్లితండ్రుల పట్ల గల భక్తిభావమును పరీక్షించాలనుకున్నాడు శ్రీకృష్ణుడు. పుండరీకుని గృహము వాకిట నిలబడి పుండరీకా! విష్ణుభక్తితో పాటు మాతాపితరులకు నీవు గావిస్తున్న సేవలు చూసి ప్రసన్నుడనైనాను. నీకు వరము ప్రసాదిద్దామని వచ్చాను. త్వరగా రమ్ము అని శ్రీకృష్ణుడు పలికినాడు. దేవా! నేను తల్లితండ్రుల సేవలో నిమగ్నమైయున్నాను. వారు హాయిగా నిద్రించిన తరువాత వచ్చి దర్శనము చేసుకుంటాను. అప్పటివరకు అక్కడనే వేచి యుండుమని ప్రార్థించాడు పుండరీకుడు. తన ప్రక్కనే ఉన్న ఒక ఇటుకరాయిని శ్రీకృష్ణుని దగ్గర పడేటట్లు విసిరి దానిమీద నిలబడమని కోరాడు. విసిరిన ఇటుకరాయికి కూడా ఒక కథ ఉన్నదని చెబుతారు పెద్దలు. వృత్రుడు అను రక్కసుడు ఇంద్రుడిని సంహరించాలనుకున్నాడు. పాతాళ లోకమునకు వెళ్ళి తపస్సు చేయసాగాడు. ఆ సంగతిని తెలుసుకున్న ఇంద్రుడు పాతాళ లోకమునకు వెళ్ళి తన వజ్రాయుధముతో రక్కసుడి తలను నరికేశాడు. నేను తపస్సు చేసుకుంటున్న తరుణంలో నా తలను నరికావు. కాబట్టి నీవు ఇటుక రాయివై పడివుండుమని ఇంద్రుడిని శపించాడు వృత్రుడు. ఇంద్రుడు భయపడి విష్ణువును ప్రార్థించాడు. విష్ణువు – నేను పుండరీకుని గృహమున ఇటుకరాయివైన నీపైన నిలిచినప్పుడు నీకు శాపవిమోచనము కలగుతుందని అభయమిచ్చాడు. శ్రీకృష్ణుడు పుండరీకుడి కోరిక ప్రకారము ఇటుక రాయిపై నిలబడి తల్లితండ్రులకు పుండరీకుడు చేయు సేవలను గమనించసాగాడు. తల్లితండ్రులు హాయిగా నిద్రించిన తర్వాత పుండరీకుడు శ్రీకృష్ణుని దర్శించుకొని స్తుతించాడు. ''దేవా! నీవు వరమును ప్రసాదిస్తానన్నావు కాబట్టి కోరుకుంటున్నాను. నీవు విఠల్ అను ఇటుక రాయిపై నిల్చున్నావు. కావున విఠలమూర్తి యను నామముతో ఇచ్చటనే నివసించుము. నీ దర్శనము చేసుకొన్న భక్తుల మనోరథములను నెరవేర్చుము'' అని పలికాడు పుండరీకుడు. తథాస్తు అని పలికి శ్రీకృష్ణుడు అదృశ్యమైనాడు.

అత్యంత భక్తిభావనతో తల్లితండ్రులకు సేవలు చేసిన పుండరీకుని పేరుతో ఆ ప్రాంతము పుండరీకపురముతో పిలువబడింది. పుండరీకపురమే పండరీపురము అయింది. పండరీపురము నందు నివసించుటచే శ్రీకృష్ణుడు పండరీనాథుడు అయ్యాడు. విఠల్ అను పేరు కలిగిన ఇటుక మీద నిల్చున్నాడు కనుక విఠోబా యని, విఠలుడు అని నామములు ఏర్పడ్డాయి.

మహారాష్ట్రమున గల పుణ్యక్షేత్రములలో పండరీపురము ఒకటి. నిత్యం అనేకమంది భక్తులు పండరినాథుడి దర్శనం చేసుకుంటారు. పండరినాథుని స్మరించినంత మాత్రముననే సకల పాపములు నశించిపోతాయి. పండరినాథుడి దర్శించుకొన్న భక్తులుకు అమితమైన పుణ్యము కలుగుతుంది. ఐహికాముష్మిక సుఖములు చేకూరుతాయి. తల్లితండ్రులకు సేవలొనర్చిన పుణ్యఫలముగా భగవంతుడి అనుగ్రహాన్ని పొందిన పుండరీకుడు మహనీయుడు. నిత్యస్మరణీయుడు. భక్తిశ్రద్ధలతో తల్లితండ్రులకు సేవలు చేసి జీవితాలను ధన్యము చేసుకుందాం.



భగవంతుడెప్పుడూ భక్తుడికి దాసానుదాసుడు. భక్తుడి కోరిక నెరవేర్చడానికి ఏ పని చేయడానికైనా వెనుకాడడు. అందుకే భక్తుడి మాటను నిజం చేసేందుకు స్తంభం నుండి నరసింహావతారుడై ఉద్భవించి హిరణ్యకశిపుణ్ణి వధించి భక్తుడైన ప్రహ్లాదుణ్ణి అక్కున చేర్చుకున్నాడు. ద్వాపరంలో కృష్ణుడిగా అవతరించిన శ్రీమన్నారాయణుడు తను పరమాత్మననే విషయాన్ని మరచిపోయి స్నేహం కోసం సుదాముడి కాళ్ళు కడిగి ఆ పవిత్రజలాన్ని తనపై జల్లుకుని పిడికెడు అటుకులను స్వీకరించి అష్టైశ్వర్యములను అనుగ్రహించిన కరుణామూర్తి.

# భక్త కనకదాసు

– మందరపు
వి.జి.శంకరాచారి

ఇక ఈ కలియుగములో భక్తుడైన హాథీరాం బావాజీని రక్షించే ప్రయత్నంలో ఏనుగు రూపంలో వచ్చి బండెడు చెరుకు గడలను తిని తన భక్తుడి పేరుని లోక ప్రసిద్ధం చేసినవాడు శ్రీవేంకటేశ్వరుడు.

ఇలా ఏ యుగంలోనైనా ఎక్కడైనా ఎప్పుడైనా భక్తితో ఆరాధించే తన భక్తుని సందిటకు రావడానికి పరంధాముడు ఎదురు చూస్తూ ఉంటాడు. అటువంటి భక్తుడు తారసపడితే క్షణమాలోచించకుండా అతడి చెంతకు చేరుకుంటాడు. అంతేకాదు తన యొక్క దివను కూడా మార్చుకుంటాడు. ఈవిధంగా కర్ణాటక రాష్ట్రంలోని 'ఉడిపి' క్షేత్రంలో కొలువైయున్న కృష్ణపరమాత్మ భక్తుడైన కనకదాసు గురించి తన యొక్క దిశను మార్చుకున్న వైనం తెలుసుకుంటే అబ్బురమనిపిస్తుంది. పరమాత్మకు భక్తుల యెడల ప్రేమ ఎంతటిదో విశదమవవలెనంటే కనకదాసు గురించి తెలుసుకోవలసిందే. అటువంటి నిశ్చల భక్తుడైన కనకదాసు గురించి సంక్షిప్తంగా...

కనకదాసు కర్ణాటక రాష్ట్రంలోని హావేరీ జిల్లా 'బాద' గ్రామంలో 'కురుబగౌడ' దాస కుటుంబంలో బోర్ గౌడ, బీచమ్మ దంపతులకు క్రీ.శ. 1509 వ సంవత్సరంలో జన్మించాడు.

కనకదాసుకి చిన్నతనం నుండియే భగవంతుడిపై భక్తిభావం ఏర్పడింది. పది సంవత్సరముల వయసులో తన తోటి పిల్లవాండ్రతో ఆడుతూ యున్నా, బడిలో చదువుకుంటూ యున్నా, ఏ పని చేసినా ఇదంతా తనచేత పరమాత్మ చేయిస్తున్నాడు అనే భావనలో ఉండేవాడు. తల్లితండ్రులైన బోర్ గౌడ, బీచమ్మ దంపతులకు ఈ కనకదాసు శ్రీవేంకటేశ్వరస్వామి వరప్రసాదితమే. వారు శ్రీవేంకటేశుని అనునిత్యమూ పూజచేసేవారు. పరమభక్తులు. అందుకే స్వామివారు వారికి ఉత్తమ సంతానాన్ని అనుగ్రహించారు. ఆ దంపతులు తరచుగా తీర్థయాత్రలు చేసేవారు. వారితోపాటే కనకదాసు కూడా పుణ్యప్రదేశములను వీక్షిస్తూ భక్తుడిగా మారినాడు.

కనకదాసు చిన్నతనం నుండియే సంగీత, సాహిత్యాలలో మంచి పాండిత్యం సంపాదించినాడు. మంచి మంచి

రచనలు చేసినాడు. యవ్వనంలోనే ఇతడు నృసింహ స్తోత్రతం, రామధ్యాన మంత్రం, మోహన తరంగిణి వంటి రచనలు చేశాడు. సంగీతంలో ఇతడు గొప్ప స్వరకర్త. కృష్ణుడిపై దాదాపుగా 240 కృతులు రచించినాడు. గొప్ప భక్తిజ్ఞానం ఉట్టిపడే కీర్తనలను ఆలపించేవాడు. ఇతడి యొక్క పాండిత్యానికి తల్లితండ్రులు ఎంతగానో అబ్బురపడేవారు. మహదానంద పడిపోయేవారు.

కనకదాసు గురువుగారైన వ్యాసరాయల వారు 'ఉడిపి'లో నివసించేవారు. ఇతడిని శ్రీకృష్ణదేవరాయల వారికి కూడా గురువుగా ఉండేవారని చెబుతారు. బాద గ్రామంలో నివసించే కనకదాసుని వ్యాసరాయలవారు ఉడిపి రమ్మనడంతో అతడి దగ్గరకు వెళ్ళిపోయి గురువుగారి వద్దనే ఉంటూ, వారికి సేవచేస్తూ సకల విద్యలనూ నేర్చుకుంటూ ఉండేవాడు.

ఒకానొక సందర్భంలో వ్యాసరాయలవారు శిష్యులందరినీ సమావేశపరచి ఆధ్యాత్మిక బోధను చేయుచున్నప్పుడు కనకదాసు కూడా ఆ గుంపులో ఒక శిష్యుడిగా ఉంటాడు. అంతేగాని ఆ రోజుకి కనకదాసు వ్యాసరాయలవారికి ప్రియశిష్యుడిగా మారలేదు. ఆరోజు జరిగిన సంఘటన వలన తను గురువుగారికి అనుంగు శిష్యుడిగా మారి ఉడిపికి వెళ్ళడం జరిగింది.

ఆరోజు జరిగిన సమావేశంలో వ్యాసరాయలవారు శిష్యులందరినీ ప్రశ్నిస్తూ ''మీలో ఎవరైనా మోక్షానికి వెళతారా'' అని అడుగుతారు.

ఆ ప్రశ్నకు ఎవరూ సమాధానం చెప్పకుండా ఒకరి ముఖాలు మరియొకరు చూసుకుంటూ ఉంటే కనకదాసు మాత్రం లేచి నిలబడి ''గురువుగారూ... నేనే కాదు... ఇక్కడ ఉన్నవాళ్ళు ఎవరూ మోక్షానికి వెళ్ళరు'' అని చెబుతాడు.

ఆ మాటలకు విస్తుబోయిన వ్యాసరాయలవారు ''సరే! మీరింకా ఆధ్యాత్మిక పరిణతిని సాధించలేదు కాబట్టి వెళ్ళరు. మరి నేను మోక్షానికి వెళ్తానా?'' అని అడుగుతాడు.

అందుకు కనకదాసు సమాధానమిస్తూ ''గురువర్యా! మీరు కూడా మోక్షానికి వెళ్ళరు'' అంటాడు.

''అయితే మోక్షానికి వెళ్ళేవారెవరు?'' అని ప్రశ్నిస్తాడు వ్యాసరాయలవారు.

''నేను అనే భావాన్ని మదిలో పోగొట్టుకున్నవాడు. నేను ఎవరిని? ఎందుకు ఈ లోకంలోకి వచ్చాను? ఈ జన్మకు పరమార్థమేమిటి? అని ఆలోచించినవాడు... అరిషడ్వర్గాలను జయించిన వాడు మాత్రమే ముక్తికి... మోక్షానికి అర్హుడు'' అని కనకదాసు చెప్పిన సమాధానం వ్యాసరాయల వారికి ఎంతో సంతృప్తిని కలిగిస్తుంది. నాటినుండి వ్యాసరాయలు వారు కనకదాసుని తన వెంట తీసుకుని వెళ్ళడమే కాదు... అనుంగు శిష్యుడిగా ప్రకటించుకున్నాడు.

**"విశ్వమంతా నిండియున్న ఆ పరమాత్ముడిని కీర్తించడానికి ఏ ప్రదేశమైతేనేమి? అందుకే నేను గుడి వెనుక భాగమున అంటే పడమటి దిశలో కూర్చుని ప్రతిదినము ప్రార్థనలు చేస్తాను. ఆ దేవదేవుణ్ణి కీర్తిస్తాను. అదియే నాకు ఎంతగానో తృప్తినిస్తుంది. నా విషయంలో మీరెటువంటి విచారమునకు లోను కాకుండా మీరు, మీతోపాటు యున్న శిష్యులను తీసుకుని గుడిలోనికి వెళ్ళి దేవదేవుణ్ణి దర్శించుకోండి"**

గురువుగారి వెంట 'ఉడిపి' గ్రామం చేరుకున్న కనకదాసుకి అక్కడ కొలువై ఉన్న భగవాన్ శ్రీకృష్ణుడి ఆలయంలో ఆ దేవదేవుడి దర్శన భాగ్యాన్ని... ఆ గుడి పూజారులు కల్పించలేదు. అయితే వ్యాసరాయల వారికి మరియు మిగిలిన శిష్యులందరికీ ఆలయ ప్రవేశం కల్పించారు. కనకదాసు తక్కువ కులంలో పుట్టిన కరాణంగా ఆ గుడి పూజారులు భగవంతుడి దర్శనాన్ని ఇవ్వడానికి నిరాకరించారు.

కనకదాసు విషయంలో గురువుగారైన వ్యాసరాయల వారు ఆలయ ప్రవేశం కల్పించమంటూ ఆ గుడి ధర్మకర్తలను, పూజారులను కలిసి ఎంతగానో ప్రాధేయపడ్డారు. అయినా సరే వారి మాటలను త్రోసి రాజన్నారు.

తన గురించి గురువుగారు ఒక మెట్టు దిగి ఆ గుడి పెద్దలను పూజారులను అభ్యర్థించడం కనకదాసుకి ఎంతో బాధ కలిగించింది. అందుకే గురువు గారితో ''గురువుగారూ మీలోను, నాలోను, అందరిలోనూ ఉండేది ఆ దైవమే. నాకు కృష్ణుడి దర్శన భాగ్యం కల్పించలేదని చింతించకండి. కనీసం ఈ ఆలయానికి తూర్పుముఖంగా కూర్చుని దూరంగానైనా నిలబడి భగవంతుణ్ణి దర్శించుకోవడానికి నాకు అనుమతిని ఇవ్వలేదని మధనపడకండి. ఈ మానవుల దృష్టిలోనే కులమత భేదాలు. ఆ పరమాత్ముడికి అందరూ ఒకటే.



విశ్వమంతా నిండియున్న ఆ పరమాత్ముడిని కీర్తించడానికి ఏ ప్రదేశ మైతేనేమి? అందుకే నేను గుడి వెనుక భాగమున అంటే పడమటి దిశలో కూర్చుని ప్రతిదినము ప్రార్థనలు చేస్తాను. ఆ దేవదేవుణ్ణి కీర్తిస్తాను. అదియే నాకు ఎంతగానో తృప్తినిస్తుంది. నా విషయంలో మీరెటువంటి విచారమునకు లోను కాకుండా మీరు, మీతోపాటు యున్న శిష్యులను తీసుకుని గుడిలోనికి వెళ్ళి దేవదేవుణ్ణి దర్శించుకోండి'' అంటాడు.

కనకదాసు ఒక్కడికే దర్శనభాగ్యం కలగకపోవడం వ్యాసరాయల వారిని చింతాక్రాంతుణ్ణి చేసినా... శిష్యుడి మాటలకి ఊరడింపుని పొంది మిగిలిన శిష్యులతో కలిసి కృష్ణ పరమాత్ముడిని దర్శించుకుంటాడు.

ఆనాటి నుండి కనకదాసు ఆ గుడికి పడమర దిశలో కూర్చుని తనయొక్క కీర్తనలతో పాటలు పాడుతూ కృష్ణుణ్ణి ఆరాధిస్తూ... భక్తితత్వంలో ఓలలాడుతూ ఉంటాడు. అక్కడే చిన్న పాక వేసుకుని నివసిస్తూ రాత్రింబగళ్ళు కృష్ణుణ్ణి తన కీర్తనలతోను, కృతులతోను మధురంగా గానం చేస్తూ ఆరాధిస్తూ ఉంటాడు.

తన భక్తుడు కీర్తనలతో, కృతులతో ఆరాధిస్తూ భక్తి పారవశ్యంలో మునిగిపోయి తన్మయుడై పరితపించడం, తన యొక్క దర్శనానికి పరితపిస్తూ వేదన నిండిన హృదయంతో ప్రార్థన చేయడం గమనించిన కృష్ణభగవానుడు ఒకరోజున గుడికి వెనుక యున్న గోడను ఛిద్రం చేసి గుడిలోపల తూర్పుదిశగా ప్రతిష్ఠితుడైన కృష్ణభగవానుని విగ్రహం కనకదాసు ప్రార్థన చేస్తున్న పడమర దిశకు మారి తన భక్తునికి దర్శనభాగ్యం కలగజేస్తాడు.

ఆ రోజు ఉదయం గుడికి వచ్చిన పూజారులు కృష్ణ విగ్రహం పడమర దిశకు మారి ఉండటం చూసి అబ్బుర పడుతూ యుండగా వారికి అశరీరవాణిగా పరంధాముడైన కృష్ణుడి మాటలు ఈ విధంగా వినబడతాయి.

''భగవద్బంధువులారా! కనకదాసు తక్కువ వర్ణంలో జన్మించినవాడని... అతనికి ఆలయ ప్రవేశం కల్పించకపోవడం మీరు చేసిన పెద్ద తప్పు. నా దృష్టిలో అందరూ ఒకటే. నాకు కావలసింది నిష్కల్మషమైన భక్తి. అరిషడ్వర్గాలను అదుపులో పెట్టుకున్న జితేంద్రియుడు... పసిపాప మనస్తత్వం కలిగినవారినే నేను ఎత్తుకొని నడిపిస్తాను. మిగిలిన వారందరినీ వారి వారి ఆలోచనలకు తగినట్లుగానే నడిపిస్తాను. నేటినుండి అందరూ ముక్తులుగా మారడానికి ప్రయత్నించండి. నేటినుండి కనకదాసుకి ఆలయ ప్రవేశం కల్పించండి. అయితే నా విగ్రహాన్ని మాత్రం తిరిగి తూర్పుదిశకు మార్చకండి''. ఈ మాటలు విన్న పూజారులు, ధర్మకర్తలు అందరూ తక్షణమే పరుగు పరుగున కనకదాసు దగ్గరకు వెళ్ళి అతడి కాళ్ళపై పడి క్షమించమని వేడుకున్నారు.

నాటి నుండి కనకదాసు కృష్ణపరమాత్ముని దర్శిస్తూ ఉంటాడు. తదనంతర కాలంలో దేశమంతటా విస్తృతంగా పర్యటించి... తన కీర్తనల ద్వారా ప్రజలలో భక్తి భావాన్ని, సమత్వాన్ని, ప్రేమతత్వాన్ని పెంచుతాడు.

అవసాన దశలో తిరుమల చేరుకుని శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించి, దేహపరిత్యాగం చేసి శ్రీమన్నారాయణుడిలో ఐక్యమయ్యాడు.

# శయనైకాదశి

– కౌతా నిర్మల

శ్రీకృష్ణుడు ధర్మరాజుకు శయనైకాదశిని గురించి తెలిపినట్లుగా, పురాణాలద్వారా తెలుస్తోంది. ఆషాఢశుక్ల పక్ష, ఏకాదశిని శయనైకాదశిగా చెబుతారు. మోక్షాన్ని ప్రసాదించే రోజుగా దీన్ని భావిస్తారు. ఆ రోజు ఉపవాసం ఆచరించడం వల్ల పాపాలకు నిష్కృతి కలుగుతుంది. ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు వామన అవతారంలో ఉన్న విష్ణుమూర్తిని పూజించాలి. ఆరోజు శ్రీమహావిష్ణువును ఆరాధిస్తే త్రిమూర్తులను పూజించినట్లే. ఆషాఢశుద్ధ ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు విష్ణుమూర్తి శయనిస్తాడు. శయనైకాదశినాటి రాత్రి విష్ణుమూర్తి కథలను మాహాత్మ్యాన్ని స్మరిస్తూ, భజనలు చేస్తూ ఆ స్వామి లీలావిశేషాలను గానం చేస్తూ జాగరణ చేసినవారు మరణించిన తర్వాత వైకుంఠమును చేరుకుంటారు.

శ్రీమన్నారాయణుడు నిద్రలో గడిపే నాలుగు నెలలు భక్తులు మారి ఆహారంలో మార్పులు చేయాలి. శ్రావణమాసములో శాకములను తినకూడదు. భాద్రపద మాసంలో పెరుగును తినడం మానెయ్యాలి. ఆశ్వయుజ మాసంలో పాలను, పాలసంబంధిత పదార్థాలను తీసుకోకూడదు. కార్తీకంలో పప్పుధాన్యాలను విసర్జించాలి. ఇది శయనైకాదశి దీక్షా వ్రతము. ఈ నాలుగు నెలలూ బ్రహ్మచర్యాన్ని పాటించాలి. అటువంటి వారికి పుణ్యఫలముతో పాటు ఉత్తమగతి లభిస్తుంది. శయనైకాదశి గురించి ఒక కథ పురాణాలలో వివరించబడింది.

పూర్వం త్రేతాయుగంలో బలిచక్రవర్తి అనే దైత్యుడు రాజ్యపాలన చేసేవాడు. అతడు గొప్ప విష్ణుభక్తుడు. ఆ చక్రవర్తి విష్ణుమూర్తిని పూజిస్తూ, యజ్ఞాలను, హోమాలను ఎంతో భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో ఆచరించెడివాడు. అతనొకసారి యజ్ఞము చేస్తున్న సమయంలో అతని దీక్షను, ఏకాగ్రతను చూసిన దేవతల ప్రార్థన మేరకు విష్ణుమూర్తి ఐదవ అవతారంగా వామనుని రూపంలో, బలి చక్రవర్తి వద్దకు వెళ్ళి అతని ఆతిథ్యాన్ని, ఆదరణనూ పొందాడు. బలిమహారాజు వటువు రూపంలో ఉన్న వామనునికి నమస్కరించి, అర్ఘ్యపాద్యాదులు సమర్పించి ఏదైనా వరం కోరుకోమని చెప్పాడు వినయంగా. మూడడుగుల నేలను



ప్రసాదించమని కోరాడు వామనుడు.

వామనుని కోరికను విన్న బలి చక్రవర్తి, ఆ స్వల్ప కోరికకు విస్మితుడయ్యాడు. వామనుని కోరికను విన్న రాక్షసగురువయిన శుక్రాచార్యుడు వామనుడు సామాన్యుడు కాడని అతడు విష్ణువే అని గ్రహించాడు. అతనికి ఆ దానమివ్వవద్దని, అతను సాక్షాత్తూ ఆ విష్ణువే అని, అతను అడిగిన కోరిక తీరిస్తే చక్రవర్తికి అన్యాయం జరుగుతుందని వారించాడు. బలిచక్రవర్తి గొప్ప దానశీలుడవడం వల్ల తాను అతనికి మాట ఇచ్చిన ప్రకారంగా దానమివ్వవలసిందేనని, తను మాట తప్పి అపఖ్యాతి పాలవననీ, గురువుగారికి చెప్పేశాడు. గురువుగారి హితబోధను వినకుండా మూడడుగుల నేల దానమివ్వటానికి సిద్ధపడ్డాడు. ఆ రాజు ఆ దానాన్ని ఇవ్వకుండా ఆపాలని ప్రయత్నించిన శుక్రాచార్యుడు విష్ణువు వల్ల భంగపడి కన్ను పోగొట్టుకున్నాడు.

బలి చక్రవర్తి చేతినుంచి సంకల్ప జలము వామనుని చేతిలోకి రాగానే 'ఇంతింతై వటుడింతై ఎదిగిపోయి, విశ్వరూపముతో తాను కోరిన దానముతో భువి దివులలోకి రెండడుగులతో ప్రవేశించాడు. మూడో అడుగు కోసం స్థలం చూపమని వామనుడు బలి చక్రవర్తిని అడిగాడు. రెండు అడుగులతో భూమిని, ఆకాశాన్ని ఆక్రమించిన వామనుడు సాక్షాత్తూ భగవంతుడేనని తెలుసుకున్న బలి వినయంతో వంగి తన శిరస్సు మీద ఆ దివ్యపాదమును ఉంచమని కోరాడు. వామనుడు అట్లే చేసి, బలిని పాతాళంలోకి అణగదొక్కాడు. నా అవతారములోని ఒక రూపమైన వామనుడు బలిని ఆశ్రయించగా, రెండవ మూర్తి క్షీరసాగరాన ఆదిశేషుడు తల్పము కాగా పవళించి నిద్రిస్తాడు.

శయనైకాదశీ కథను విన్నవారు ఆ నాలుగు నెలలు ఏకాదశీ విధి విధానమును పాటించిన వారు పుణ్యగతిని పొందుతారని పద్మపురాణంలో ఉత్తరఖండంలో తెలుపబడింది.

# తిరుమల సర్వస్వం



– పల్లపోతు వాణిశ్రీ

## తలయేరు గుండు

రాజగోపుర ద్వారం గుండా మరికొన్ని మెట్లు ఎక్కగానే 48వ మెట్టు వద్ద మనకు కుడిప్రక్కగా ''తలయేరు గుండు'' దర్శనమిస్తుంది. అలిపిరి మార్గం పొడవునా కన్పించే గుండ్రటి శిలలో మొదటిది, మరియు అత్యంత పెద్దది అయినందువల్ల ఆ బండరాతి ప్రక్కనే ఇదివరకు ఒక యేరు ప్రవహిస్తుండటం వల్ల ఇది ''తలయేరు గుండు''గా స్థిరపడింది. తమిళంలో 'తలై' అనగా 'మొదటిది' లేదా 'ముఖ్యమైనది' అని అర్థం. యాత్రికులు మెట్లెక్కేటప్పుడు మోకాళ్ళ నొప్పులు రాకుండా ఉండటం కోసం అనాదిగా వస్తున్న ఆచారాన్ననుసరించి వందల సంవత్సరాలుగా తమ మోకాళ్ళను ఆన్చటం వల్ల అరుగుదలతో, బండరాతి క్రింద భాగంలో మోకాలి చిప్పలను పోలే అనేక గుంతలు కనిపిస్తాయి. ఈ శిలకు పైభాగంలో అంజలి ఘటిస్తున్న ఆంజనేయుణ్ణి దర్శించుకోవచ్చు. సాక్షాత్తు ఆంజనేయుని శిల్పాంకితమైన శిల యొక్క పవిత్రతను పరిరక్షించడానికి, ఈ అమూల్యమైన వారసత్వ సంపదను కాపాడుకోవటానికి ఆ పవిత్రశిలను మోకాలితో తాకకుండా కొద్దిదూరం నుండే నమస్కరించుకుంటే శ్రేయస్కరమేమో ఆలోచించదగ్గ విషయం.

### కుమ్మరి మంటపం

తలయేరు గుండు దాటగానే, శ్రీవారి మహాభక్తుడైన కుమ్మరి భీమన్న స్వామివారికి గుర్తుగా ఒక మంటపాన్ని కట్టించాడు. అదే ''కుమ్మరి మంటపం''గా పేరు గాంచింది. ఆ ప్రదేశంలోనే భీమన్నను స్మరణకు తెచ్చేవిధంగా ఆ కుమ్మరివాని కుటుంబీకుల శిల్పాలు, కుమ్మరిసారె చెక్కబడిన శిలాఫలకాలు ఉన్నట్లుగా కొన్ని గ్రంథాలలో చెప్పబడుతోంది. కాని ఇప్పుడా మంటపం, శిలాఫలకాలు రెండూ కనుమరుగైపోయాయి.

### మైసూరు గోపురం

తలయేరు గుండు దాటిన తరువాత 250 వ మెట్టు వద్ద నాలుగు ద్వారబంధాలు, ఐదంతస్తులు కలిగిన గోపురాన్ని ''మైసూరు గోపురం'' లేదా ''రెండవ గోపురం'' లేదా ''కొత్త గోపురం'' అని పిలుస్తారు. ఈ గోపురాన్ని 16వ శతాబ్దంలో మట్లకుమార అనంతరాజు నిర్మించాడు. బహుశా మైసూరు

నుండి రప్పించబడ్డ శిల్పులతో నిర్మించబడటం వల్ల ఈ గోపురానికా పేరు వచ్చి ఉండవచ్చు. గోపుర మంటపంలో కుడి ప్రక్కన ఉన్న కుడ్యంపై ''శ్రీనివాసుడు'' వారికి నమస్కరిస్తున్న అ నంతరాజు తల్లితండ్రులైన తిరువేంగళనాథుడు – చెన్నమ్మల విగ్రహాలు కూడా చెక్కబడి, వారి పేర్లు తెలుగు తమిళ భాషల్లో లిఖించబడి ఉన్నాయి. మరికొంత దూరం ప్రయాణించాక 375వ మెట్టుపై గజేంద్రమోక్షానంతరం గజరాజును ఆశీర్వదిస్తున్న శ్రీమహావిష్ణువు శిల్పం ఒక పర్వతశిలపై హృద్యంగా చెక్కబడి, ఈ మార్గానికి ఎడమ ప్రక్కగా కనబడుతుంది.

ఇప్పటివరకు మనం అలిపిరి మార్గం ద్వారా నడక ప్రారంభించి 375 సోపానాలను అధిగమించి, మొసలి బారినుండి గజరాజును రక్షించిన శ్రీమహావిష్ణువును దర్శించుకున్నాం.

మరికొన్ని మెట్లు ఎక్కిన తరువాత 535 మెట్టుపై ముకుళిత హస్తాలతో ఉన్న ఆంజనేయుని శిల్పం దర్శనమిస్తుంది. ఇంకొంచెం ముందుకు సాగితే 680వ మెట్టు వద్ద 1928వ సంవత్సరంలో పునరుద్ధరించబడ్డ పదహారు స్తంభాల ''రాజవోలు మండపం'' కనబడుతుంది. యాత్రికులు విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా, ఈ మంటపంలో ఇరుప్రక్కలా విశాలమైన అరుగులు ఉంటాయి. తిరుమలకు సంబంధించిన గ్రంథాలలో గానీ, స్థానికుల వద్ద గానీ ఈ మంటపానికి ఇలా చిత్రమైన పేరు రావడానికి గల సమాచారం లభించలేదు.

## గగనాన గరుత్మంతుడు

మరికొద్ది దూరం వెళ్ళిన తరువాత, 870 మెట్టు వద్ద ఎడమ ప్రక్కగా, పైకి చూస్తే, దూరంగా ఉన్న పర్వతశిఖరం అంచులో కొనదేరిన నాసికతో, దృఢమైన దవడలతో, వెడల్పాటి ఫాలభాగంతో నున్న ''గరుత్మంతుడు'' దర్శనమిస్తాడు. శేషాచల శిఖరాల్లో ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన గరుత్మంతుని ముఖారవిందం, స్వామివారి భక్తరక్షణకో, శిష్టరక్షణకో లేదా ముల్లోక సంచారానికో బయల్వెడలినప్పుడు, వారిని ఆకాశమార్గంలో సత్వరమే గమ్యం చేర్చడానికి ఖగరాజు సిద్ధంగా ఉన్నట్లనిపిస్తుంది. ఆవిధంగా సప్తగిరులలో ఒకటైన ''గరుడాద్రి'' సార్థక నామధేయమయింది.

గగనాన వెలసిన గరుత్మంతుని దర్శించగానే వచ్చిన నూతనోత్సాహంతో నడక వేగం పుంజుకుంటుంది. తదుపరి 1150వ మెట్టుపై పూర్తిగా శిథిలమై, నేలమట్టం అయిన ''యలక్కాయల మంటపం'' కానవస్తుంది. ఈ పేరు వెనక ఉన్న చరిత్ర కూడా అందుబాటులో లేదు. కానీ ఈ మంటపం సమీపంలో ఒకటి రెండు వెలక్కాయ చెట్లు ఉండడంతో, ఒకప్పుడు ఇక్కడ వెలగచెట్లు అధికంగా ఉండేవని, ఆ కారనంగా ఇది ''వెలక్కాయల మంటపం''గా రూపాంతరం చెంది ఉండవచ్చని ఊహించవలసి వస్తోంది. దాని ప్రక్కనే ఉన్న బండరాతిపై ముకుళిత హస్తాలతో సుసంపన్నమైన ఆంజనేయుణ్ణి, శ్రీవేంకటేశ్వరుణ్ణి, వారికి భక్తితో నమస్కరిస్తున్న రాజదంపతులను దర్శించుకోవచ్చు.

సువిశాలమైన ఈ మెట్టుపై నుండి వెనుకకు తిరిగి చూస్తే, ఇక్కడి నుండి తిరుపతి పట్టణం మనోహరమైన ఆధునిక దృశ్య కావ్యంగా ఆవిష్కృతమవుతుంది.

మరికొన్ని మెట్లు ఎక్కిన తరువాత 1800వ మెట్ల వద్ద వామనావతారం విగ్రహం పక్కగా ఒక ప్రాచీనమైన నాలుగుస్తంభాల మంటపంలో నమస్కార భంగిమలో ఉన్న రామానుజుల వారి ప్రతిమను దర్శించుకోవచ్చు. మొత్తం మెట్లలో సగభాగాన్ని విజయవంతంగా అధిరోహించినందుకు గాను భక్తులను అభినందిస్తున్నట్లున్న రామానుజులవారికి ప్రణమిల్లి ముందుకు సాగుదాం.

## గాలి గోపురం

2083వ మెట్టును ఒక మైలురాయిగా చెప్పుకోవచ్చు. ముందుగా బాటకు ఎడమ ప్రక్కన ఉన్న ఓ చిన్న ఆలయంలో ఉన్న వీరాంజనేయుని దర్శించుకుని కొన్ని అడుగులు వేయగానే సమున్నతమైన గాలిగోపురం కనబడుతుంది. దీనిని కూడా మట్లకుమార అనంతరాజు ప్రభువే నిర్మించాడు. అద్భుతమైన కుడ్యశిల్పాలతో అలరారుతున్న ఈ బహుళ అంతస్తుల గోపురాన్ని నడకదారికి తలమానికంగా చెప్పుకోవచ్చు. ఈ గోపురానికా పేరు రావడం వెనుక రెండు కథనాలున్నాయి.

మొదటిది – ఏ విధమైన దేవాలయము లేకుండా ఖాళీగా ఉండటం వల్ల, ఈ గోపురాన్ని మొదట్లో ''ఖాళీ గోపురం''గా పిలిచేవారు. కాలక్రమేణా అదే ''గాలి గోపురం''గా మారిందని కొన్ని గ్రంథాల్లో చెప్పబడింది. అయితే నడకదారిలో దీనికంటే ముందున్న రెండు గోపురాల సమీపంలో కూడా ఏ విధమైన దేవాలయాలు లేవు. కాబట్టి ఈ కథనం సందేహాస్పదమే.

మరో కథనం ప్రకారం – సమున్నతమైన ఈ ప్రదేశానికి సమీపానికి వేరే శిఖరాలేవీ లేనందున ఇచ్చట గాలి హోరుగా వీస్తుంది. ఉధృతంగా వీచే వాయువును ప్రత్యక్షంగా అనుభూతి చెందవచ్చు. కావున దీనికి ''గాలి గోపురమ''నే పేరొచ్చింది. ఈ కథనం విశ్వసనీయంగానే అనిపిస్తుంది.

ఈ ప్రదేశానికి చేరుకోగానే, సప్తగిరులలో తొట్టతొలి కొండ అధిరోహించటం పూర్తయినట్లుగా భావిస్తారు. ఈ గోపురంపై తిరునామం, ఇరుప్రక్కలా శంఖు చక్రాలు అమర్చబడి, వైకుంఠాన్ని తలపుకు తెస్తుంది. ఈ వైష్ణవచిహ్నాలను విద్యుద్దీపాలతో అలంకరించడం వల్ల, వీటిని రాత్రి సమయాల్లో తిరుపతి పట్టణం నుంచి కూడా దర్శించుకోవచ్చు. ఈ ప్రదేశంలోనే నవనాథులలో ఒకరైన ''గోరక్షానాథ్'' అనే సిద్ధుడు కొన్నేళ్ళపాటు తపస్సు చేసినట్లుగా చెబుతారు. ఇచ్చట కొన్ని సమాధులు, ఒక పాడుబడ్డ పుష్కరిణి కూడా ఉన్నట్లు కొన్నిచోట్ల పేర్కొనబడింది. గాలిగోపురానికి కొంచెం దూరంలో, పాలరాతి శిల్పాలతో విరాజిల్లుతున్న ఈ మధ్యనే పునరుద్ధరించబడిన ప్రాచీన మైన కోదండరామాలయం ఉంది. నడకదారి ప్రారంభంలో మొదటి గోపురం లేదా మహాగోపురం వద్ద మనం తీసుకున్న ''దివ్యదర్శనం'' టోకెన్ ను, గుర్తింపు పత్రాన్ని చూపిస్తే గాలిగోపురం వెనుకనే ఉన్న తి.తి.దే కార్యాలయంలో దర్శన సమయాన్ని నిర్దేశిస్తారు.

తరువాత ఇక్కడే ఉన్న తి.తి.దే ''అన్నప్రసాద కేంద్రం''లో గాని, లేదా అధికసంఖ్యలో ఉన్నటువంటి తినుబండారాల అంగళ్ళలో కాని అల్పాహార కార్యక్రమాన్ని ముగించుకుని, పక్కనే ఉన్న తి.తి.దే జలప్రసాద కేంద్రంలో దప్పిక తీర్చుకుని, ఓ వృక్షరాజం చుట్టూ వృత్తాకారంలో నిర్మించబడ్డ విశాలమైన సిమెంట్ చప్టాపై కొంచెం సేపు విశ్రాంతి తీసుకోవచ్చు. అవసరమైన వారికి అక్కడే తి.తి.దే వారి ప్రథమ చికిత్సా కేంద్రం కూడా అందుబాటులో ఉంటుంది. గాలి గోపురం దాటగానే సుదీర్ఘమైన నడకదారి ప్రారంభమవుతుంది. మెట్లెక్కే అవసరం తక్కువగా ఉండటంతో, అలసటగా ఉన్న శరీరం కొద్దిగా తెరపిన పడుతుంది. కొన్ని మెట్లు ఎక్కిన తరువాత 2,104వ సోపానం వద్ద ''చిట్టెక్కుడు'' అనే ప్రాంతంలో లింక్ రోడ్డు ప్రారంభమవుతుంది. బహుశా ఈ ప్రాంతం నుండి మెట్లు సువిశాలంగా, ఎత్తు తక్కువగా ఉండి; నడకదారి అధికంగా ఉండడంతో యాత్రికులు సులభంగా నడవగలగటం వల్ల దీనికి ''చిట్టెక్కుడు'' అనే పేరు వచ్చి ఉంటుంది.

## జింకలపార్కు

''చిట్టెక్కుడు'' ప్రాంతంలో ఉన్న అనేక సువిశాలమైన మెట్లు దాటగానే, 2566వ మెట్టు వద్ద జింకలపార్కు కనబడుతుంది. లోహపుతీగెల కంచె లోపల చిగురుటాకులు సేవిస్తూ చారడేసి కళ్ళతో, ఛెంగు ఛెంగున గంతులు వేస్తూ, జింకలు, లేళ్ళు, వాటి కూనలు కన్నులపండువ చేస్తాయి. చిన్నపిల్లలయితే అలసటనంతా ఆదమరచి, జింకలతో మమేకమై, ఆ మూగజీవాలకు చిరుతిళ్ళు తినిపించే ప్రయత్నం చేస్తారు. అటవీశాఖ సిబ్బంది వాటికి శ్రద్ధగా నిర్ణీత సమయాల్లో, తగినంత సమతులాహారాన్ని అందిస్తారు గావున, పిల్లల్ని వారించి ఆ వన్యప్రాణుల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత పెద్దవారిగా మనపై ఉంది.

పురాణాల్లోకి వెళితే వైఖానస ఆగమాలలో యజ్ఞాలకు, యాగాలకు అంతులేని ప్రాముఖ్యత ఉంది. అందువల్లనే తిరుమలలో కళ్యాణ మంటపాలతో పాటు, అనేక యాగశాలలు కూడా ఉన్నాయి. వివిధ ఉత్సవాలు, సేవలతో పాటుగా, తరచు యజ్ఞ-యాగాదులు కూడా జరుగుతూనే ఉంటాయి. యాగం జరిగే ప్రదేశంలో కృష్ణజింకలు ఉండి తీరాలని శాస్త్రం ఘోషిస్తోంది. కావున తిరుమల క్షేత్రంలో కృష్ణజింకలను కొలువుంచటం జరిగింది.

ఈ జింకల పార్కు వద్ద లోయర్ బ్రిడ్జి ద్వారా వాహన మార్గమైన ఘాట్ రోడ్డును దాటుకొని, కొన్ని మెట్లెక్కగానే 'శ్రీకృష్ణావతారం' ముగ్ధమనోహరంగా కానవస్తుంది.

3,550 మెట్లెక్కి, కొండకోనల్లో తొమ్మిది కిలోమీటర్లు ప్రయాణించి, నడక ద్వారా తిరుమలకు చేరుకోవటం ఓ అనిర్వచనీయమైన అనుభూతి. దారిలో దర్శించదగ్గ విశేషాలు అనేకం ఉన్నా, సరైన సమాచారం లేకపోవడం వల్ల చాలామంది భక్తులు నడకదారి అందచందాలను ఆసాంతం ఆస్వాదించలేరు. అటువంటి వారికి కరదీపికగా ఉపయోగపడాలనే లక్ష్యంతో, మెట్లసంఖ్యను ఉదహరిస్తూ మేము చూచిన, విన్న, చదివిన విశేషాలన్నింటిని, అందుబాటులో ఉన్నవాటి పౌరాణిక, చారిత్రక సమకాలీన సమాచారంతో సహా ఈ ప్రకరణాలలో పొందుపరచబడ్డాయి. మేము చూచినది చూచినట్లుగా, విన్నది విన్నట్లుగా లేదా చదివినది చదివినట్లుగా పేర్కొనబడింది. ఇప్పటికీ పదిలంగా ఉన్న కొన్ని చారిత్రక చిహ్నాలను ఎంతో నిశితంగా పరిశీలించినప్పటికీ మేము గమనించలేకపోయే అవకాశం కూడా ఉంది. దానికి మన్నించగలరు. ఈసారి తిరుమలను సందర్శించుకునేటప్పుడు అలిపిరి నడక మార్గం ద్వారా కొండకు చేరుకుని మార్గమధ్యంలో ఉన్న విశేషాలన్నింటినీ తప్పనిసరిగా అవలోకిస్తారని ఆశిస్తున్నాం.

## భద్రాంజనేయుని విగ్రహం

2,680వ మెట్టు మరో మైలురాయి. స్థానికులు ఈ ప్రదేశాన్ని ''ఏడో మైలురాయి ప్రాంతం''గా పిలుస్తారు. ఈ ప్రదేశంలో కొండపైనుండి వాహనాలు దిగే ఘాట్ రోడ్డు

మరియు అలిపిరి మెట్లమార్గం ఒకదానికొకటి అత్యంత సమీపంలో సమాంతరంగా ఉంటాయి. దశావతారాల్లో చిట్టచివరిదైన కల్క్యావతారం కూడా ఇక్కడే ఉంటుంది.

1979వ సంవత్సరంలో ఈ ప్రదేశం నందు జరిగిన ఒక దుర్ఘటనను దృష్టిలో ఉంచుకొని అటువంటివి పునరావృతం కాకుండా అప్పటి టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ పి.వి.ఆర్. కె.ప్రసాద్‌గారినేతృత్వంలోఇక్కడఘాట్ రోడ్డుకు,కాలిబాటకు మధ్యనున్న ప్రదేశంలో దుష్టగణాలకు సింహస్వప్నమైన భద్రాంజనేయుని విగ్రహం ప్రతిష్ఠించబడింది. పది అడుగుల ఎత్తైన సువిశాల పీఠంపై ముప్పై అడుగులతో సమున్నతంగా ఉన్న గదాధరుడయినటువంటి హనుమంతుని విగ్రహం శాకిని-ఢాకిని పిశాచాలను, దుష్టశక్తులను తరిమికొట్టడానికి సిద్ధంగా ఉన్న అనుభూతిని కలిగిస్తుంది. పెద్దాపురం సమీపంలోని ఒక కుగ్రామంలో నివసించే తోడు లక్ష్మణస్వామి అనే కళాకారుడు ఈ విగ్రహాన్ని అత్యంత సుందరంగా వేళ్ళకు ఉన్న గోళ్ళు, వ్రేలాడుతున్న జులపాలు, వస్త్రానికి ఉన్న ముడుతలు వంటి సూక్ష్మాతి సూక్ష్మమైన శరీర భాగాలను సైతం అత్యంత నైపుణ్యంతో, ముచ్చట గొలిపేలా తీర్చిదిద్దాడు. సిమెంటుతో నిర్మించబడ్డ ఈ విగ్రహానికి మొజాయిక్ పూత పూసి శిలావిగ్రహాన్ని తలపుకు తెచ్చేలా, సుదీర్ఘకాలం నిలిచి ఉండేలా ఈ విగ్రహం తయారు చేయబడింది.

ఈ ప్రదేశం చూడచక్కనైన ఉద్యానవనం, పూలమొక్కలు, విశ్రాంతి స్థలము, త్రాగునీటి సదుపాయాలు, చిరుతిళ్ళ దుకాణాలతో అలరారుతూ, విహారస్థలాన్ని తలపించటంతో దాదాపు 2,700 మెట్లు ఎక్కిన అలసట కాస్తా దూదిపింజలా తేలిపోయి, మనసు, శరీరం మిగిలిన ప్రయాణానికి సమాయత్తమవుతాయి.

బాటకు ఎడమప్రక్కగా, తప్పనిసరిగా చూసి తీరవలసిన అటవీశాఖ మ్యూజియం ఉంది. అందులో శేషాచల పర్వతాల నైసర్గిక స్వరూపం, వాటి ఆవిర్భావం, వాటికున్న పౌరాణిక ప్రాశస్త్యం, స్థానిక అడవులలో సంచరించే జంతు జాతులు, అక్కడ పెరిగే వృక్షజాలం, ఔషధ మొక్కలు, లభించే ఖనిజాలు, ఒకప్పుడు ఆ ప్రాంతంలో నివసించే కోయజాతుల గురించి లభించే విస్తృతమైన సమాచారం వర్ణచిత్రాల రూపంలో వివరణతో సహా పొందుపరచబడింది.

ఇక్కడి నుంచి కొద్ది అడుగుల దూరంలో స్థానికులు ''ఏడవ మైలు మంటపం''గా పిలిచే, ఎనిమిది స్తంభాల విశ్రాంతి మండపం కనబడుతుంది.

మరో 20 మెట్లు ఎక్కిన తరువాత వచ్చే ఎత్తయిన ప్రదేశాన్ని ''మామండూరు మిట్ట'' అని పిలుస్తారు. ఇక్కడే పోలీస్ ఔట్ పోస్ట్ కూడా ఉంది. మరికొద్ది మెట్లు ఎక్కిన తరువాత పూర్తిగా పునరుద్ధరించబడిన దొరసాని మంటపం కనబడుతుంది. సుదీర్ఘమైన 2815 వ మెట్టుపై ఎడం ప్రక్కన ''సాష్టాంగ పడి వున్న భక్తబృందం'' యొక్క శిల్పాన్ని చూడవచ్చు. మరికొద్ది దూరంలో ఒకదాని తర్వాత ఒకటిగా రెండు పేరులేని విశ్రాంతి మండపాలు కానవస్తాయి.

## ముగ్గుబావి మంటపం

తదుపరి 2,840వ మెట్టుపై బాటకు ఎడం ప్రక్కగా దాసాంజనేయుని ఆలయం దర్శనమిస్తుంది. ఈ ఆలయం వెనుక, ఈనాడు చెట్టు-పుట్టతో నిండివున్న ఓ విశాలమైన లోతైన లోయను ''ముగ్గుబావి''గా పిలుస్తారు. స్థానికుల కథనం ప్రకారం ఈ ప్రదేశంలో ముగ్గురాయి అధికంగా లభించేది. ఇదివరకు కొన్ని వందల ఏళ్ళపాటుగా శ్రీవారి ఆలయం సాంప్రదాయ బద్ధంగా తీర్చిదిద్దబడే రంగవల్లులకు కావలసిన ముగ్గు కోసం అక్కడున్న రాతిని తవ్వేవారు. కాలాంతరంలో ప్రదేశం లోతైన సువిశాలమైన దిగుడుబావిగా తయారై, అదే 'ముగ్గురాతిబావి'గా లేదా 'ముగ్గుబావి'గా పిలువబడేది. వర్షపునీటితో, పర్వతసానువుల్లో నుంచి వచ్చే జలధారలతో ఈ లోయ నిండినప్పుడు పొంగిపొరలే నీరు అంతర్వాహినిగా దిగువకు ప్రయాణించి, తిరుపతి పట్టణంలో నేడు ''మంచినీటి కుంట''గా పిలువబడే చెరువుకు చేరుకుంటుందని స్థానికుల నమ్మకం. ముగ్గుబావి ప్రదేశంలో నరసింహస్వామి ఆలయం కూడా ఉండటం చేత, అక్కడినుంచి ప్రవహించే నీటిని కలుపుకోవడం వల్ల తిరుపతిలోని ''మంచినీటి కుంట''ను ''నరసింహతీర్థం''గా పిలిచేవారు. ఈమధ్యనే అభివృద్ధి చేయబడి, చుట్టూ ప్రహరీ నిర్మించబడిన ఈ చెరువు ఒడ్డున ఆలనా పాలనా లేకుండా పడివున్న శయన భంగిమలో ఉన్న గోవిందరాజస్వామి విగ్రహాన్ని దర్శించుకోవచ్చు. దాదాపు వెయ్యేళ్ళ క్రితం విష్ణుద్వేషి యైన కులోత్తుంగ చోళుడు ఆనాటి సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రమైన చిదంబరం ఆలయంలో నుంచి పెరికివేసి సముద్రంలో పారవేసిన ''గోవిందరాజస్వామి'' విగ్రహం ఇదేనని కొందరు అభిప్రాయపడతారు.

ముగ్గుబావి వద్ద శ్వేతచక్రవర్తి కుమారుడైన ''శంఖుడు'' భగవత్సాక్షాత్కారం కోసం తపస్సు చేయగా వేట నిమిత్తం అడవికి వెళ్ళిన శ్రీనివాసుడు ఆ భక్తునికి రాజు వేషంలో దర్శనమిచ్చాడని పురాణాల్లో చెప్పబడింది.

(ఇంకా ఉంది)

ధారావాహికం



# శ్రీమాన్ అనంతాళ్వార్ల దివ్య చరితము

- పి. వేంకట రామిరెడ్డి

## పదవ అధ్యాయము
## శ్రీ భగవద్రామానుజుల వారి తిరుమల అధిరోహణ కారకుడగుట

తన గురువగు శ్రీ రామానుజుల వారికిచ్చిన వాగ్దానము ప్రకారము, అనంతాళ్వాన్ కొలది సంవత్సరములలోనే తిరుమలను, పుష్పోద్యాన వనములుగ మార్చెను. ఎందరెందరో వచ్చి చూచి, సంతసించి, ప్రశంసించుచున్నా అనంతాళ్వాన్ మనస్సున ఏదో తెలియని వెలితి. అదియే తాను శ్రీగురుని ఆజ్ఞా పాలకుడనై, బంధుగణముల, సాటిశిష్యుల, శ్రీరంగనాథుని దివ్య సముఖమును వీడివచ్చి తిరుమల గిరుల చేరి, ఎన్నో కష్టముల పడి, ఇంతలా తయారుచేసిన పుష్పతోటలను తాను త్రవ్వి, తన గురువగు శ్రీరామానుజ పుష్కరిణి యని నామమిడిన పుష్కరిణిని, నిర్మించిన మండపమును శ్రీరామానుజులవారు చూచినప్పుడు కదా నా బ్రతుకునకు సార్థకత, ఆత్మకు పరిపూర్ణానందము, శాంతి సౌభాగ్యములు యని చింతించుచుండెడివాడు.

శిష్యుని అంతరంగము, గురువునకు తెలియనిదా? అట్టి సమయము రానే వచ్చెను.

ఒకసారి శ్రీరామానుజులవారు శిష్యబృందముతో కూడి శ్రీరంగము నుండి బయలుదేరి నడుమనున్న వైష్ణవ దివ్యదేశముల దర్శించుచూ, వైష్ణవమత, విశిష్టాద్వైత ప్రాముఖ్యముల ప్రకటితము చేయుచూ, తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయమునకు చేరెను.

ఈ విషయము తెలుసుకున్న తక్షణమే అనంతాళ్వాన్ శ్రీనివాసుని పుష్ప కైంకర్యము ముగించుకుని ఉరుకుల

పరు గుల తన శిష్యులతో శ్రీరామానుజుల చెంత చేరి ఆచా ర్యదేవ! వైష్ణవకులోద్ధారక! నీ ఆజ్ఞను నేను శిరసా వహించి మీరు నుడివిన రీతిగ తిరుమల గిరుల, పలు పుష్పోద్యానముల తయారుచేసి, వివిధ వర్ణపు పుష్పములతో అనునిత్యము ఆనందనిలయుని, శ్రీవేంకటనాథుని పుష్పకైంకర్యములు చేయుచున్నాను.

నేను ఎంత చేసినా, అచ్చోటనున్న పుష్కరిణి, నందనోద్యాన వనముల మీరు, మీ పరమ పావన పద్మములిడినపుడు కదా! నే తరియించునది. అపుడే కదా నా జీవితమునకు అర్థము, పరమార్థము యని అనంతార్యులు నుడువగా శ్రీరామానుజులవారు ఇట్లు పలికిరి.

ఓయీ! అనంతా! మన దేహములు వేరయినా నీవు తిరుమల గిరుల నున్ననూ, నేను శ్రీరంగములో నున్ననూ మన ఆత్మలు ఒక్కటియే. సదా నీ హృదయమున నీవు ఆత్మానుసంధానుడవై ఆపక పలికేటి నా నామస్మరణల ఘోష నాకు వినిపించుచునే యుండును. నీ పరమ ఆచార్య కైంకర్య నిష్ఠకు ఆ లక్ష్మీవల్లభుడే, శ్రీవేంకటనారాయణుడే సంతసించిపోవుచున్నాడు. అనుదినము నీతో మాటలాడుచున్నాడు. ప్రతిదినము నీవు ఆ శ్రీనివాసునికి చేసే పుష్పకైంకర్యములన్నింటిని, నీ కన్నులలోనే, నేను నిలిచి, నా కన్నులారా నే చూచుచున్నాను. ఇక నేను ప్రత్యేకముగా రావలసిన అవసరమేమున్నదనిరి.

అంతట, అనంతాళ్వాన్, అట్లైన మీరు తిరుమలకు రాని యెడల, నేనేల తిరుమలలో ఉండదగుదును? నా ప్రత్యక్ష దైవము, నా గురువగు మీరే ఇక నేనున్నూ తిరుమలకు వెళ్ళను యనుచూ, తన శిష్యులవైపు తిరిగి శిష్యులారా వింటిరి కదా! ఇక నాకు వేంకటాచలమున ఏ పనియునూ లేదు. మీరు వెంటనే వెళ్ళి నా ఆజ్ఞగా మన వారందరినీ వేంకటాద్రిని విడిచి ఉన్నపళముగా రమ్మని పలుక, అంతట శ్రీ రామానుజుల వారు అనంతాళ్వాన్, చింతించకు. నేనిపుడే నీతో కూడి తిరుమలకు వత్తును. కాని శ్రీవేంకటాచలము అతి పవిత్రమైన, భూలోక వైకుంఠము కలిగిన ఆ శ్రీమన్నారాయణుడు శ్రీవేంకటేశ్వరునిగా నెలవై, కొలువై యున్నాడు కావున, నేను అచట శ్రీవేంకటేశ్వరుని అభిషేక జలామృతపు తీర్థమును తప్ప వేరేమియునూ స్వీకరించను. అట్లే తిరుమల గిరులలోని ప్రతి అణువు, సిద్ధులు, మునులు, యోగులు, పరమ భక్తాగ్రేసరులు, సురలు, యక్ష, గంధర్వ, కిన్నెర, కింపురుష ముక్కోటి దేవతలు, నాలుగు వేదపు సమూహములే పరమ పవిత్రమయమైన సాలగ్రామములే, కావున నేను మోకాండ్లతోనే అలిపిరి నుండి శ్రీనివాసుని ఆనంద నిలయమునకు వచ్చుదునని పలికి, అలిపిరి శ్రీవారి పాదములకు నమస్కరించి, ఓ వేంకటనాథా! తిరుమల గిరుల నధిరోహించ శక్తినీయమని, ఆశీర్వదించమని వేడి, శ్రీరామానుజుల వారు తిరుమల నధిరోహించిరి.

సాక్షాత్ శ్రీరామానుజులవారి రెండవసారి తిరుమల అధిరోహణ కారకుడయ్యెను మన శ్రీమాన్ అనంతాళ్వాన్.

శ్రీరామానుజుని రాకను తెలుసుకున్న అతని మేనమామ యగు తిరుమల నంబి ఎదురేగి, శ్రీస్వామివారి అభిషేక తీర్థ ప్రసాదములను ఈయ, వాటిని స్వీకరించి, సాష్టాంగ ప్రణామములాచరించి శ్రీరామానుజులు అయ్యా, ఆచార్యా! మీరీ వయస్సున శ్రమపడి ఎదురువచ్చి తీర్థప్రసాదములీయ వలయునా? మీ బదులు వేరెవ్వరితోనైనా పంపవచ్చును గదా యన, బదులుగా తిరుమలనంబి రామానుజా! వైష్ణవకులతిలకా! సాక్షాత్ శ్రీనివాసుని చేతల శంఖు, చక్రముల ధరియింపచేసిన ఘనుడవు. నా మేనల్లుడవు. ప్రియాతి ప్రియుడవు. మనస్సు ఆగలేక, వయస్సు సహకరించకున్ననూ నీకై నేనే వచ్చితిని. ఎవ్వరినైనా పంపించవలెనని అనుకుంటిని గానీ, ఆనందనిలయము చుట్టుప్రక్కల నా కన్నుల కెవ్వరూ కానరాకపోయె. అందుకే ఆగలేక నేనే వచ్చితినని పలుక, శ్రీ రామానుజులవారు అమితానందభరితుడయ్యెను.

అనంతాళ్వాన్, తన గురువగు శ్రీ రామానుజుల వారిని తిరుమలకు తోడ్కొని వచ్చితిరను వార్త తిరుమలయంతయు ప్రాక, అనేకమంది వైష్ణవోత్తములు, భాగవతోత్తములు, అర్చకులు, సేవకులు, భక్తజనులు, పురజనులు తండోప తండములుగ వచ్చి శ్రీరామానుజుల వారికి అడుగడుగున మంగళ హారతుల నిచ్చుచూ, అడుగులకు మడుగులొత్తుచూ, జయ జయ ధ్వానములు చేసిరి.

తదుపరి శ్రీ రామానుజులవారు స్వామిపుష్కరిణిన స్నానమొనర్చి, సంధ్యావందనాది కార్యక్రమముల గావించుకుని, శ్రీ ఆదివరాహస్వామి వారిని సేవించి మెల్లగ ఆనందనిలయము తూర్పువేపు నుండి, పశ్చిమ దిక్కున, దక్షిణ మూలన గల ఆనందాళ్వాన్ తోటను ప్రవేశింప అనంతాళ్వాన్ తన సతీసమేత పరివారముతో ఎదురేగి వచ్చి, తన శ్రీగురుని పాదపద్మముల అభిషేకించి, పుష్పపూజల చేసి శ్రీరామానుజుల పాదాభిషేక జలముల తన నెత్తిపై చల్లుకుని, పరవశించిపోవుచూ పరమానంద భరితుడాయెను.

పుష్పతోటన తన పేర నిర్మించిన పుష్కరిణిని, అచట గల పుష్పమాలికలు కట్టు రాతి మండపమును, పలు రంగు రంగుల సౌరభ సౌగంధముల వెదజల్లేటి పలు పుష్పముల,

అందముగ అల్లు కున్న లతల తన చేతల స్పర్శించుచూ, పరవశించి ఆనందాతి హృదయుడై ఆనంద బాష్పముల రాల్చుచూ ఇట్లు పలికిరి.

అనంతా! నేడు కదా నా ఈ జన్మ సార్థకమైనది. అంతమంది శిష్యులున్న సభలో తిరుమలకు వెళ్ళి, పుష్పోద్యానవనముల తయారు చేసి, శ్రీవేంకటనాథునికి పుష్పకైంకర్యములు చేయువారెవ్వరైనా మీలో ఉన్నారా యన్న, నేను ఉన్నాను గురువర్యా, మీ ఆజ్ఞను నెరవేర్చుదునని పలికిన నిన్ను చూచి ఆనాడే ఆత్మానందుడనై, నీకు నాడు నేను ఇచ్చిన ''ఆణ్ పిళ్ళై'' బిరుదు సరిగ్గా సరిపోయినది. తిరుమల గిరుల నీవు పడిన కష్టములు, నీకూ, నాకూ ఆ వేంకటాద్రీశునకే తెలియును కదా! చివరకు కరుణాంతరంగుడు , శ్రీనివాసుడే బాలుడి రూపమున వచ్చి మట్టి తట్టలు మోసి, నీచే గునపము దెబ్బ తినెను కదా! నీ అంతటి ఉత్తమ శిష్యుడు, గురు ఆజ్ఞా శిరోధార్యుడూ నాకు దొరికెను కదా! నీవు నేడు నా కన్నులకు మేరుపర్వతమంత ఎత్తున, దివిన నక్షత్రముల నడుమ, తెల్లని, చల్లని వెన్నెల కురిపించే పున్నమి చంద్రుని వోలె కన్పించుచున్నావనుచు, మహదానందముతో శ్రీభగవద్రామానుజులవారు అనంతాళ్వాన్ ను కౌగలించుకొనిరి.

శ్రీగురుని తీరు చూచి అనంతాళ్వాన్ ఎంతో వినయంతో, గురుదేవా! మీవంటి గురువు దొరికినప్పుడే కదా మీ శిష్యుడనగు నా జన్మ ధన్యమైనది. ఆత్మానందము, పరమానందము కలుగునది, శిష్యుడు గురువు అంచనముల తప్పి పోనీక, క్రిందపడక, నిలిచి, గురువు ఒసంగిన కార్యము సాధించి, నెరవేర్చి, గురువు మనోభీష్ట ఫలదాయకమను దక్షిణ ఒసగినపుడు కదా నిజమగు శిష్యుడను పదమునకు సార్థకత, ధన్యోస్మి – ధన్యోస్మి గురుదేవాయని, సాష్టాంగ ప్రణామములొనరించెను.

పిమ్మట అందరూ కలిసి ఆనంద నిలయమునకు చేరిరి. అనంతాళ్వాన్ సలిపిన పుష్పాలంకరణముల చూచి శ్రీరామానుజులు, 'ఓ శ్రీనివాస ప్రభో! అనంతాళ్వాన్ ఏరి కోరి తెచ్చి అమరికగ అందముగ కట్టి ఆజానుబాహు పర్యంతము నిన్నలంకరించిన పుష్పమాలికల తీరు చూడ, కల్గిన, భక్తుల కోర్కెలు తీర్చ, నీ సమ్మోహన రూపము తీరుతో ఆవల వైకుంఠ శ్రీమన్నారాయణుడవైన నీవు ఇల వైకుంఠమున అందముగ పుష్ప అలంకరణల చేయించుకుని, రామానుజా! నేను అందముగా ఉంటినాయని అడుగుచున్నట్లున్నది. ఆత్మానందము కలుగుచున్నది. స్వామి పరంధామా! శ్రీవేంకటేశ్వరా! యని పరిపరి విధముల శ్రీనివాసుని దివ్య, నవ్య అందచందపు వెలుగుల అర్చారూపమును ఆస్వాదించుచూ స్తుతించుచూ అర్చకులిచ్చిన తీర్థ శఠకోపాదుల స్వీకరించి అచటనేయున్న అనంతాళ్వాన్ తో, అనంతా! నీ ఆహ్వానము ప్రకారము శ్రీవేంకటాచలాధీశుడను, వారికి నీవు చేయు పుష్పకైంకర్యములను నేను కన్నులారా వీక్షించితిని. నేను వచ్చిన పని ముగిసినది. నేను వెళ్ళెదనని పలికెను.

ఒకవైపు తనను, తన గురువు ప్రస్తుతించినందుకు మనస్సులో ఆనందము, మరియొకవైపు గురువర్యులు అపుడే వెళ్ళిపోవుదుననుచున్నారే యని లోలోన చింత మొదలాయెను.

ఇంతలో తిరుమలనంబి వారు నాయనా! రామానుజా! వేంకటాచలమందు ఒక్క మూడు రోజులు ఉండుమని కోరెను. అటులేయనుచూ భోజనము స్వీకరించక, కేవలము శ్రీవేంకటేశ్వరస్వామివారి పాదాభిషేక జలామృతములనే స్వీకరించుచూ అనంతాళ్వాన్ మనస్సులోని కోరికను తీర్చెను.

మూడవరోజు శ్రీరామానుజులవారు ఆనందనిలయుని చేరి, తాను తిరిగి వెళ్ళుటకు ఆనతి నిమ్మన శ్రీవేంకటనాథుడిట్లు పలికెను.

ఓయీ రామానుజాచార్యా! నీకు ఇవ్వ ఇచట నా కడ ఏమున్నది? నీకు ఇవ్వవలసినదంతయూ, శ్రీరంగముననే ఇచ్చితినని పలికి సెలవునిచ్చెను.

తర్వాత శ్రీరామానుజులు తిరుమలగిరులు దిగి, తిరుపతి చేరి గోవిందరాజ స్వామి సన్నిధిలో గల తిరుమల నంబి వారి ఇంట ఒక సంవత్సర కాలము ఉండి పిమ్మట శ్రీరంగమునకు వెడలిపోయిరి.

శ్రీరామానుజులవారు తిరుపతిలో ఉన్నంత కాలము అనంతాళ్వాన్ వీలయినన్ని మార్లు తన గురువర్యులను దర్శించి అర్చించి తరియించెను.

ఇవ్విధముగ శ్రీమాన్ అనంతాళ్వాన్ తిరుమలనే అధిరోహించ నన్నట్టి తన పరమ గురువగు శ్రీ రామానుజ మునీంద్రుల తిరుమల గిరుల అధిరోహణ కారకుడయ్యెను.

ఇంతటి ఘనమగు శిష్యశిఖామణి భూత భవిష్యత్ వర్తమాన కాలములలో వచ్చునో, రాడో, దొరుకునో, దొరకడో ఆ శ్రీనివాస విభునికే ఎరుక.

**ఇతిః శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము**
**శ్రీభగవద్రామానుజుల వారి తిరుమల అధిరోహణ**
**కారకుడగుట యను**
**పదవ అధ్యాయము సంపూర్ణః**



# అమ్మ చెప్పింది

– డి.శ్రీనివాస దీక్షితులు

పూర్వం మహావిష్ణువు పదివేల సంవత్సరాల పాటు దానవులతో భయంకరంగా యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో విజయం ఎవరినీ వరించలేదు. యుద్ధం చేసి చేసీ విష్ణువు బాగా అలసిపోయాడు. దానవులూ అలసిపోయి పాతాళానికి వెళ్ళిపోయారు. మహావిష్ణువు యుద్ధభూమిలోనే పద్మాసనంలో కూర్చున్నాడు. ఎక్కుపెట్టిన ధనుస్సు మీద మెడను ఆనించి యోగనిద్రలోకి వెళ్ళిపోయాడు.

అప్పుడే దేవతలు ఒక యజ్ఞాన్ని చేయటానికి సంకల్పించారు. యజ్ఞానికి అధిపతి విష్ణువు కదా. ఆయనని ఆహ్వానించటానికి యుద్ధభూమికి వెళ్ళారు. అక్కడ విష్ణువు యోగనిద్రలో ఉన్నాడు. యజ్ఞాధిపతి లేకుండా యజ్ఞమెలా చేయాలో తెలియక దేవతలు తికమక పడ్డారు.

ఉపాయం కోసం దేవతలు బ్రహ్మదేవుని ప్రార్థించారు. బ్రహ్మదేవుడు ప్రత్యక్షమయ్యాడు.

దేవతలారా! నేను ఒక చెదపురుగుని సృష్టించి మీకు ఇస్తాను. అది నా ఆదేశంతో విష్ణువు ధనుస్సు పైభాగాన్ని తినేస్తుంది. అప్పుడు ఆ భాగంలో కట్టిన అల్లెతాడు పుటుక్కున తెగిపోతుంది. ధనుస్సు కిందపడిపోతుంది. ధనుస్సుకి మెడని ఆనించిన విష్ణువు పట్టుతప్పి తూలి గబుక్కున నిద్ర లేస్తాడు. దేవకార్యం పూర్తవుతుంది అన్నాడు బ్రహ్మదేవుడు.

వెంటనే బ్రహ్మ ఒక చెదపురుగుని సృష్టించాడు. చెయ్యాల్సిన పనిని ఆయన దానికి చెప్పాడు.

''బ్రహ్మదేవా మహావిష్ణువుకి నిద్రాభంగం కల్గించటం బ్రహ్మహత్యతో సమానమైన పాపం కదా. అటువంటి

మహాపాపం చెయ్యటం వల్ల నాకు కలిగే లాభం ఏంటి?'' అని వినయంగా అడిగింది చెదపురుగు.

''కీటకమా! దేవతలు చేయబోయే యజ్ఞంలో కొంతభాగం నీకిస్తారు'' అన్నాడు బ్రహ్మదేవుడు.

''ఎలాగ ఇస్తారు?'' అడిగింది చెదపురుగు.

''యజ్ఞం చేసే సమయంలో ఆ అగ్నికుండంలో మంత్రాలతో హవిస్సుని సమర్పిస్తారు. ఆ హవిస్సులో కొంతభాగం యజ్ఞకుండం పక్కన పడుతూ వుంటుంది. దానిని నీకు భాగంగా ఇస్తారు. ఇక నువ్వు నేను చెప్పినట్టుగా చెయ్యి'' అని బ్రహ్మదేవుడు ఆ చెదపురుగుని ఆదేశించాడు.

ధనుస్సులో అల్లెతాడును కట్టే భాగాన్ని గుల్ల గుల్లగా తినేసింది చెదపురుగు. అక్కడ కట్టిన అల్లెతాడు తెగిపోయింది. విల్లు కిందపడిపోయింది. అప్పుడు బ్రహ్మాండం బద్దలయినట్లుగా పెద్ద ధ్వని వినిపించింది. అది విని దేవతలు భయంతో వణికిపోయారు. భూమి కంపించింది. సముద్రాలు ఉప్పొంగిపోయాయి.

అంతా అల్లకల్లోలమయింది.

అంతలో భయంకరంగా ఈదురుగాలి వీచింది. సూర్యుడు అస్తమించాడు. చిమ్మచీకటి కమ్ముకుంది.

ఆ గాలి తాకిడికి మహావిష్ణువు తల తెగి ఎక్కడో పడిపోయింది. కాసేపటికి చిమ్మచీకటి తొలగిపోయింది.

శిరస్సు లేని విష్ణువు శరీరం దేవతలకి కనిపించింది. అది చూసి దేవతలు గొల్లుమన్నారు. అందరూ సముద్రంలో మునిగి లేచారు. బాగా దుఃఖించారు.

అప్పుడు బృహస్పతి దేవతల్ని ఓదార్చాడు.

''మనమంతా ఈవిధంగా ఏడుస్తూ కూర్చుంటే విష్ణువు జీవించడు. ఏదైనా ఉపాయం ఆలోచించాలి'' అన్నాడు బృహస్పతి.

బృహస్పతి సూచనతో దేవతలు బ్రహ్మదేవుని అర్థించారు. జగన్మాత అయిన మహాదేవిని ప్రార్థించమని బ్రహ్మదేవుడు చెప్పాడు.

బ్రహ్మదేవుని ఆదేశానుసారం వేదాలు వచ్చి మహాదేవిని ప్రార్థించాయి.

''జగన్మాతా! లోకాలన్నింటికీ నువ్వే ఆధారం. అందరికీ నువ్వే తల్లివి. త్రిమూర్తుల్ని నడిపించేది నువ్వే. సృష్టి స్థితి లయాల్ని నిర్వహించేది నువ్వే. ఇప్పుడు మేం పెద్ద ఆపదలో చిక్కుకున్నాం. కరుణించి మమ్మల్ని కాపాడు తల్లీ!'' అని దేవతలు ప్రార్థించారు.

మహాదేవి ప్రసన్నురాలయింది.

''దేవతలారా! మీకు అభయమిస్తున్నాను. కారణం



లేకుండా కార్యం జరగదు. విష్ణువు తల తెగి లవణ సముద్రంలో పడిపోవటానికి కూడా ఒక కారణముంది. ఒకసారి అందమైన లక్ష్మీదేవి మొహాన్ని చూసి కొంటెగా నవ్వాడు విష్ణువు. ఆ సమయంలో ఆమెలో తామస శక్తి ప్రవేశించింది. అందువల్ల ఆమెకి కోపం వచ్చింది. ఆలోచన నశించింది. భర్త అని కూడా ఆలోచించకుడా ''పతతు తే శిరః'' (నీ తల తెగిపడిపోవు గాక) అని విష్ణువుని శపించింది మహాలక్ష్మి.

''అలాగా!'' అన్నారు దేవతలు.

''మరో కారణం కూడా ఉంది. హయగ్రీవుడు అనే దానవుడు మాయాబీజంతో ఏకాక్షర మంత్రాన్ని జపిస్తూ వెయ్యేళ్ళు నా గురించి తపస్సు చేశాడు. నేను మెచ్చి ఈ దానవుడు హయగ్రీవుడి చేతిలోనే మరణించేట్టు వరమిచ్చాను. ఇప్పుడు హయగ్రీవుడు లోకకంటకుడయ్యాడు. అతనిని వధించటానికి విష్ణువు హయగ్రీవుడు కావాలి. అందువల్ల మీరు దేవశిల్పి త్వష్ట సహాయంతో గుర్రం తలని విష్ణువు శరీరానికి అతికించండి'' అని చెప్పింది మహాదేవి.

అమ్మ చెప్పినట్టే చేశారు దేవతలు. మహావిష్ణువు హయగ్రీవుడు అయ్యాడు. దానవుని వధించాడు హయగ్రీవుడు. దేవతలు సంకల్పించిన యజ్ఞం మహావిష్ణువు అనుగ్రహంతో పూర్తయింది.

దేవతలు అమ్మని ఆరాధించారు.

ధారావాహికం



వరాహ పురాణాంతర్గతం

# శ్రీ వేంకటాచల మాహాత్మ్యం

డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

గత సంచిక తరువాయి

భగవంతుని విమాన గోపురం మానవ నిర్మితమైనప్పటికీ దర్శనం మాత్రం చేతనే పాపకోటిని నశింపచేస్తుంది. ఇది నిశ్చయం. ఒక్కొక్కప్పుడు భగవంతునికి పూజలు వైభవంగా జరుగుతుంటాయి. మరొకప్పుడు స్వల్పంగా జరుగుతుంటాయి. ఆ వేంకటాచలపతి ఒక్కొక్కప్పుడు స్వయంగా ప్రకాశిస్తాడు. మరొకప్పుడు అంతర్ధానమవుతాడు. ఈ విధంగా ఆ వేంకటాద్రి శిరోభూషణుడైన శ్రీనివాసుడు లక్ష్మీదేవితో కూడ క్రీడిస్తూ కలియుగంలో చిత్రవిచిత్రాలను చూపిస్తాడు. భక్తితో కొంచెం సమర్పించినా, స్వల్పంగా పూజించినా తలంచినంత మాత్రం చేతనే ఆ కేశవుడు ప్రసన్నుడవుతాడు. వేంకటగిరికి వెళ్ళే మానవుల ఎడ ప్రసన్నుడై వెంటనే సకలాభీష్టాలను అనుగ్రహిస్తాడు.

శ్రీమహావిష్ణువు స్వయంగా అప్రాకృత దివ్య మంగళ విగ్రహుడైనప్పటికీ ప్రాకృతుని వలె నటిస్తూ తన మాయతో ప్రజలను మోహింప చేస్తాడు. భూలోకంలో మానవులు సమర్పించే భోగాలను ప్రీతితో స్వీకరిస్తాడు. మానవులు ఆయనకు వివిధ ఉత్సవాలు చేసి ఆనందిస్తారు. కలియుగంలో ఆయన్ను సేవించటానికి దేవలోకం నుండి దేవతలు దిగి వస్తారు. స్వామి పుష్కరిణిలో స్నానం చేస్తారు. భగవంతునికి నైవేద్యాలు సమర్పిస్తారు. మానవులకు కనపడకుండా భగవంతునికి నివేదించిన ప్రసాదాన్ని స్వీకరిస్తారు. ఆ దివ్యవిమానాన్ని దర్శించి శ్రద్ధతో పూజిస్తారు.

దేవతలు మానవులుగా పుట్టాలని భగవంతుని ప్రార్థిస్తారు. వారికి వేంకటాధీశుడు వెంటనే అభీష్టాలను ప్రసాదిస్తాడు. ఆ దేవదేవుడు స్వల్పంగా ధర్మాన్ని అనుష్ఠించినా సంతుష్టుడై పుత్రులను, భూమిని, భార్యను, ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని, రాజ్యసంపదను అనుగ్రహిస్తాడు. మానవులకు దుర్లభమైన దీర్ఘాయుష్షును, స్వర్గలోక సౌఖ్యాన్ని ప్రసాదిస్తాడు.

శతకోటి జన్మలలో చేసిన పుణ్యంతో కూడా పొంద శక్యం కాని నిత్యవిభూతిని ఆచార్య సమాశ్రయణం ద్వారా ఇస్తాడు. ఆహా! ఆ వేంకటాద్రిలో విష్ణు విలాసం ఎంత విచిత్రమైంది! ఆకాశంలో బ్రహ్మాది దేవతలు విమానాలలో వెడుతూ 'ఆశ్చర్యమాశ్చర్య'మని అంటారు. అదేవిధంగా నేను కూడా మీకు భవిష్యత్తులో జరగబోయే వృత్తాంతాన్ని చెప్పారు.

ఓ మునులారా! కలియుగం రాగానే వేంకటాచలం భూలోకంలో చాలా ప్రసిద్ధమవుతుంది. శ్రీనివాసుడు అక్కడ ఎక్కువగా ఉంటాడు. మ్లేచ్ఛులకు, సంకరజాతులకు, చండాలురకు, కిరాతులకు, పుల్కసులకు, హీనజాతులకు, శూద్రులకు శ్రీనివాసుని యందు భక్తి అధికంగా ఉంటుంది.

వారికి కూడా రమాపతి శీఘ్రంగా అభీష్టాలనిస్తాడు. ఆయన భక్తికి వశుడై అక్కడే నివసిస్తాడు. ఆర్యులు, తురుష్కులు, మాలవ్యులు, గౌడులు, వంగదేశీయులు, కళింగులు, ఆంధ్రులు, కర్నాట దేశీయులు, కోసల దేశ వాసులు, ద్వీపాంతర వాసులు కోట్లమంది మహాభక్తితో వస్తారు. వారంతా తమ తమ అభీష్ట వరాలను పొంది సంతోషిస్తారు.

శ్రీవేంకటాచలం అప్రాకృతమై స్వర్ణసానువులు కలదైనప్పటికీ కలియుగంలో భూమి మీద ప్రాకృతాచలం వలె ఉంటుంది. ఈ కలియుగంలో పరాత్పరుడు లక్ష్మీపతి, సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి అయిన వేంకటేశుని యందు మతాంతరులకు కూడా భక్తి కలుగుతుంది. ఈ విధంగా ఉత్కృష్టమైన భక్తి కలిగి అందరూ పవిత్రులౌతారు. ఒక భక్తుని చూచి మరొకడు ఈ కేశవుని యందు భక్తి కలిగి ఉంటాడు. ఐహిక ఫలాల కోసం భక్తితో సేవించే వారికి వేంకటేశుడు ఆ ఫలా నిస్తాడు. చివరకు వారంతా ఆయన్నే పొందుతారు. వారు ఐహిక పలాలను, అనేక వరాలను కూడా పొందుతారు. కలియుగంలో ఆ శ్రీపతి భూలోకంలో ఈవిధంగా చిత్రవిచిత్రాలు చేస్తూ విహరిస్తాడు.

అందుకనే 'కలియుగమే మంచిది. శూద్రులు, స్త్రీలును మంచివారు. విశేషంగా వేంకటేశ్వరుని సేవించడం మంచి అలంకారం' అని దేవతలు, మునులు చెబుతారు. ఈ కలియుగంలో కలిదోషోపహతులు, పాపకర్ములైన మానవులకు వేంకటేశుని మించిన దైవం లేదు. భూలోకంలో ఆయన తప్ప వేరు దిక్కు లేదు. ఈ భూమండలంలో వేంకటేశునితో సమానమైన దైవం వేరొకరు లేరు. స్వామిపుష్కరిణితో సమానమైన తీర్థం లేదు. కలియుగంలో ఆ వేంకటేశుని చరిత్రను చెప్పటానికి నూరు కల్పాలకు కూడా సాధ్యం కాదు. మంగళకరమైన ఆయన చరిత్రను నేను కొంచెం మీకు చెప్పాను అని సూతమహర్షి శౌనకాదులతో అన్నాడు.

**మహావైరాగ్య సంపన్నుడు, సర్వభూతహితుడు, ఏ ప్రాణియందు వైరం లేని సద్గురువును గొప్ప భక్తి విశ్వాసాలతో ఆశ్రయించాలి. భారాలన్నింటినీ గురువు పాదపద్మాల యందుంచాలి. యథాశక్తి నిత్యనైమిత్తిక కర్మలను నిర్వర్తిస్తూ శ్రీహరియందే మనస్సునుంచి ఇతర మంత్రాలను, సాధనాలను వదలి ద్వయ మంత్రానుష్ఠాన తత్పరుడై మోక్షం పైనే దృష్టి పెట్టాలి.**

## గురుకృప వలన మోక్షప్రాప్తి :

శౌనకాది మునులు సూతమహర్షితో 'ఓ పూజ్యా! సర్వశాస్త్రార్థ విశారదా! వేదవేదాంగపారీణా! గురువులను ఆశ్రయించటం వలననే కదా ఉత్తమగతి లభిస్తుంది. వైష్ణవధర్మం చాలా ఆశ్చర్యకరమైందని పూర్వం మీరు చెప్పారు కదా! ఓ తపోధనా! దానిని మాకు వివరించండి' అని అడిగారు. అప్పుడు సూతమహర్షి 'మహర్షులారా! దానిని సంగ్రహంగా చెబుతాను వినండి' అంటూ ఇలా చెప్పసాగాడు.

పూర్వం వరాహస్వామి భూమి నుద్ధరించినప్పుడు భూదేవి అడుగగా మనోహరమైన వైష్ణవ ధర్మాలను ఆమెకు చెప్పాడు. వ్యాస భగవానుని అనుగ్రహం వలన వాటిని నేను తెలుసుకున్నాను. అవి పరమ రహస్యాలైనా సంగ్రహంగా చెబుతాను. ఆ వైష్ణవ ధర్మాలలో ప్రధానమైనది విశ్వాసమే. భక్తునికి భగవంతుని యందు ఎంత విశ్వాసముంటుందో అంత ఫలితం సిద్ధిస్తుంది.

గురువే పరమ ధర్మం. గురువే పరమ గతి. పరమాత్మ భావనలో ఉండే గురువే శిష్యుడి పాపాన్ని వెంటనే పోగొడతాడు. కావున అన్ని విధాలా గురువునే విశ్వసించాలి. గురువు నాశ్రయించినవాని పాపాన్ని ఆ గురువు పోగొడతాడు. ఆ గురువు పాపాన్ని అతని గురువు పోగొడతాడు.

ఈ విధంగా పరంపరా క్రమంలో విష్ణువు సర్వపాపహరుడైన గురువు. ఆ గురువు కారుణ్యమూర్తి. విష్ణువే జగద్గురువు. సంసార సాగరంలో మునిగిన వారిని గురువు శాస్త్రమనే హస్తంతో ఉద్ధరిస్తాడు. ధర్మాధర్మ వివేకం కలవాడు, న్యాయశాస్త్రవేత్త, తపోనిష్ఠుడు, బ్రహ్మనిష్ఠుడు, తపస్స్వాధ్యాయ నిరతుడు, అహంకార మమకార రహితుడు, శాంతుడు, దాంతుడు, అసూయ లేనివాడు, స్వార్థరహితుడు, పరహితాన్నే తన హితంగా భావించేవాడు, సంసార దావానలానికి భయపడేవాడు, శుచి (పరిశుద్ధుడు), శమదమాది షట్కసంపత్తి కలవాడు, పండితుడు మొదలగు లక్షణాలు కలవానిని 'గురువు' అంటారు.

మహావైరాగ్య సంపన్నుడు, సర్వభూతహితుడు, ఏ ప్రాణియందు వైరం లేని సద్గురువును గొప్ప భక్తి విశ్వాసాలతో ఆశ్రయించాలి. భారాలన్నింటినీ గురువు పాదపద్మాల యందుంచాలి. యథాశక్తి నిత్యనైమిత్తిక కర్మలను నిర్వర్తిస్తూ శ్రీహరియందే మనస్సునుంచి ఇతర మంత్రాలను, సాధనాలను వదలి ద్వయ మంత్రానుష్ఠాన తత్పరుడై మోక్షం పైనే దృష్టి పెట్టాలి.

అష్టాక్షరీ మహామంత్రాన్ని మించిన మంత్రం లేదు. నారాయణుని మించిన దైవం లేదు. ప్రపత్తిని మించిన యోగం లేదని వేదం చెబుతున్నది. ఈ భావంతో ప్రవర్తించేవానికి దేహాంతంలో పరమపదం లభిస్తుంది. ప్రపత్తి పరాయణుడై ఈవిధంగా పరమార్థాన్ని తెలుసుకొని ప్రవర్తించాలి. ధ్యాననిష్ఠుడై, దొరికిన దానిని తింటూ, వైరాగ్యం కలిగి, అహంకార రహితుడై, మనోవాక్కాయాలను జయించి, ఇంద్రియాలను నిగ్రహించి, నిర్జన ప్రదేశంలో ఉంటూ, బలగర్వం లేకుండా, కామ క్రోధాలను వీడి, శాంతుడై, మమకార రహితుడై, దేనినీ పరిగ్రహించకుండా, బ్రహ్మధ్యానం చేసేవాడు దానివలన బ్రాహ్మీ స్థితిని పొందుతాడు.

ఇటువంటి బ్రహ్మభావాన్ని పొందినవానికి మనస్సు ప్రసన్నంగా ఉంటుంది. అతనికి దుఃఖం కాని కోరిక కాని ఉండదు. అతడు సర్వ భూతముల యందు సమదృష్టి కలిగి ఉంటాడు. అతనికి శ్రీహరి యందు భక్తి ఏర్పడుతుంది. ఈ భక్తి వలన భగవంతుని తెలుసుకుంటాడు. భగవత్ తత్త్వాన్ని తెలుసుకోవటం వలన ఆధ్యాత్మిక అనుభవాన్ని పొందుతాడు. అప్పుడతని బుద్ధి ప్రశాంతంగా ఉంటుంది. ఆ తరువాత శబ్దాది విషయాల్లో నిరాసక్తుడై, నిస్సంగుడై విష్ణు సాయుజ్యాన్ని పొందుతాడు.

ప్రపత్తినిష్ఠలో ఉండేవానికి కర్మత్యాగం విహితమైంది (విధింపబడింది). కర్మత్యాగమనగా కర్మలను వదలటం కాదు. అటువంటి త్యాగం అజ్ఞాన జనకమైంది, కర్మల ఫలాన్ని త్యాగం చెయ్యాలని అర్థం. కర్మలు వదిలేవానికి దేహపోషణే జరుగదు. సంగరహితుడై యజ్ఞాది సమస్త కర్మలను ఆచరించాలి. బ్రహ్మదేవుడు ప్రజలతో పాటు యజ్ఞాలను సృష్టించి 'యజ్ఞమే భగవంతునికి ప్రీతి కలిగించే పరమధర్మం. అది సర్వాభీష్టాలను ఇస్తుంది. అదే పరమగతి. కావున ఓ ప్రజలారా! మీరంతా సంగవర్జితులై యజ్ఞాన్ని చేయండి. యజ్ఞాల చేత సంప్రీతుడైన శ్రీహరి సర్వాభీష్టాలను ప్రసాదిస్తాడు' అని చెప్పాడు.

అభీష్ట వరాలను పొంది మరల యజ్ఞం చేయాలి. అలా

**యోగవిదులలో శ్రేష్ఠుడైనవాడు శ్రీహరి యందు సర్వకర్మలను సమర్పించి మమకార రహితుడై, నిత్యతృప్తుడై, భగవద్ధ్యానం చేస్తూ సుఖ దుఃఖాలను – లాభనష్టాలను – జయాపజయాలను – శీతోష్ణాలను – మానావమానాలను సమంగా భావిస్తూ, సర్వవ్యాపకుడైన పరబ్రహ్మను సదా ఆత్మయందు ధ్యానిస్తూ, ప్రాతఃకాలం మొదలుకొని స్వాధ్యాయం, యజ్ఞ యాగాది కర్మలు, యోగాభ్యాసం ఆయా సమయాల్లో చేయాలి. యథాశక్తి నిత్య నైమిత్తిక కర్మలను నిర్వర్తించాలి.**

చేయనివాడు దొంగగా పరిగణించబడతాడు. అతను సర్వకర్మల నుండి బహిష్కరించబడిన వాడు. కావున కర్తవ్య కర్మలను ఫలాపేక్ష లేకుండా, సంగరహితుడై నిర్వర్తించాలి. పూర్వం కొందరు కర్మ వలననే గొప్ప సిద్ధిని పొందారు. భగవత్తత్త్వ నిష్ఠుడైన వానికి ఆయన ఆజ్ఞను ఉల్లంఘించటం మహా దోషం. వేదాలు, స్మృతులు, ధర్మశాస్త్రాలు మొదలైనవన్నీ ఆయన ఆజ్ఞలే. భగవదాజ్ఞానుసారం వర్తించటం అందరికీ ప్రథమ కర్తవ్యం.

యోగవిదులలో శ్రేష్ఠుడైనవాడు శ్రీహరి యందు సర్వకర్మలను సమర్పించి మమకార రహితుడై, నిత్యతృప్తుడై, భగవద్ధ్యానం చేస్తూ సుఖ దుఃఖాలను – లాభనష్టాలను – జయాపజయాలను – శీతోష్ణాలను – మానావమానాలను సమంగా భావిస్తూ, సర్వవ్యాపకుడైన పరబ్రహ్మను సదా ఆత్మయందు ధ్యానిస్తూ, ప్రాతఃకాలం మొదలుకొని స్వాధ్యాయం, యజ్ఞ యాగాది కర్మలు, యోగాభ్యాసం ఆయా సమయాల్లో చేయాలి. యథాశక్తి నిత్య నైమిత్తిక కర్మలను నిర్వర్తించాలి.

వేంకటాద్రిలో తులసివనం నిర్మించటం, స్వామి పూజకు పూలమాలలు కట్టటం, విమానాన్ని అలంకరించటం, ఇంకా భగవంతునికి ప్రీతి కలిగించే ఇతర పనులు చేయాలి. ఉత్సవ సమయంలో భగవంతుని – భక్తులను సేవించటం, యథాశక్తి నైవేద్యం పెట్టడం, భక్తులకు అన్నదానం చేయటం మొదలైన పనులను మనసులో ఎవరినీ ద్వేషించకుండా చేయాలి. శ్రీవేంకటాచలపతికి నివేదించిన జలం, అన్నం వస్త్రం, పూలమాలలు మొదలైన భగవత్ప్రసాద ద్రవ్యంతో శరీరాన్ని పోషించుకుంటూ ఆచార్యుని (గురువు) అనుగ్రహం

వలన పరమగతిని పొందుతారు.

## అష్టాంగయోగం :

పర అపర బ్రహ్మల గురించి తెలుసుకోవాలి. అలాగే క్షరాక్షరుల గురించి తెలుసుకోవాలి. క్షరుడనగా జీవుడు, అక్షరుడనగా పరమాత్మ. సర్వజీవుల రూపంలో ఉన్నవాడు క్షరుడు. కూటస్థుడు అక్షరుడు. అంతటా వ్యాపించిన వాడు, భూతాలన్నింటిలోను అంతరాత్మగా ఉన్న పరబ్రహ్మన్నే పరమాత్మ అంటారు. ఆయన లోకాలన్నింటినీ పోషిస్తున్నారు. భరిస్తున్నాడు. జీవులందరి హృదయాలలో ఉండి నడిపిస్తున్నాడు. అవ్యయుడు, నిత్యుడు సర్వనియంత అయిన ఆయనే పురుషోత్తముడు.

క్షరాన్ని అతిక్రమించటం వలన, అక్షరుని కంటె ఉత్తముడవటం వలన లోకంలో ఆయన పురుషోత్తముడుగా ప్రఖ్యాతి చెందాడు. ఈ విధంగా ఆ పరమ పురుషుణ్ణి గురించి తెలుసుకున్నవాడు ఆ పురుషోత్తముడైన వేంకటేశుని నిశ్చల భక్తితో సర్వవిధాలా సేవిస్తాడు. వేదవిదులలో శ్రేష్ఠుడు, బుద్ధిమంతుడైనవాడు యోగాభ్యాసాన్నారంభించి యమ నియమాలను, ఆసన ప్రాణాయామాలను, ప్రత్యాహారాన్ని, ధారణను, ధ్యానాన్ని, సమాధులను సాధిస్తాడు. యమ నియమాల నుండి ధ్యానం వరకు ఉండే ఏడు దశలు సమాధిని సిద్ధింపచేసే సాధనాలు. సమాధి ఈ ఏడు అంగాలతో కలిసి అష్టాంగ యోగమని చెప్పబడుతున్నది.

ప్రతిరోజూ యోగాభ్యాసం చేయాలి. దీనిని నియమంగా పెట్టుకోవాలి. నిషిద్ధ కార్యాలను చేయకపోవటాన్ని 'యమం' అంటారు. స్వాధ్యాయాన్ని 'నియమం' అంటారు. స్వస్తికాసనం మొదలైనవి 'ఆసనాలు'. 'ప్రాణాయామం' 1. రేచకం 2. పూరకం 3. కుంభకం అని మూడు విధాలు. యోగులు విషయాల నుండి మనస్సును మరలించుటయే 'ప్రత్యాహారం'. ఆత్మయందు మనస్సును నిలపటాన్ని 'ధారణం' అంటారు. తైలధారవలె అవిచ్ఛిన్నంగా ఉండే స్మృతి పరంపరే 'ధ్యానం'. తెలుసుకొనేవాడు, తెలియదగినది అనే భేదజ్ఞానం నశిచంటమే 'ఆత్మ విజ్ఞానం'. ఈ విధంగా జ్ఞాత, జ్ఞేయమనే భేదబుద్ధి నశించిన తరువాత పరమానందజనకమైన చిదాత్మ స్వరూపంలో మనస్సును లయింపచేసే మహాయోగ స్థితినే 'సమాధి' అంటారు.

ఈవిధంగా అష్టాంగ యోగాన్ని అభ్యసిస్తూ మేధావి అయిదు కాలాల్లోనూ ఆయా సమయాల్లో ఆచరించవలసిన విధులను నిర్వర్తించాలి. ప్రతిరోజు సాయంకాలం విచక్షణతో యోగాన్ని అభ్యసించాలి. జనసంచారం లేని ప్రదేశంలో, కీటకాదుల బాధ లేకుండా మృదువైన ఆసనం పైన సుఖంగా కూర్చొని, స్వస్తికాది ఆసనం వేసుకొని, శరీరం – మెడ, శిరస్సు నిటారుగా నిలిపి, నాసికాగ్రంపై దృష్టిని నిలిపి, ఇడా నాడితో వాయువును పీల్చి, కుంభించి, నెమ్మది నెమ్మదిగా నిద్రిస్తున్న కుండలినీ శక్తిని మేల్కొల్పి సుషుమ్నా నాడిలో ప్రవేశ పెట్టాలి.

యోగికి దేహాన్ని వదిలి పెట్టాలని కోరిక కలిగినప్పుడు వేంకటేశ్వరుని స్మరిస్తూ ఓంకారాన్నుచ్చరించాలి. అప్పుడాజీవుడు బ్రహ్మరంధ్రం నుండి బయలు వెడలి అక్షరాది మార్గంలో ప్రవేశించి, పరమపదాన్ని పొందుతాడు. శ్రీవేంకటేశ్వరుని సాయుజ్యాన్ని పొంది చిరకాలం ఆనందాన్ననుభవిస్తాడు.

శ్రీవేంకటేశ్వరుని సేవించాలని బలమైన కోరిక ఉంటే గురూపదేశాన్ని పొంది, స్థిరంగా యోగాన్నభ్యసించాలి. ఇంతకు ముందు చెప్పిన విధంగా వివేకంగా యోగాన్నభ్యసించాలి. ఇంతకు ముందు చెప్పిన విధంగా వివేకంతో యోగాన్నభ్యసించాలి. ఇడా నాడితో వాయువును పూరించి సుషుమ్నలో ప్రవేశపెట్టాలి. జఠరాగ్ని యొక్క తేజస్సుతో హృదయ కమలంలో ప్రవేశించాలి. అక్కడ శంఖ చక్ర గదాధరుడైన భగవంతుని దర్శించి, ఆజ్ఞాచక్రాన్ని దాటి భ్రూమధ్యంలో ప్రవేశించాలి. అక్కడ నీవారధాన్యం కొనవలె సూక్ష్మస్వరూపుడైన శ్రీపతిని దర్శించాలి.

ఆ తరువాత సహస్రపత్ర కమల మధ్యంలో (సహస్రారంలో) చంద్రమండలాన్ని, దాని మధ్యలో అమృతమయుడు, సురాధీశుడైన రమానాథుని దర్శించాలి. ఆయన సంకల్పం వలన చంద్రబింబం నుండి స్రవించే అమృత బిందువుచే తన శరీరం లోపల, బయట, ఆపాదమస్తకం తడపబడినట్లు (వ్యాపించినట్లు) భావించాలి. మరల అదే సుషుమ్నా మార్గంలో నెమ్మదిగా క్రిందికి దిగి ప్రాణాది వాయువులను ఆయా స్థానాల్లో నిలపాలి. ఈ విధంగా ప్రతిరోజుసంధ్యాసమయాల్లోను, అర్ధరాత్రి చేయాలి. క్రమంగా అభ్యసిస్తూ చేతితో ముక్కును మూయకుండగనే వాయు సంచారాన్ని నిరోధించాలి. ధారణ చేయాలి.

శరీరం కంటె ఎక్కువగా పన్నెండు అంగుళాల (కొలత) పరిమాణం గల వాయువును, శరీర పరిమాణంతో సమంగా గాని, అంతకంటె తక్కువగా కాని చేసి ధారణ చేయాలి. ఈ విధంగా యోగాన్ని అభ్యసించిన యోగి వజ్రకాయుడౌతాడు. అతడు వృద్ధాప్యాన్ని, మృత్యువును జయించి, ఆరోగ్యంతో, దృఢకాయంతో, సూర్యచంద్రాదు లున్నంత కాలం చిరంజీవిగా వర్ధిల్లుతారు.



# తొలి ఏకాదశి

– చిల్లర సీతారామారావు

**విష్ణుభగవానునకు అత్యంత ప్రియమైన తిథి ఏకాదశి. ఏకాదశి నాడు చేయు వ్రతమును ఏకాదశి వ్రతము అని అంటారు. భగవంతుడు సదా మా యందు ప్రసన్నుడై ఉండాలని, అనుగ్రహించి మోక్షం ప్రసాదించాలని అభిలషిస్తూ భక్తులు ఏకాదశి వ్రతమును ఆచరిస్తారు.**

వానాకాలంలో వచ్చు మొదటి ఏకాదశిని తొలి ఏకాదశి లేదా పద్మ ఏకాదశి అను పేర్లతో పిలుచుకుంటారు. ఆషాఢమాసమున శుక్లపక్ష ఏకాదశినాడు శ్రీమహావిష్ణువు పాలసముద్రములో నిద్రకు ఉపక్రమిస్తాడు. కనుక ఆ రోజును తొలి ఏకాదశిగా పరిగణిస్తారు. ఏకాదశి ఆవిర్భావ గాథ భవిష్యోత్తర పురాణము నందు వర్ణించబడింది.

పూర్వ ము తాళజంఘుడు అనే రాజు ఉండేవాడు. అతడు దానవుడు. ఆ దానవుడికి ఒక పుత్రుడు ఉన్నాడు. అతడి పేరు మురాసురుడు. వాడు అతి భయంకరుడు. మహా క్రూరుడు. తపము గావించి సంపాదించుకున్న వరముతో దేవతలను పీడించసాగాడు. వారు బాధలతో దుఃఖిస్తుంటే అమితముగా ఆనందించేవాడు. మురాసురుడు పెట్టే బాధలు భరించలేక దేవతలు విష్ణుదేవుడి దగ్గరకు వెళ్ళి తమ బాధలు విన్నవించుకున్నారు. దేవా! మురాసురుడు అన్న దానవుడు మమ్మల్ని అనేక రకాలుగా బాధలు పెడుతున్నాడు. అతడి బాధల్నుండి మమ్మల్ని విముక్తుల్ని గావించండి అని ప్రార్థించారు. వారి ప్రార్థనలకు ప్రసన్నుడైన విష్ణువు వారికి అభయ హస్తమునిచ్చి పంపేశాడు. మహావిష్ణువు మురాసురుడి రాజ్యముపై దాడి చేసి అక్కడి రాక్షసులందరినీ సంహరించాడు. ఈ సంగతి తెలిసి మురాసురుడు వచ్చి మహావిష్ణువుతో తలపడసాగాడు. ఇరువురి మధ్య భీకర యుద్ధం వేయి సంవత్సరములు సాగింది. విష్ణువు మురాసురుడిని సంహరించలేకపోయినాడు. అలసిపోయి సింహవతి యను గుహలోకి వెళ్ళి సేద తీరసాగాడు. సేద

తీరుతూనే నిద్రలోకి వెళ్ళిపోయాడు. విష్ణువు దేహం నుండి ఒక కన్య ఉద్భవించింది. మురాసురుడు విష్ణువును అన్వేషిస్తూ గుహలోనికి వచ్చాడు. మురాసురుడిని చూస్తూనే ఆ కన్య అతడితో తలపడి అతడిని సంహరించింది. విష్ణుమూర్తి నిద్రనుండి లేచి చూచుసరికి ఒక ప్రక్కన మురాసురుడు పడి వుండటం, మరొక ప్రక్క కన్య కనిపించారు. కన్యను చూచి ఆశ్చర్యపోయాడు విష్ణువు. ఆ కన్య జరిగిందంతా వివరించింది విష్ణువుకు. మురాసురుని సంహరించిన కన్యను విష్ణువు ప్రశంసించి వరమును కోరుకోమని అడిగాడు. ఆ కన్య విష్ణువుతో ఇలా అంది. దేవా మీ దేహము నుండి ఏకాదశి నాడు ఉద్భవించాను కనుక నాకు ఏకాదశి యని నామకరణము గావించండి. నాకు మూడు వరములను ప్రసాదించండి. సర్వకాలములందు నేను మీకు ప్రియురాలుగా ఉండునట్లు మొదటి వరమును, సర్వ తిథులయందు ముఖ్యమైన తిథిగా పూజింపబడునట్లు రెండవ వరమును, భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో ఏకాదశి వ్రతమును ఆచరించువారు భవబంధముల నుండి తరించేటట్లు మూడవ వరమును ప్రసాదించండి అన్నది. విష్ణువు ఆ కన్య అడిగిన మూడు వరములను ప్రసాదించాడు. ఆ నాటినుండి ఏకాదశి వ్రతమును భక్తి శ్రద్ధలతో ఆచరించువారు సమస్త పాపముల నుండి విముక్తులై విష్ణులోకమును పొందెదరు అను ప్రశస్తి ఏర్పడింది.

ఏకాదశి వ్రతమును ఆచరించు వారికి కొన్ని నియమములను ఏర్పాటు చేశారు. మనస్సును నిర్మలంగా ఉంచుకోవాలి. ఇంద్రియ నిగ్రహమును పాటించాలి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను త్యజించాలి. ఆత్మస్తుతి, పరనింద పనికిరాదు. తాంబూలసేవనం గావించరాదు. పగటి సమయమున నిద్రించరాదు. పదకొండవ ఇంద్రియము మనస్సు. అది స్వభావము బట్టి ఉభయాత్మకము అనగా జ్ఞానేంద్రియము, కర్మేంద్రియములు రెండింటికి చెందినట్టిది. ఈ మనస్సును జయించినచో పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు కూడా స్వాధీనములోనే ఉండునని ఈ క్రింది శ్లోకము ద్వారా తెలియుచున్నది.

**శ్లో ॥ "ఏకాదశం మనోజ్ఞేయం, స్వగుణే నోభయాత్మకం**
**యస్మన్ జితే జితావేత్వా, ద్విగుణే పంచకౌగణే"**

**(మనుస్మృతి అ.2 – శ్లో.92)**

ఏకాదశి నాడు వ్రతమాచరించుకొనుటకు సంకల్పించుకున్నవారు వేకువ జామునే లేచి స్నానాదికములను ముగించుకోవాలి. పిదప విష్ణువును ప్రార్థించాలి.

**శ్లో ॥ "ఏకాదశ్యాం నిరాహారస్థిత్వా ద్యాహం పరేఽహని**
**భోక్ష్యామి పుండరీకాక్ష శరణం మే భవాచ్యుత"**

కమల నయనా! అచ్యుతా! నేను ఏకాదశి తిథినాడు నిరాహారముగ నుండి ద్వాదశి తిథినాడు భోజనము చేయగలవాడను. మీరే నాకు రక్షకులు అని పలికి ప్రణామము చేయాలి. పూజా మందిరమున ఒక వేదికను ఏర్పాటు చేసుకోవాలి. ఆ వేదిక మీద విష్ణుభగవానుడి ప్రతిమను ఉంచాలి. షోడశోపచారములతో, అష్టోత్తరములతో, పుష్పములతో పూజించాలి. పంచామృతముతో అభిషేకించాలి. అరటిపండ్లు, పాయసం మున్నగునవి నైవేద్యం పెట్టాలి. ఆరోజు పగలంతా ఉపవాసముండాలి. రాత్రి సమయమున జాగరణ చేస్తూ విష్ణు సహస్రనామము, విష్ణుపురాణము, భగవద్గీత, భాగవతము మున్నగు ఆధ్యాత్మిక గ్రంథములను పఠించాలి. ద్వాదశి తిథి యందు భోజనములు చేయాలి. ఈవిధముగా ఏకాదశి వ్రతమును ఆచరించు భక్తులు వైకుంఠ ప్రాప్తిని పొందగలరు. వ్రతము చివరన వ్రత కథను వినాలి. తొలి ఏకాదశి వ్రతమునకు సంబంధించి ఒక కథ ఉంది.

పూర్వము మాంధాత అనే ఒక రాజు ఉండెడివాడు. అతడు ధర్మజ్ఞుడు. ధర్మానుసారము ప్రజానురంజకముగా పరిపాలన సాగిస్తుండేవాడు. ప్రజలు ధనధాన్యాదులతో, సుఖ సౌభాగ్యములతో తులతూగు తుండెడివారు. అకస్మాత్తుగా వర్షములు కురవడం మానేశాయి. అలా 3 సంవత్సరములు క్రమంగా కురవడం మానేశాయి. ప్రజలు పంటలు లేక, తినడానికి ఆహారము దొరకక విల విల లాడసాగారు. రాజుగారి దగ్గరకు వెళ్ళి తమ గోడును వెళ్ళబోసుకున్నారు. రాజా! వర్షములు పడకపోవడం చేత పంటపొలాలు నాశనమయ్యాయి. ఆహార లేమితో మేమెన్నో అష్టకష్టాలు పడుచున్నాము. ఈ కష్టముల నుండి ధర్మప్రభువులైన మీరే మమ్మల్ని కాపాడాలి అని వేడుకున్నారు. ప్రజలారా! మీరు చెప్పింది వాస్తవం. వర్షములు కురిస్తేనే కదా పంటలు పండేది. మీ ఆకలి బాధలు తీరేది. ఇలా ఎందుకు జరుగుతున్నదో ఆలోచిస్తాను. దీనికి నివారణోపాయమును అన్వేషిస్తాను అని అభయమిచ్చి ప్రజలను పంపించివేశాడు. పిదప వనములకు వెళ్ళి అంగీరస మహర్షి దర్శనం చేసుకున్నాడు. రాజా! మీరు మా ఆశ్రమమునకు విచ్చేయుటకు కారణమేమి? అని ప్రశ్నించాడు మహర్షి. నేను తమ వద్ద ఒక సందేహము నివృత్తి గావించుకుందామని వచ్చాను. నేను ధర్మయుక్తము గానే పరిపాలన కొనసాగిస్తున్నాను. మూడు సంవత్సరముల



నుండి వానలు పడక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలు పండక, ఆహార లేమి మున్నగు వాటిని ప్రజలు ఎదుర్కోవలసి వస్తోంది. నాకు తెలియకుండా నేను అధర్మ పాలన కొనసాగిస్తున్నానా? ఎందుకంటే రాజు చేసిన పాప ఫలితమును ప్రజలు అనుభవిస్తారని శాస్త్రములు తెలియజేస్తున్నాయి. నేను ధర్మమును పాటిస్తూ రాజ్యమును పరిపాలిస్తున్నప్పుడు ఈ దుర్భర పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయో నాకు అర్థం కావడం లేదు. నా సందేహమును నివృత్తి గావించుకోవటం కోసం మీ దర్శనం చేసుకున్నాను. దయచేసి నా సందేహమును నివృత్తి గావించవలసిందిగా ప్రార్థిస్తున్నాను. ప్రజల కష్టములు దూరమవడానికి మంచి ఉపాయము తెలియజేయండి అని బదులు ఇచ్చాడు మాంధాత మహారాజు. అంగీరస మహర్షి సమాధానమిస్తూ – రాజా! యుగములలో మహోన్నతమైనది సత్య యుగము. ఈ యుగములో ధర్మము 4 పాదముల మీద నడుస్తుంది. బ్రహ్మను అందరూ ఆరాధిస్తారు. యజ్ఞ యాగాదులు నిర్వహించడం, వేదాధ్యయనం గావించడం, బోధించడం మున్నగు కార్యక్రమములు బ్రాహ్మణులకు విధించబడినాయి. కాని శాస్త్ర విరుద్ధముగా ఒక శూద్రుడు తపము గావించుచున్నాడు. ఈ దోషము కారణము గానే మీ రాజ్యమున వర్షములు పడటం లేదు. ఆ శూద్రుడిని వధించినచో మీ కష్టములన్నీ దూరమవుతాయి. మీ ప్రజలు సుఖశాంతులతో జీవిస్తారు అని పలికాడు. మహర్షి పలుకులకు రాజు – మహర్షీ! ఆ శూద్రుడు నిరపరాధి. తన దోవన తాను తపము గావించుకుంటున్నాడు. ఆ నిరపరాధిని చంపడం న్యాయమా? ఈ అన్యాయమును నేను చేయజాలను. మరొక ఉపాయము ఏదైనా తెలియజేయండి అని పలికాడు. రాజా! నీకు మరొక సలహా ఇస్తాను వినుము. ఆషాఢమాసమున శుక్లపక్షమున వచ్చు తొలి ఏకాదశి లేదా పద్మ ఏకాదశి వ్రతమును నియమ నిష్ఠలతో, భక్తి శ్రద్ధలతో ఆచరింపుము. ఆ వ్రత ప్రభావము వలన మీ రాజ్యములో వర్షములు కురుస్తాయి. పంటలు పండుతాయి. ప్రజలు ఆనందముతో, సుఖశాంతులతో జీవిస్తారు. ఈ వ్రతమునకు సమస్త ఉపద్రవములను నాశనము గావించు శక్తి ఉన్నది. కనుక మీరు, మీ ప్రజలు అందరూ కలిసి తొలి ఏకాదశి వ్రతమును ఆచరించండి అని సమాధానమిచ్చాడు. మహర్షి వచనానుసారము మాంధాత తన రాజ్యమునకు వచ్చి ప్రజలకు అంతా వివరించి తానూ, ప్రజలు అందరూ కలిసి తొలి ఏకాదశి వ్రతమును ఆచరించారు. తత్ఫలితముగా వానలు కురిశాయి. పంటలు పండాయి. ప్రజలంతా ఆనందోత్సాహాలతో జీవించసాగారు.

భగవంతుని యందు విశ్వాసమున్న వారందరూ ఆచరించవలసిన వ్రతము తొలి ఏకాదశి వ్రతము. ఈ వ్రతమును ఆచరించినవారు ఇహలోకములో సుఖశాంతులు, పరలోకములో ముక్తిని పొందగలరు.

❊ ❊ ❊

ధారావాహికం

# ముకుందమాల

భువనేశ్వరి మారేపల్లి (9550241921)

## ఏడవ శ్లోకం

**కృష్ణ త్వదీయ పదపంకజ పంజరాంత**
**అద్యైవ మే విశతు మానస రాజహంసః ।**
**ప్రాణప్రయాణసమయే కఫవాతపిత్తైః**
**కంఠావరోధనవిధౌ స్మరణం కుతస్తే ॥**

'హే కృష్ణా! నీ పాదపద్మాలు అనే పంజరంలో నా మనసు అనే రాజహంస ఇప్పుడే ప్రవేశించు గాక! ఎందుకంటే, ప్రాణ ప్రయాణ సమయంలో కఫ, వాత, పిత్తములు ప్రకోపించి గొంతుకు అడ్డుపడితే నిన్ను ఎలా స్మరించగలను?' అని ముకుందమాల స్తోత్రంలో మహాభక్త కవి శ్రీకులశేఖరాళ్వారులు ప్రార్థించారు.

అసలు మనసు ఎక్కడ నిలవాలో అర్థం చేసుకోవాలి. డబ్బు మీదా! పేరు మీదా! పదవుల మీదా! ఐహిక సుఖభోగాల మీదా! ఒక్క భగవంతుడి మీద తప్ప వీటన్నిటి మీదా మనసును ప్రయత్న పూర్వకంగా నిలపవలసిన పనే లేదు. దానంతట అదే నిలుస్తుంది. పైగా అక్కడినుంచి కదలనని మొరాయిస్తుంది. చిత్రమేమంటే ఇవన్నీ అశాశ్వతాలే! అశాశ్వతాలన్న విషయం కూడా మనసుకు తెలుసు! కానీ, వాటియందు రమించడం మాత్రం మానుకోనంటుంది. అదే మనసు లక్షణం. మొత్తమ్మీద మనసు ఎక్కడో కాకుండా కృష్ణుడి మీదే అంటే, భగవంతుడి మీద నిలపవలసి ఉన్నదని స్పష్టమవుతున్నది. ముందు మనం దాన్ని నిశ్చలంగా తయారు చేసుకోవాలి. కానీ, మనసుకు హడావుడి పడటం, ఆరాటపడటం అలవాటు చేస్తున్నాం. 'ఏదైతే ఏముందిలే!' అని నేర్పలేదు. ఆశలు మానుకోవడం నేర్పలేదు. ఇక అది నిశ్చలంగా ఎలా తయారవుతుంది?

'మనసును నిశ్చలంగా ఉంచితే అది నిన్ను భగవంతుడి వైపు తీసుకుపోతుంది. లేదంటే నిన్ను భ్రమలోనే ముంచేస్తుంది' అంటారు ఆదిశంకరాచార్యులు. ఇప్పుడు జరుగుతున్నది అదే! ఏదేమైనా శ్రీకృష్ణుడి పాదపద్మాలపై స్థిరంగా లగ్నమైన మనసును ఏ ప్రలోభాలూ ఆకర్షించలేవు. లగ్నం కాకపోతే ఏం జరుగుతుంది? ఎన్నో రకాల వాటికోసం ఆరాటపడి పరుగులు తీస్తూ ఉంటుంది. అలా పరుగులు తీస్తున్నదంటే, కృష్ణుడి పాదాల చెంత స్థిరత్వం లభించలేదన్న మాట. అలాంటప్పుడు తక్కినవెన్నో ఆకర్షిస్తూ ఉంటాయి. కానీ, ఉన్నదొక్కటే అని భావించాలి. అదే భగవంతుడు. ఎన్నో ఎన్నో మరెన్నో జన్మలు గడుస్తూనే ఉంటాయి. పునరపిజననం– పునరపిమరణం అంటే ఇదే! కానీ, ఒక్కటే అని స్థిరంగా నిశ్చయించుకుంటే...ఒక్క జన్మలోనే అంతా అయిపోతుంది.

భగవంతుడి నామం స్మరించమని చెప్తే, దానికి ఇంకా చాలా సమయం ఉందంటారు. ప్రాణం పోయే సమయంలో భగవన్నామం స్మరించవచ్చులే అని భావిస్తారు చాలామంది. అయితే, ప్రాణం పోయే సమయంలో దైవనామ స్మరణ మనం అనుకున్నంత తేలికకాదు. అప్పుడు ప్రాణాలమీద ఎక్కడలేని ప్రీతి పుట్టుకొస్తుంది. ప్రాణాలు పోకుండా ఎలా నిలబడతాయో అన్నదే ప్రధాన చింత అవుతుంది. దాన్ని పక్కకు తప్పిస్తేకదా భగవన్నామ స్మరణం! ఇంతకుముందు ఎంతో కొంత సాధన చేసి ఉంటే తప్ప మృత్యు ఘడియలో భగవంతుడు గుర్తుకు రాడు. అందుకే కులశేఖరుడు 'అద్యైవ–ఇదిగో ఇప్పుడే, ఇప్పుడే శీఘ్రంగా, అంటే అంతా సవ్యంగా ఉన్నప్పుడే, హే కృష్ణా! నీ పాదపద్మాలనే పంజరంలో నా మానసమనే రాజహంసను ప్రవేశించనివ్వు' అని కోరుకోవాలన్నాడు. అదీ ఆ మహానుభావుడి దివ్యమైన ఆకాంక్ష. చిట్టచివరి దశలో మనోవాక్కాయాలేవీ మనమాట పట్టించుకోవు కదా! అందుకని ఆ మహాభక్తుడి ఆకాంక్ష మన ఆకాంక్ష కావలసి ఉన్నది.

అదేవిధంగా మరో ముగ్గురు కవులు, ముగ్గురూ భక్తిసామ్రాట్టులే, ముగ్గురూ భగవంతుని పరిపరి విధాలుగా స్తోత్రం చేసినవారే. ముగ్గురూ మూడు శతాబ్దాలకు చెందినవారు. కానీ ముగ్గురూ భక్తి భగవన్నామ స్మరణ విషయంలో ఒకేలా స్పందించారు.

**కృష్ణ! త్వదీయ పదపంకజ పంజరాన్త**
**--------------------**
**కంఠావరోధన విధౌ స్మరణం కుతస్తే॥**

ఓ కృష్ణా! నా మనస్సనెడి రాజహంస యిపుడే నీ పాదపద్మములనెడి పంజరమును ప్రవేశించుగాక అని

ముకుంద మాలలో కులశేఖరులు శ్రీకృష్ణ పరమాత్మని ఉద్దేశించి చెప్పుకున్న శ్లోకం ఇప్పుడు మనం చెప్పుకుంటున్న శ్లోకం ఇది.

దీనినే భక్త రామదాసు గారు తన దాశరథీ శతకంలో చెప్పారు.

**ముప్పునఁ గాలకింకరులు ముంగిటవచ్చిన వేళ, రోగముల్**
**గొప్పరమైనచోఁ గఫము కుత్తుక నిండినవేళ, బాంధవుల్**
**గప్పినవేళ, మీ స్మరణ గల్గునొ గల్గదొ, నాటికిప్పడే**
**తప్పకచేతుమీ భజన దాశరథీ కరుణాపయోనిధీ!**

ఇదే భావాన్ని నరసింహశతకకర్త కూడా తన పద్యంలోచెప్పారు.

బ్రతికినన్నాళ్ళు నీ భజన తప్పను గాని, మరణ కాలము నందు మఱతునేమో?


**య వేళ యమదూతలాగ్రహంబునవచ్చి**
**ప్రాణముల్పెకలించిపట్టునపుడు**
**కఫవాతపైత్యముల్ కప్పగాభ్రమచేత గంపముద్భవమంది, కష్టపడుచు**
**నా జిహ్వతో నిన్ను నారాయణా! యంచుపిలుతు నోశ్రమ చేత పిలవలేనో?**
**నాటికిపుడే చేసెద నామభజన దలచెదను జేరి వినవయ్య! ధైర్యముగను!**
**భూషణ వికాస! శ్రీధర్మపురినివాస! దుష్టసంహార! నరసింహదురితదూర!**

ఈ రెండు పద్యాల భావం కూడా ఇదే. స్వామీ చివరి రోజులలో నీ నామస్మరణ చేసుకోగలమో లేమో! ఆ రోజున ఎన్ని అడ్డంకులు వస్తాయో! ఆరోగ్యం సహకరించదు. అందుకు ఈ రొజే నీ నామస్మరణ చేసుకుంటాము.చెవినొడ్డి వినవయ్యా అని.

భక్తి కలిగిన హృదయాలు అలా మాట్లాడాయి.

ఓ కృష్ణా! ఈ క్షణమే నా మానస రాజహంస నీ పాదపద్మ తూళ్ళ వలయందు ప్రవేశించు గాక. మరణ సమయమున గొంతు కఫ వాత పిత్తములతో పూడుకుపోయినప్పుడు నిన్ను స్మరించుట నాకెట్లు సాధ్యపాడగలదు? నిజమే కదా –

అసలు మరణంఎప్పుడొస్తుందోతెలియదు. తెలిసిన మరణ సమయమున ఏ అనారోగ్యం చేతనయినను కృష్ణుడిని తలచుకోలేక పోవచ్చు, తలుచుకోవాలన్న జ్ఞాపకం కూడా రాకపోవచ్చు. అంతవరకు జీవించిన కాలంలో స్మరణలో లేనిది ఆ క్షణంలో స్ఫురణకు ఎలా వస్తుంది? ఊహు.... రాదుగాక రాదు. అందుకే అంతా సవ్యంగా ఉన్నప్పుడే భగవంతుని పాదారవిందాలను పట్టుకోవాలి. అలాగే



"గౌరాంగుడు" నిరంతరం స్వామివారిని దర్శిస్తూ... సేవిస్తూ... కీర్తిస్తూ తరించాడు. ఎందరి భక్తుల మనసులనో జయించి కృష్ణ చైతన్య మార్గంలో నడిపించాడు.

భగవత్ప్రాప్తికి మాత్రం శాస్త్రం సర్వ మానవాళిని ఉద్దేశించి ఇచ్చిన మహౌషధం. భగవన్నామకీర్తన, నామకీర్తనకు ఏ విశేష ప్రక్రియ కూడా అవసరం లేదు. ఏ దశలో ఉన్నా ఎక్కడ ఉన్నా, ఏ సమయంలో నైనా భగవన్నామాన్ని కీర్తించుకోవచ్చు. మనకు అత్యంత ఇష్టం కలిగిన భగవానుని ఏ మూర్తినైనా ధ్యానం చేస్తూ, నామాన్ని కీర్తిస్తూ, భగవానుని గుణాలను గానం చేస్తూ భగవంతుని లీలలు వింటూ... ఏ విధంగానైనా సరే శరీరం, ప్రాణం, ఇంద్రియాలు, మనస్సు అన్నీ భగవంతుని పరం కావాలి.

"శ్రీకృష్ణుడు పరమసత్యం; కృష్ణుడు అన్ని శక్తులను కలిగి ఉన్నాడు; శ్రీకృష్ణుడే అన్నింటికి మూలం; ఆత్మ (ఆత్మ) భగవంతుని యొక్క ఒక భాగం; ఆత్మలు భౌతిక రూపంలో పదార్థాన్ని ప్రభావితం చేస్తాయి; ఆత్మలు విముక్తస్థితిలో పదార్థంచే ప్రభావితం చేయబడవు; ఆత్మ భిన్నమైనది మరియు పరమాత్మతో సమానంగా ఉంటుంది; ఆత్మ స్వచ్ఛమైన భక్తిని ఆచరిస్తుంది; కృష్ణుని ప్రేమను పొందడం అంతిమ లక్ష్యం; శ్రీకృష్ణునిచే మాత్రమే పొందవలసిన వరం" అని చైతన్యమహాప్రభు తన బోధనల ద్వారా తెలియచెప్పారు.

చైతన్య మహాప్రభు 15వ శతాబ్దానికి చెందిన వైదిక

ఆధ్యాత్మిక నా యకుడు, ఆయన అనుచరులచే శ్రీకృష్ణుని అవతారంగా పరిగణించబడుతుంది. చైతన్య గౌడియ వైష్ణవాన్ని స్థాపించాడు, ఇది వైష్ణవాన్ని లేదా పరమాత్మగా విష్ణువును ఆరాధించే మతపరమైన ఉద్యమం. గౌడీయ వైష్ణవమతం భక్తియోగం అంతిమ సత్యాన్ని గ్రహించడానికి ఒక పద్ధతిగా బోధిస్తుంది. చైతన్య మహాప్రభు 'మహామంత్రం' లేదా 'హరే కృష్ణ మంత్రం'ని ప్రాచుర్యంలోకి తెచ్చారు. అతను చేసిన సంస్కృతంలో ఎనిమిది శ్లోకాల ప్రార్థనను 'శిక్షాష్టకం' అని కూడా పిలుస్తారు.

వల్లభాచార్యుని సమకాలికుడైన చైతన్యమహాప్రభు రాధాకృష్ణ సంప్రదాయాన్ని పరాకాష్ఠకు తీసుకువెళ్ళిన ఒక మహాభక్తుడు. ఇతని జీవిత కాలం ఫిబ్రవరి 18, 1486 – జూన్ 14, 1534) జన్మస్థలం నవద్వీపం (ఇప్పటి నదియా). వల్లభుడు మథుర, బృందావన ప్రాంతాలలో రాధాకృష్ణ మతాన్ని ప్రచారం చేస్తున్న కాలంలోనే చైతన్యుడు బెంగాల్, ఒడిషాలలో అదే మతాన్ని ప్రచారం చేశాడు.

"శ్రీచైతన్యమహాప్రభువు" బెంగాల్లోని నవద్వీపములోని శ్రీధామ మాయాపురములో క్రీ.శ. 1407 శతాబ్దమున (క్రీస్తు కాలమాన ప్రకారము ఫిబ్రవరి 1486 సంవత్సరమున) ఫాల్గుణ పౌర్ణమి సంధ్యా సమయమున అవతరించిరి. ఆ సమయమున నవద్వీప ప్రాంతము విద్యా సంస్కృతులకు కేంద్రమై ఉన్నందున ఆయన విద్యార్థిగా నవద్వీపమునకు చేరిరి. నవద్వీపములోని గొప్పవిద్వాంసులైన శ్రీ నీలాంబరి చక్రవర్తి యొక్క తనయ శచీదేవిని వివాహము చేసికొనిన తరువాత జగన్నాథ మిశ్రులు గంగా తటమునందు తమ నివాసమేర్పరుచుకొనిరి. జగన్నాథ మిశ్రుడు తన భార్యయైన శ్రీమతి శచీదేవి ద్వారా పలువురు పుత్రికలను పొందినను వారిలో దాదాపు అందరు పసివయస్సులలోనే మరణించిరి. చివరికి మిగిలిన శ్రీవిశ్వరూపుడు, విశ్వంభరుడను పుత్రుల వలననే పితృప్రేమను చూపుటకు వారికి అవకాశము కలిగినది. తొమ్మిదవ సంతానంగా జన్మించిన విశ్వరూపుడు చిన్నతనంలోనే సన్యాసం స్వీకరించి దక్షిణానికి వెళ్ళిపోయాడు. ఆఖరి సంతానం చైతన్యుడు. అతనికితల్లిదండ్రులుపెట్టినపేరువిశ్వంభరుడు. తెల్లగా మెరిసిపోతూ ఎంతో అందంగా ఉన్నందున అతడిని “గౌరాంగుడు” అని పిలిచేవారు. ఇదికాక ఇతడితోటి పిల్లలు "నిమాయి" అని పిలిచేవారు. సన్యాసం స్వీకరించిన తర్వాతనే "శ్రీకృష్ణచైతన్యుడు", "శ్రీచైతన్య మహాప్రభువు"గా పేరు వచ్చింది.

గౌరాంగుడు చిన్నతనంలోనే సకల శాస్త్రాలూ, పురాణేతిహాసాలూ చదివి మహాపండితుడయ్యాడు. తర్కం, వ్యాకరణం అతని అభిమాన విషయాలు. 16వ ఏటనే నవద్వీపంలో అతడు పాఠశాల స్థాపించి, వందలాది విద్యార్థులకు తర్క, వ్యాకరణాలు బోధించాడు. సంస్కృతంలో ఒక వ్యాకరణగ్రంథం కూడా రచించాడు. గౌరాంగుని 11వ ఏట తండ్రి చనిపోవడం జరిగింది. ఆయన శ్రాద్ధకర్మలను నిర్వర్తించడానికి తన 23వ ఏట గౌరాంగుడు ఒకసారి గయ వెళ్ళాడు. అక్కడ ఒక విష్ణ్వాలయంలో పూజలు చేస్తుండగా అతని హృదయం భగవంతుని పట్ల అపార భక్తిభావంతో తన్మయుడైపోయాడు. ఆ స్థితిలో అతడిని చూసిన ఈశ్వరపురి అనే సాధువు అతడు మహాభక్తుడు కాగలడని తలచి కృష్ణమంత్రోపదేశం చేసాడు.

గయ నుండి నవద్వీపం తిరిగివచ్చిన గౌరాంగుడు పాఠశాలను మూసివేసి, నిరంతర కృష్ణ ధ్యానంలో, కృష్ణ సంకీర్తనంలో మునిగిపోయాడు. కృష్ణభక్తి రోజురోజుకి పెరిగిపోతుండగా ఇక భరించలేక సాంసారిక జీవనాన్ని విడనాడి,తన 25వయేట భార్యకు,నవద్వీపప్రజలకు వీడ్కోలు పలికి కేశవభారతి అనే సన్యాసి దగ్గర సన్యాసాశ్రమాన్ని స్వీకరించాడు. కొంతకాలం జగన్నాథక్షేత్రమైన పూరీలోనూ, కొంతకాలం బృందావనంలోనూ నివసించాడు. అతడికి తరచుగా తన్మయస్థితి కలిగేది. చివరి 12 ఏళ్ళు సగం సమాధిస్థితిలోను, సగం జాగ్రదావస్థలోను గడిపాడు. సమాధిలో ఉండగా కృష్ణ సంయోగ సుఖాన్ని, జాగ్రదావస్థలో కృష్ణ వియోగ వేదనలోని సుఖాన్ని అనుభవించేవాడు.

చైతన్యుడు ఒక ప్రత్యేక మతాన్ని, సిద్ధాంతాన్ని స్థాపించకపోయినా అతని శిష్యులు తర్వాతి కాలంలో బ్రహ్మసూత్రాలకు అతని దృష్టినుంచి భాష్యంతో పాటు, అతని సిద్ధాంతాలకు విస్పష్టరూపం ఇచ్చి అనేక గ్రంథాలు వ్రాసారు. చైతన్య మతానికి అవి ప్రామాణికాలు. చైతన్యుడి శిష్యులలో రూపగోస్వామి, సనాతన గోస్వామి, జీవగోస్వామి ప్రముఖులు. రూపగోస్వామి "భక్తిరసామృత సింధువు", "ఉజ్జ్వల నీలమణి" అనేగ్రంథాలు, సనాతనగోస్వామి "వైష్ణవతోషిణి", జీవగోస్వామి "సత్సందర్భం", "భాగవతటీక", "భక్తిసిద్ధాంతం", "ఉపదేశామృతం" అనేగ్రంథాలు వ్రాసారు.

చైతన్యుడు 1534, జూన్ 14న తన 48వ ఏట జగన్నాథాలయంలో పూజ నిమిత్తం తలుపులు తెరుచుకుని లోనికి వెళ్ళినవాడు వెళ్ళినట్టే మహాప్రస్థానం చెందాడని ఒక కథనం. నదిలో స్నానం చేస్తుండగా అతడిని మామూలుగా ఆవరించే భగవత్తన్మయత్వంలో ఆ నీటిలో

మునిగి పోయి తనువు చాలించాడని మరొక కథనం. చైతన్య సంప్రదాయానికి చెందిన వేదాంతాన్ని అచింత్య భేదాభేదవాదం అని అంటారు. మతపరంగా దానికి గౌడీయ వైష్ణవం అని కూడాపేరు.

చైతన్యుడి జ్ఞానమీమాంస, ధార్మిక బోధనలు పది వున్నాయి. వీటినే "దశమూల బోధనలు" అని వ్యవహరిస్తారు. అవి...

1) ధార్మికగ్రంథాలు అయినటువంటి భగవద్గీత, శ్రీమద్భాగవతం, గ్రంథాల ఆధారంగా క్రింది తొమ్మిది సత్యాలు స్థాపించబడినవి;

2) శ్రీకృష్ణుడు "మహా", "అనంత",“సత్యం”.

3) శ్రీకృష్ణుడు దివ్యశక్తి (transcendental), జీవశక్తి (living entities), భౌతిక (material nature) శక్తులకు మూలము.

4) కృష్ణుడు రససముద్రుడు.

5) జీవులన్నిటికీ మూలవస్తువు కృష్ణుడే.

6) కొన్నిజీవులు భౌతికశక్తుల ప్రభావాలకు లోనవుతాయి.

7) ఇతరజీవుల దివ్యశక్తులు, భౌతిక విధానాలకూ, శక్తులకు అతీతంగా వుంటాయి.

8) జీవులు, భౌతికపరమయిన ప్రకృతి అచింత్యభేద అభేద, ఒకదానికొకటి అంతర్భాగమైనప్పటికీ, శ్రీకృష్ణుడి అంతర్భాగాలు కావు.

9) భక్తి లేదా కృష్ణుడిపట్ల పరిపూర్ణభక్తి మాత్రమే ముక్తికిమార్గము.

10) శ్రీకృష్ణుడి పట్ల ప్రేమ అత్యున్నత లక్ష్యం.

శ్రీచైతన్య మహాప్రభువు తమ దివ్యలీలలను నలుబది ఎనిమిది సంవత్సరముల కాలము ప్రదర్శించిన పిమ్మట 1455శతాబ్దమునపూరీజగన్నాథక్షేత్రములోఅంతర్ధానము చెందిరి. శ్రీచైతన్య మహాప్రభువు తొలి ఇరువదినాలుగు సంవత్సరములు నవద్వీపమున బ్రహ్మచర్యాశ్రమమును, గృహస్థజీవనమును గడిపిరి. ఆయన తొలిభార్య శ్రీమతి లక్ష్మీప్రియాదేవి. కార్యార్థమై శ్రీచైతన్యమహాప్రభువు ఇంటి నుండి వెళ్ళినప్పుడు చిన్నవయస్సులోనే ఆమె దేహమును త్యజించిరి. శ్రీచైతన్యమహాప్రభువు తూర్పుబెంగాల్ నుండి తిరిగివచ్చిన తరువాత రెండవభార్యను స్వీకరింపుమని తల్లి అర్థించగా దానికి ఆయన అంగీకరించిరి. ఈ ప్రభువు రెండవభార్య శ్రీమతి విష్ణుప్రియాదేవి. శ్రీచైతన్య మహాప్రభువు ఇరువదినాలుగవ యేటనే సన్యాసమును స్వీకరించిన కారణముగా ఆవిడ తన జీవితమునంతయు ఆయన వియోగముననే గడిపినది.

మహాప్రభువు సన్యాసమును స్వీకరించు సమయమునకు ఆమె వయస్సు కేవలము 14 సం.లు. సన్యాసమును స్వీకరించిన పిమ్మట మహాప్రభువు తన తల్లియైన శ్రీమతి శచీదేవి కోరికపై పూరీ జగన్నాథమును తన కేంద్రనివాస స్థానముగా చేసికొనిరి. ఆ పూరీక్షేత్రమున ఆయన ఇరువది నాలుగేండ్ల కాలమును గడిపిరి. ఆ ఇరువది నాలుగేండ్ల సమయములో ఆరు సంవత్సరములు ఆయన శ్రీమద్భాగవతమును ఉపదేశించుచు దేశమంతట ముఖ్యముగా దక్షిణ భారతదేశమున పర్యటించిరి. శ్రీచైతన్య మహాప్రభువు శ్రీమద్భాగవతమునే కాకుండా గీతోపదేశములను కూడా ఆచరణీయ పద్ధతిలో ప్రచారము చేసిరి. శ్రీకృష్ణుడు దేవదేవునిగా భగవద్గీత యందు వర్ణింపబడినాడు.

శ్రీచైతన్య మహాప్రభువు స్వయముగా శ్రీకృష్ణభగవానుడే. ఈకలియుగమున ఈమారు శ్రీకృష్ణభగవానుడు మహాభక్తుని రూపమున అవతరించి యుండెను. ఆదిదేవుడును, సర్వకారణ కారణుడును ఐన శ్రీకృష్ణ భగవానుని దివ్యస్థితిని సమస్త మానవాళికి ముఖ్యముగా ధార్మికులకు, తత్వవేత్తలకు ఉపదేశించుటకే శ్రీచైతన్యమహాప్రభువు అవతరించిరి. వ్రజభూమిలో (బృందావనము) వ్రజరాజ (నందమహారాజు) తనయునిగా ఆవిర్భవించిన శ్రీకృష్ణ భగవానుడే దేవదేవుడనియు, తత్కారణమున సర్వులచే పూజనీయుడనియు తెలుపుటయే శ్రీచైతన్యమహాప్రభువు యొక్క ముఖ్య ఉపదేశసారము. శ్రీకృష్ణ భగవానుని అవగతమొనర్చుకొనుటకు అమలమైన శ్రీమద్భాగవతమే సరియైనదని ఆయన పలికిరి. అంతియేగాని భగవంతుని ప్రేమను పొందుటయే సర్వ మానవుల జీవిత పరమ లక్ష్యమని ఆయన ఉపదేశించిరి.

బెంగాలీయులు మహాప్రభు చైతన్యుడిని కృష్ణుని అవతారంగా భావిస్తారు. చైతన్యుడి బోధనల్లో ఎక్కువగా భగవద్గీత, భాగవత పురాణాంలోని అంశాలు కనిపిస్తాయి.

హరే కృష్ణ హరే కృష్ణ! కృష్ణ కృష్ణ హరేహరే!
హరేరామ హరేరామ! రామరామ హరేహరే!!


భగవంతుని నామాలు అసంఖ్యాకమైనప్పటికీ, శ్రీచైతన్య మహాప్రభువులవారు ప్రత్యేకించి కలియుగ వాసులకు ఉపదేశించిన మహామంత్రం ఇదే. దీనిని ఎవ్వరైనా సరే, నిత్యం 108 సార్లు జపించి భగవంతుని పట్ల ప్రేమను పెంపొందించుకొనవచ్చు.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

# శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో "శ్రీనివాస కళ్యాణాలు" అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**


**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొంత వరకు గత నెల కంటే ఈ నెల అనుకూలంగా ఉంటుంది. ప్రతి విషయంలో ఆచితూచి వ్యవహరించాలి. పిల్లల కోరికలు తీర్చడంలో చాకచక్యంగా ఆలోచించి మాట్లాడాలి. శత్రువులు మిత్రువులుగా మారతారు. అమ్మవారి పూజ తప్పనిసరిగా చేయండి.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ ఈ రాశి స్త్రీ, పురుషులకు తెలియకుండానే ఆనందంగా ఉంటారు. అకస్మిక ధన లాభం ఉంది. ఓర్పుతో, నేర్పుతో వ్యవహరిస్తే, పెండింగ్ పనులు సానుకూలంగా జరిగిపోతుంటాయి. ఇది కాల మహిమ. అఖండ దీపారాధన, దేవి పూజలు చేయాలి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొంత అనుకూలంగా ఉన్నట్లు కనిపిస్తుంది. కొత్త స్నేహితులు వల్ల అభివృద్ధి ఉంటుంది. కానీ వారిపై అతి నమ్మకం వద్దు. నమ్మితే మోసం చేస్తారు. కొన్ని కొన్ని వ్యవహారాల దగ్గర మొహమాటం పనికిరాదు. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోగలరు. నమ్మకంతో దుర్గాదేవికి అవసరమైన పూజలు చేయండి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. చాలా జాగ్రత్తగా ఆలోచన చేసి నిర్ణయాలు తీసుకోవాల్సిన రోజులు ఇవి. నాలుకను అదుపులో ఉంచుకోవాలి. ఏ మాత్రం భయపడకూడదు. శని స్తోత్రం, శని ఆరాధన వలన శివ ధ్యానం వల్ల కొంత వరకు ఉపశమనం ఉంటుంది.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. ఏ విషయంలో చిరాకు పడరాదు. ఆదాయ వనరుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఖర్చులు అదుపులో పెట్టుకోవాలి. మీరు పట్టుదలతో కార్యాన్ని సాధించాలి. తొందరపాటు పనికిరాదు. పెద్దలను గౌరవించండి. లక్ష్మీ నారాయణుల నిత్య పారాయణం చేయండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో చికాకులతో పాటు మనో భీతి ఉంటుంది. ఏ విధంగా చూసిన అర్థం కాని పరిస్థితులు ఎదురవుతాయి. ప్రయాణంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. శకునం చూసి బయటకు వెళ్లండి. తొందరపాటు మంచిది కాదు. చాలా జాగ్రత్తగా ఆలోచన చేయండి. దుర్గాదేవి సప్తస్తుతి చేయండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. నవగ్రహ ప్రదక్షిణాలు చేయండి. ప్రతి విషయంలో కార్యానుకూలత కలిగి ఉంటారు. విద్యార్థులకు చాలా అనుకూలంగా ఉంటుంది. ఎవరికి వారు ప్రతి విషయంలో సామరస్యంగా పట్టు సాధించగలరు.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. కుటుంబంలో అందరూ కలిసి ఏ పనినైనా ప్రారంభించండి. చాలా సందర్భాల్లో కూల్‌గా, నిబ్బరంగా ఉండండి. వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. గురు పూజలు , సాయిబాబా దర్శనం, శనగ గుగ్గిలు చేసి ప్రసాదంగా గురువారం ఉదయం సాయిబాబా దేవాలయంలో పంచండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. ఏ విషయంలోనైనా ఆలోచన చేసి ముందుకు సాగండి. జాయింటు వ్యాపారాలు భార్యభర్తల బంధంలాగా ఉండాలి. ఏ చిన్న పని అయినా శ్రద్ధతో పూర్తి చేయుట మంచిది. మీ విషయాలు బయట వారికి తెలియనీయరాదు. శివారాధనతో శాంతి ఉంటుంది.

## మకరరాశి

**ఉత్తరాషాడ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. తొందరపాటు నిర్ణయాల వల్ల సమస్యల్లో చిక్కుకునే అవకాశాలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో కొన్ని పనులు వాయిదా వేయుట మంచిది. అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఉన్నాయి. జాగ్రత్తగా ఆలోచన చేసి, కొన్ని పనులు ప్రారంభించాలి. మహాన్యాస రుద్రాభిషేకం చేయండి.

## కుంభరాశి

**ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాబాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా అనకూలంగా ఉంటుంది. మీరు వెళ్లిన పనులు నెరవేరగలవు. ఆర్థిక విషయాల్లో వెసులుబాటు ఉంటుంది. తొందరపడి ఏ నిర్ణయాలు తీసుకోరాదు. ఆలోచన చేసి మంచి నిర్ణయాలు తీసుకోండి. నిర్ణయాలు తీసుకునేటప్పుడు కొన్ని మెలుకువలు పాటించండి. దక్షిణామూర్తిని ఆరాధించండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొన్ని సమస్యలు ఉన్నయి. అనారోగ్య సూచనలు కనబడుతున్నాయి. ఉద్రేక భావనాలకు అవకాశం ఉంది. కోపం, చికాకులకు ప్రధాన కారణం నదుల దగ్గర జలం ఊరుట తగ్గినప్పుడు అధికంగా ఉద్రేకపడగలరు. నోటిలో నీరు కొద్దిసేపు పెట్టుకుంటే చిక్కులు రావు.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**





## శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com


ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. ఏ మాసాన్ని వైశాఖ మాసం అంటారు?
2. "రామో విగ్రహవాన్ ధర్మః అన్నది ఎవరు?
3. నవ కళేబర ఉత్సవం – ఏ ఆలయంలో జరుగుతుంది?
4. నరసింహ రూపమున స్తంభమునుండి ఆవిర్భవించినదెవరు?
5. సమస్త దేవతలు, పదునాలుగు భువనాలు ఎక్కడ కొలువై ఉంటారు?
6. గొప్ప ఐక్యత ఎవరిలో ఉన్నది?
7. సావిత్రి వలన ఎవరికి దృష్టి వచ్చింది?
8. హనుమపై వజ్రాయుధం ప్రయోగించింది ఎవరు?
9. రావణుడికి ధర్మోపదేశం చేసిందెవరు?
10. అజామీళునికి మోక్షం ఎందుకు కలిగింది?
11. గంగానదికి ఈ సంవత్సరంలో ఎప్పటి నుండి ఎప్పటివరకు పుష్కరాలు జరుగుతాయి?
12. సావిత్రి తన భర్తను తిరిగి ఎలా పొందగలిగింది?
13. బుద్ధుడు బోధించిన మార్గమేది?
14. అలిపిరి – అంటే ఏమిటి?
15. కంచికామకోటి పీఠానికి 68వ అధిపతి ఎవరు?

1. ______
2. ______
3. ______
4. ______
5. ______
6. ______
7. ______
8. ______
9. ______
10. ______
11. ______
12. ______
13. ______
14. ______
15. ______

పేరు: ______

చిరునామా: ______

పిన్‌కోడ్: ______

ఫోన్: ______

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు


1. సీతాదేవి, 2. శిశుపాలుడు, రుక్మి, 3. మందర పర్వతాన్ని, 4. హోలిక, 5. సాళ్వ మహీపతి, 6. మారీచుడు, 7. గురువారం, 8. ఇటుక, 9. వల్లీదేవి – ఇచ్ఛాశక్తి, దేవసేన – క్రియాశక్తి 10. పుండరీకుని వలన, 11. కుశధ్వజుని, 12. గురువైన సాంధీపుని పుత్రుని బ్రతికించి ఇచ్చాడు, 13.శమీక మునికి, 14. ఆంగ్లేయుడైన గవర్నర్ థామస్ మన్రో, 15. కుక్కుటముని

## సరైన సమాధానాలు రాసినవారు

1. టి. సాయికుమార్, 2. అంజలి, 3. రాఘవేంద్రరావు, 4. సంపత్‌కుమార్, 5. వనజ

లక్కీడిప్ ద్వారా
స్వామివారి పాదాలు పొందిన విజేత

## రాఘవేంద్రరావు



Postel Registration No: HSE/879/2022-2024

Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month

RNI No.: APTEL/2008/23122




If Un delivered please return to:

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**

H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq